ప్రజావీక్షణం దినపత్రిక
విలేకర్లు కావలెను
అసలైన అక్షర జ్ఞానాన్ని తెలియజేస్తూ విలువలతో కూడిన జీవన శైలిలో
ప్రేరణ కలిగించే విషయాలపై అవగాహన కలిగిస్తూ
ప్రజల పక్షాన నిలబడాలని అనుకుంటున్నారా.?
బాధ్యతయుతమైన జర్నలిజంలో రాణించాలనుకుంటున్నారా.?
అయితే రండి.. అక్షరాన్ని అనుకున్న విధంగా రాద్దాం..
తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల వ్యాప్తంగా
జిల్లాలు, మండలాల వారీగా నిబద్ధతతో
పని చేసే విలేకరులు కావలెను
PJV ప్రజా వీక్షణం టీవి
9866330400


# ప్రజావీక్షణం

దినపత్రిక

ఎడిటర్ : కె. శ్రావణ్ కుమార్

PJV ప్రజా వీక్షణం టీవి

Subscribe

www.prajaveekshanam.in సంపుటి:16 సంచిక :140 14 మంగళవారం, ఏప్రిల్ 2026 పేజీలు : 12 వెల:రూ.2/-

Published from : Vijayawada, Krishna, Guntur, Kakinada, Vishakhapatnam, Vijayanagaram, Prakasham, Kadapa, Kurnool, Tirupathi, Anantapur, East Godavari, West Godavari


## భూ పరిపాలనకు కొత్త దిక్సూచి భూభారతి

- చరిత్రాత్మక చట్టానికి నేటితో ఏడాది పూర్తి
- ఏడాదిలో 5కోట్లకు పైగా భూభారతి పోర్టల్ సందర్శన
- 70 లక్షల మంది పోర్టల్ ద్వారా లాగిన్- 3.80లక్షల మందికిపాస్‌బుక్‌లజారీ జారీ
- పాతసర్వే పద్దతులకు స్వస్తి
- రోవర్లతో సర్వే- ప్రతి సర్వే నెంబర్‌కు భూధార్
- రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



హైదరాబాద్,ఏప్రిల్13 (ప్రజా వీక్షణం)

ఆనాటి బిఆర్ఎస్ ప్రభుత్వంలో కుప్పకూలిన రెవెన్యూ వ్యవస్థను గౌరవ ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి గారి నాయకత్వంలో పునర్నిర్మిస్తున్నామని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. - మిగతా 2 లో..

## మహిళా రిజర్వేషన్లతో

# పునర్విభజన లింక్



- ఇందులో బిజెపి రాజకీయ కుట్ర దాగి ఉంది
- పునర్విభజనను రాజకీయ పావుగా వాడుకుంటున్న మోడీ
- జనాభా లెక్కల అనంతరం మహిళా బిల్లు అని చెప్పారు
- ఆ మేరకే గతంలో బిల్లు పెట్టి..ఇప్పడీ హడావిడి ఎందుకు?
- పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలపై అనుమానాలు ఉన్నాయి
- 2011 జనాభా లెక్కల ప్రకారం మహిళా రిజర్వేషన్లు అమలు చేయాలి
- జనాభా లెక్కల తరవాత నియోజకవర్గాల పునర్విభజనపై చర్చించాలి
- దక్షిణాదిని దెబ్బతీసే కుట్రలో భాగంగానే ఉత్తరాది సీట్ల పెంపు
- 50శాతం సీట్ల పెంపు ఏ ప్రాతిపదకనో ఎందుకు చెప్పడం లేదు
- మీడియా సమావేశంలో సిఎం రేవంత్ రెడ్డి ఆగ్రహం

హైదరాబాద్,ఏప్రిల్13 (ప్రజా వీక్షణం)

మహిళారిజర్వేషన్లు, పునర్విభజనను కలపడంతో రాజకీయ కుట్ర ఉందని సిఎం రేవంత్ రెడ్డి ఆరోపించారు. 2026 జనాభా లెక్కల ప్రకారం మహిళారిజర్వేషన్లబిల్లు తీసుకువస్తే కాంగ్రెస్ పార్టీ సంపూర్ణ మద్దతు ఇవ్వడంతో పాటు కట్టుబడి ఉంటామని ప్రకటించిన విషయాన్ని గుర్తు చేశారు. హిళలరాజకీయసాధికారితకు కాంగ్రెస్ మొదటి నుంచి కట్టుబడి ఉంది..నియోజకవర్గాల పునర్వభజనను ప్రధాని మోదీ రాజకీయ పావుగా ప్రమాదకరంగా వాడుకుంటున్నాడని ఆరోపించారు. డీలిమిటేషన్, మహిళా రిజర్వేషన్ల అంశాలపై కీలక వ్యాఖ్యలు చేశారు. - మిగతా 2 లో..

## వికసిత భారత్ లక్ష్య సాధనలో మినరల్స్ కూడా కీలకమే

- మినరల్ రంగంలో ఆత్మనిర్భరత భారత్‌పై ప్రత్యేక దృష్టి
- కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి వెల్లడి

హైదరాబాద్,ఏప్రిల్13 (ప్రజా వీక్షణం)



ప్రపంచవ్యాప్తంగా క్రిటికల్ మినరల్స్ ప్రాముఖ్యం పెరుగుతోందని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. 2047 వికసిత భారత్ లక్ష్యాన్ని సాధించడంలో మినరల్స్ కీలక మని చెప్పుకొచ్చారు. మినరల్ రంగంలో ఆత్మనిర్భరత సాధించడంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు కిషన్ రెడ్డి తెలి పారు. సోమవారం హెచ్ఐసీపీలో భారత ప్రభుత్వ గనుల మంత్రిత్వ శాఖ ఆధ్వ ర్యంలో 2వ విడత ఎక్స్‌ప్లోరేషన్ లైసెన్స్ వేలం, 7వ విడత క్రిటికల్ / స్ట్రాటజిక్ మిన రల్ బ్లాక్స్ వేలం కార్యక్రమానికి కేంద్ర మంత్రి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. - మిగతా 2 లో..

## హోర్ముజ్‌పై ట్రంప్ వ్యాఖ్యలు

- దిగ్బంధిస్తే తీవ్ర పరిణామాలు
- ఘాటుగా హెచ్చరికలు చేసిన ఇరాన్

టెహ్రాన్,ఏప్రిల్13 (ప్రజా వీక్షణం)

హోర్ముజ్‌ను దిగ్బంధిస్తామన్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరిక లపై ఇరాన్ మరోసారి ఘాటుగా స్పందించింది. హోర్ముజ్ ఇప్పటికీ తమ నియంత్రణలోనే ఉందని పేర్కొంది. శత్రువులు ఏ చిన్న పొరపాటు చేసినా ప్రమాదం తప్పదని హెచ్చరించింది. - మిగతా 2 లో..

## ఐటి ఉద్యోగుల భద్రతపై ప్రత్యేక దృష్టి

- ఉద్యోగులపై మతపరమైన ఒత్తిళ్లు ఉండరాదు
- ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్న బండి సంజయ్



హైదరాబాద్,ఏప్రిల్13 (ప్రజా వీక్షణం)

నాసిక్‌లో జరిగిన 'లవ్ జిహాద్' ఆరోపణల కేసు నేపథ్యంలో కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ తీవ్రంగా స్పందించారు. హైదరాబాద్ ఐటీ రంగంలో పనిచేస్తున్న ఉద్యోగుల భద్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కోరారు. ఈ మేరకు బండి సంజయ్ కుమార్ ఓ ప్రకటన విడుదల చేశారు. - మిగతా 2 లో..



## మొబైల్ ఫోన్ల కొనుగోళ్లపై అసత్య ప్రచారాలు

- కెసిఆర్‌కు లీగల్ నోటీసులు పంపిన సీతక్క

హైదరాబాద్,ఏప్రిల్13 (ప్రజా వీక్షణం)

బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కు మంత్రి సీతక్క లీగల్ నోటీసులు పంపించారు. బీఆర్ఎస్ పార్టీ సోషల్ మీడియా చేస్తున్న తప్పుడు ఆరోపణలకు కేసీఆర్ బాధ్యత వహించాలని నోటీసుల్లో పేర్కొన్నారు. సోమవారం 13న రిజస్టర్ పోస్టు ద్వారా కేసీఆర్ కు లీగల్ నోటీసులు పంపించారు సీతక్క. సీతక్క తరుపు అడ్వకేట్ నాగులూరి కృష్ణ కుమార్ రిజిస్టర్ పోస్టు ద్వారా కేసీఆర్ కు లీగల్ నోటీస్ పంపించారు. అంగన్వాడి మొబైల్ ఫోన్ల కొనుగోలు విషయంలో నిరాధార ఆరోపణలు చేస్తూ తన ప్రతిష్టకు భంగం వాటిల్లేలా బీఆర్ఎస్ సోషల్ మీడియాలో పోస్టులు పెడుతోందని.. అందుకు కేసీర్ బాద్యత వహించాలనంటూ నోటీసుల్లో పేర్కొన్నారు.అంగన్వాడీ మొబైల్ ఫోన్ల కొనుగోలు పక్రియను తెలంగాణ టెక్నాలజీ సర్వీసెస్ లిమిటెడ్ నిర్వహించిందని తెలిపారు.

## పశ్చిమాసియాలో మళ్లీ ఉద్రిక్తతలు


- క్రూడాయిల్ బ్యారెల్ ధర 103 డాలర్లకు చేరిక
- భారీ నష్టాలతో ముగిసిన స్టాక్ మార్కెట్లు

న్యూఢిల్లీ,ఏప్రిల్13 (ప్రజా వీక్షణం)

పశ్చిమాసియాలో మళ్లీ ఉద్రిక్తతలు మొదలు కావడంతో ముడి చమురు ధరలు భగ్గుమన్నాయి. బ్రెంట్ క్రూడాయిల్ బ్యారెల్ ధర 103 డాలర్లకు చేరుకుంది. హోర్ముజ్‌ను దిగ్బంధిస్తామని ట్రంప్ ప్రకటించడం మరింత ఆందోళన కలిగిస్తోంది.ఈ నేపథ్యంలో అంతర్జాతీయ మార్కెట్లు డీలాపడ్డాయి. మరోవైపు డాలర్‌తో పోల్చుకుంటే రూపాయి మరింత పతనమైంది. ఇన్ని వ్యతిరేకతల నేపథ్యంలో సోమవారం సూచీలు నష్టాలతో ప్రారంభమయ్యాయి. - మిగతా 2 లో..

## అంగన్వాడీ టీచర్లకు స్మార్ట్ ఫోన్లు

- వికలాంగులకు ట్రై సైకిళ్లు
- మహిళలకు కుట్టు మిషన్లను పంపిణీ
- ఫోన్‌ల కొనుగోళ్లలో అక్రమాలు లేవన్న తుమ్మల



ఖమ్మం,ఏప్రిల్13 (ప్రజా వీక్షణం)

సంక్షేమ పథకాల అమలు, మహిళల ఆర్థిక స్వావలంబన దిశగా ముందడుగు వేసింది. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఖమ్మంలో జరిగిన పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొని, అంగన్వాడీ టీచర్లకు స్మార్ట్ ఫోన్లు, వికలాంగులకు ట్రై సైకిళ్లు, మహిళలకు కుట్టు మిషన్లను పంపిణీ చేశారు. అంగన్వాడీ టీచర్లకు స్మార్ట్ ఫోన్ల పంపిణీ సందర్భంగా మంత్రి తుమ్మల కీలక వ్యాఖ్యలు చేశారు.అంగన్వాడీల సేవలు అమూల్యమని, రాజకీయాలకు అతీతంగా పనిచేయాలని పిలుపు నిచ్చారు.ఉంటుంది' అని మంత్రి చెప్పారు. - మిగతా 2 లో..

## శ్రీపాదరావుకు సిఎం రేవంత్ నివాళి

హైదరాబాద్,ఏప్రిల్13 (ప్రజా వీక్షణం)

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ శాసనసభ మాజీ స్పీకర్ దుద్దిళ్ల శ్రీపాదరావు 27 వ వర్ధంతి సందర్భంగా జూబ్లీహిల్స్ నివాసంలో ఆయన చిత్రపటం వద్ద ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నివాళులు అర్పించారు. తెలుగు రాష్ట్రాల్లో తనకంటూ ఒక ప్రత్యేకతను చాటుకున్న నాయకుడు దుద్దిళ్ల శ్రీపాదరావు అని ఈ సందర్భంగా సీఎం నివాళి అర్పించారు.



## శవరాజకీయాలుల్లో జగన్ దిట్ట

- తండ్రి చనిపోతే సిఎంకోసం పైరవీలు
- మంత్రి అచ్చన్నాయుడు విమర్శలు

అమరావతి,ఏప్రిల్13 (ప్రజా వీక్షణం)



శవరాజకీయలు నెరపడంలో జగన్ దిట్ట అని, వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై ఏపీ వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు సంచలన వ్యాఖ్యలు చేశారు. దివంగత మాజీ సీఎం వైఎస్ రాజశేఖర్ రెడ్డి, జగన్ తన తండ్రి శవం పక్కన ఉండగానే ముఖ్యమంత్రి కుర్చీ కోసం సంతకాలు సేకరించిన ఘనుడని సెటైర్లు గుప్పించారు.ఆయన శవ రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. సోమవారం మంగళగిరిలోని టీడీపీ కార్యాలయంలో అచ్చెన్నాయుడు మీడియాతో మాట్లాడారు. జగన్ రెడ్డి చరిత్ర ఈ రాష్ట్రానికి వెన్నతో పెట్టిన విద్య అని ఎద్దేవా చేశారు.

ప్రజావీక్షణం
దినపత్రిక

# మహిళా రిజర్వేషన్లతో పునర్విభజన లింక్

మొదటిపేజీ తరువాయి

మహిళా రిజర్వేషన్ బిల్లు ఆమోదం కోసమే పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలు నిర్వహిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. డీలిమిటేషన్ అనేది రాజకీయ పార్టీలకో, ప్రభుత్వానికో సంబంధించిన అంశం కాదని స్పష్టం చేసిన సీఎం రేవంత్, దీనిని మహిళా రిజర్వేషన్లతో కలిపి చూపించడం సరైంది కాదన్నారు. అయితే కేంద్ర ప్రభుత్వం ఈ రెండు అంశాలను కలిపి వ్యూహాత్మకంగా ముందుకు సాగుతోందని విమర్శించారు. సోమవారం సాయంత్రం సచివాలయంలో ఆయన మంత్రులు, ఎంపిలు, ఇతర నాయకులతో కలసి మీడియా సమావేశంలో మాట్లాడారు. మహిళా రిజర్వేషన్ల విషయంలో కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా దుష్ప్రచారం జరుగుతోందని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. మహిళలకు ఓటుహక్కు, రాజకీయ రిజర్వేషన్లు కల్పించడంలో కాంగ్రెస్ పార్టీ కీలక పాత్ర పోషించిందని ఆయన గుర్తు చేశారు. కాంగ్రెస్ హయాంలోనే మహిళలు ముఖ్యమైన పదవులు చేపట్టిన విషయాన్ని కూడా ఆయన ప్రస్తావించారు. మహిళా రిజర్వేషన్లు, డీలిమిటేషన్ రెండూ వేర్వేరు అంశాలని స్పష్టం చేసిన రేవంత్ రెడ్డి, వీటిని కలిపి బీజేపీ రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగిస్తోందని విమర్శించారు. ముఖ్యంగా 2011 జనాభా లెక్కల ఆధారంగా ఈ రెండు అంశాలను అనుసంధానించడం వెనుక రాజకీయ కుట్ర, వివక్ష ఉన్నాయని అన్నారు. మహిళా రిజర్వేషన్ బిల్లుకు తమ పూర్తి మద్దతు ఉందని ప్రకటించిన సీఎం రేవంత్, ప్రస్తుతం ఉన్న పార్లమెంట్ సీట్ల ఆధారంగానే ఈ బిల్లును అమలు చేయాలని కేంద్రాన్ని కోరారు. 2024 సార్వత్రిక ఎన్నికల సమయంలోనే ఈ బిల్లును అమలు చేసి ఉంటే, మరింత మంది మహిళలు పార్లమెంట్‌కు ఎన్నికయ్యేవారని రేవంత్ రెడ్డి అభిప్రాయపడ్డారు. రాజ్యాంగంలోనే పురుషులతో పాటు మహిళలకు ఓటు హక్కు ఇచ్చింది కాంగ్రెస్ పార్టీ అని అన్నారు. అప్పటికిప్రపంచంలోని చాలా దేశాల్లో మహిళలకు ఓటు హక్కు లేదు.. పురుషులతో పాటు మహిళలకు సమాన అవకాశాలు కల్పించింది కాంగ్రెస్ పార్టీ మాత్రమేనని అన్నారు. దేశ ప్రధానిగా, రాష్ట్రపతిగా, లోక్ సభస్పీకర్ గా, ముఖ్యమంత్రులుగా, గవర్నర్లుగా చాలా రాజ్యాంగబద్ధమైన పదవుల్లో మహిళలకు కాంగ్రెస్ అవకాశం కల్పించిందని గుర్తు చేశారు. మహిళలనాయకత్వంలోపనిచేసిన పార్టీ కాంగ్రెస్.. రాజీవ్ గాంధీ స్థానిక సంస్థల్లోమహిళలకురిజర్వేషన్లుతీసుకువచ్చారు.. సోనియా గాంధీ నాయకత్వంలో చట్టసభల్లో మహిళా రిజర్వేషన్ బిల్లు తీసుకువచ్చారు.. అప్పుడు రాజ్యసభలో ఆమోదించారు..బీజేపీ సహకరించకపోవడం వల్లనే లోక్ సభలోమహిళారిజర్వేషన్ బిల్లు ఆమోదం పొందలేదన్నారు. ఇంతకాలం ప్రధాని మోదీ ఈ బిల్లును పట్టించుకోలేదు. 2023 లో మహిళారిజర్వేషన్ బిల్లుకు కాంగ్రెస్ పార్టీ సంపూర్ణ మద్దతుఇచ్చింది.. 2026 జనాభాలెక్కల తర్వాతగెజిట్ ఆధారంగా మహిళారిజర్వేషన్లు అమలు చేస్తామని చట్టం చేశారు... 2026జనభా లెక్కలు పూర్తి చేసి అమలు చేయకుండా 2011జనాభాలెక్కల ఆధారంగా చట్టం ముందుకు తెస్తున్నారు.. 2026జనాభా లెక్కలప్రకారం నిబంధనను సవరించుకుంటే 2029 లోక్ సభతో పాటు వివిధ రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో మహిళా రిజర్వేషన్లు అమలుచేయొచ్చన్నారు. ఇకపోతే 2011 జనాభా లెక్కల ప్రకారం డీలిమిటేషన్ చేయాలని ఎన్డీయే చూస్తోందన్నారు. కానీ, 2026 జనాభా లెక్కల ప్రకారం డీలిమిటేషన్, మహిళా రిజర్వేషన్లు అమలు చేయాలన్నది కాంగ్రెస్ డిమాండ్ అని చెప్పారు. ఈ రెండింటినీ కలపడం, పాత జనాభా లెక్కల ప్రకారం వెళ్లడంలో కుట్ర ఉందని ఆక్షేపించారు. 33శాతం మహిళా రిజర్వేషన్లకు కాంగ్రెస్ సంపూర్ణ మద్దతు ఇస్తుందన్నారు. ఈ రిజర్వేషన్లను ఆర్నెల్లలోనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. డీలిమిటేషన్ పక్రియ చాలా ప్రమాదకర దిశలో వెళ్తోంది. చిన్న రాష్ట్రాలు, దక్షిణాదికి అన్యాయం జరిగేలా మోదీ కుట్ర చేస్తున్నారు. కుటుంబ నియంత్రణను దక్షిణాది రాష్ట్రాలు సమర్థంగా అమలు చేశాయి. ఉత్తరాదిలో అది సరిగ్గా అమలు కాకపోవడం వల్లే జనాభా విపరీతంగా పెరిగింది. జనాభా ప్రాతిపదికన సీట్ల పెంపు వద్దని దక్షిణాది రాష్ట్రాలు గట్టిగా చెప్పాయి. దక్షిణాది రాష్ట్రాల వ్యతిరేకత వల్ల మోదీ కొత్త ప్రతిపాదన తీసుకొచ్చారు. ప్రతి రాష్ట్రంలో 50శాతం సీట్లు పెంచుతామని చెబుతున్నారు. ఇలా చేస్తే.. యూపీ, బిహార్, మధ్యప్రదేశ్, రాజస్థాన్‌లలో సీట్లు బాగా పెరగనున్నాయి. ఉత్తరాది, దక్షిణాది రాష్ట్రాల మధ్య లోక్‌సభ సీట్లలో అంతరం భారీగా పెరుగుతుందన్నారు. సీట్ల పెంపు తర్వాత దక్షిణాదిలో 195 లోక్‌సభ స్థానాలు అవుతాయి. ఉత్తరాదిలో సీట్లు 620కి పెరుగుతాయి. ఉత్తర, దక్షిణాది మధ్య ప్రస్తుతం ఉన్న 210 సీట్ల అంతరం 412కి పెరుగుతుంది. ఎన్డీయే ప్రభుత్వంలో దక్షిణాది రాష్ట్రాలకు ఏమాత్రం ప్రాధాన్యం దక్కడం లేదు. కేంద్రంలోని కీలక శాఖలు ఏవీ దక్షిణాది రాష్ట్రాలకు ఇవ్వడం లేదు. సీట్లు పెంచాలనుకుంటే అఖిలపక్షాన్ని పిలిచి మాట్లాడాలి. ఏ ప్రాతిపదికన 50 శాతం సీట్లు పెంచుతారు? సీట్లు 50 శాతం పెంచాలని మోదీకి ఏ దేవుడు చెప్పాడు? 50శాతం సీట్లు పెంచితే ఉత్తరాది, దక్షిణాది మధ్య తీవ్ర అంతరం ఏర్పడుతుంది. దక్షిణాదిపై చూపుతున్న వివక్షతో దేశ సమగ్రతకు ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందని హెచ్చరించారు. దక్షిణాది రాష్ట్రాల పట్ల వివక్షను మరింత పెంచేలా భాజపా వ్యవహరిస్తోందన్నారు. దక్షిణాది రాష్ట్రాల పరిస్థితి.. పన్నులు కట్టడం, దిల్లీకి వెళ్లి సలాం కొట్టడం అన్నట్లుగా ఉంది. దీనికి మేం వ్యతిరేకం. దక్షిణాది రాష్ట్రాలు దేశానికి ఫైనాన్షియల్ కేపిటల్స్. ఉత్తరాది రాష్ట్రాలు పొలిటికల్ కేపిటల్స్. పొలిటికల్ కేపిటల్స్ ఎప్పుడూ ఫైనాన్షియల్ కేపిటల్స్‌ని తక్కువగా చూస్తాయి. దక్షిణాది రాష్ట్రాలు ద్వితీయ శ్రేణి పౌరులుగా మిగిలిపోతారని అన్నారు. హైబ్రిడ్ ప్రాతిపదికన సీట్లు పెంచాలనేది మా డిమాండ్. కొత్తగా పెంచే సీట్లలో 50 శాతానికి జీడీపీని ప్రాతిపదికగా తీసుకోవాలి. కొత్తగా పెంచే సీట్లలో 136 సీట్లు జీడీపీ వృద్ధి ఆధారంగా పెంచాలి. మరో 136 సీట్లను జనాభా ప్రాతిపదికగా పెంచాలి. దేశానికి ఆదాయం ఇస్తున్న రాష్ట్రాలను గౌరవించాలి. చిన్న రాష్ట్రాలకు కూడా న్యాయం జరిగేలా గతంలో సీట్ల కేటాయింపు జరిగిందని రేవంత్‌రెడ్డి అన్నారు. మీడియా సమావేశంల మంత్రులు భట్టి విక్రమార్క, పొన్నం ప్రభాకర్, కోమటిరెడ్డి, సీతక్క, పొంగులేటి, ఎంపిలు రఘురామిరెడ్డి, మల్లు రవి, సలహాదారు కేశవరావు తదితరులు పాల్గొన్నారు.

# అంగన్వాడీ టీచర్లకు స్మార్ట్ ఫోన్లు

మొదటిపేజీ తరువాయి

స్మార్ట్ ఫోన్ల కొనుగోలుపై జరుగుతున్న ప్రచారాన్ని ఆయన ఖండించారు. నేరుగా కంపెనీ నుంచే అతి తక్కువ ధరకే ఫోన్లు కొనుగోలు చేశామని, పారదర్శకత కోసమే ఈ డిజిటల్ విప్లవాన్ని అంగన్వాడీల్లో ప్రవేశపెట్టామని స్పష్టం చేశారు. జిల్లావ్యాప్తంగా అంగన్వాడీలకు కొత్త భవనాల నిర్మాణం చేపడుతున్నామని, గతంలో తానే మంత్రిగా ఉన్నప్పుడు రెండుసార్లు జీతాలు పెంచిన విషయాన్ని ఆయన గుర్తుకు తెచ్చుకున్నారు. మంత్రి క్యాంప్ కార్యాలయంలో నిర్వహించిన 'ఇందిరా మహిళా శక్తి సంబరాల'లో భాగంగా 500 మంది మహిళలకు కుట్టు మిషన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మహిళా సంక్షేమంపై ప్రభుత్వం చేస్తున్న ఖర్చును మంత్రి వివరించారు. డ్వాక్రా మహిళల కోసం ఈ ఏడాది 23 వేల కోట్ల రూపాయల రుణాలను మంజూరు చేశామని తెలిపారు. మహిళలకు ఆర్టీసీ ఉచిత బస్సు ప్రయాణం ద్వారా ఇప్పటివరకు 10 వేల కోట్ల రూపాయల లబ్ది చేకూరిందని పేర్కొన్నారు. పేదలందరికీ సన్నబియ్యం అందించడం కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం 14 వేల కోట్ల రూపాయలు ఖర్చు చేస్తోందని, గత ప్రభుత్వ హయాంలో జరిగిన రేషన్ బియ్యం అక్రమాలకు అడ్డుకట్ట వేశామని చెప్పారు. ముఖ్యంగా మహిళలు తమ పిల్లల చదువుపై దృష్టి సారించాలని మంత్రి కోరారు. ఖమ్మం జిల్లాలో 3,000 మంది పిల్లలకు గురుకులాల్లో చదువుకునే అవకాశం ఉందని, ఒక్కో విద్యార్థిపై ప్రభుత్వం ఏడాదికి 1.50 లక్షల రూపాయలు ఖర్చు చేస్తోందని వెల్లడించారు. ఉన్నత విద్య చదివిస్తేనే కుటుంబాలు పేదరికం నుంచి బయటపడతాయని ఆయన వెల్లడించారు.

# వికసిత భారత్ లక్ష్య సాధనలో మినరల్స్ కూడా కీలకమే

మొదటిపేజీ తరువాయి

ఈ సందర్భంగా కిషన్ రెడ్డి మాట్లాడుతూ.. జియోపాలిటిక్స్, క్లైమేట్ మార్పు, ఆర్థిక భద్రతలో ఈ మినరల్స్ కీలక పాత్ర పోషిస్తున్నాయని వివరించారు. ఇప్పటివరకు 46 బ్లాక్స్ వేలం విజయవంతంగా పూర్తి చేశామని కేంద్ర మంత్రి వెల్లడించారు. 7వ విడతలో 19 బ్లాక్స్‌ల వేలం ప్రారంభమైందన్నారు. మినరల్ ఎక్స్‌ప్లోరేషన్ లైసెన్స్ మొదటి విడత ప్రారంభమైందని.. త్వరలోనే 11 బ్లాక్స్‌లకు రెండో విడత లైసెన్స్ వేలం నిర్వహించనున్నట్లు తెలిపారు. తెలంగాణలో 2 వెనేడియం, టైటానియం బ్లాక్స్ సిద్ధం చేసినట్లు మంత్రి ప్రకటించారు. మైనింగ్ కార్యకలాపాలను వేగవంతం చేయడం కోసం చట్టాల్లో మార్పులు తీసుకొస్తున్నామని చెప్పారు. రాష్ట్రాలు స్వతంత్రంగా వేలం నిర్వహించే అవకాశం కల్పించనున్నట్లు చెప్పారు. పర్యావరణ అనుమతుల పక్రియను సరళీకరించడం, 24 మినరల్స్‌పై కస్టమ్స్ డ్యూటీ రద్దు చేయడం, త్వరగా ఉత్పత్తి ప్రారంభించే కంపెనీలకు ప్రోత్సాహకాలు అందించడం వంటి చర్యలు తీసుకోనున్నట్లు కిషన్ రెడ్డి వివరించారు. స్క్రాప్ నుంచి మినరల్స్ రీసైక్లింగ్‌పై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామన్నారు. విదేశాల్లో మైనింగ్ ప్రయత్నాలు చేపట్టామని తెలిపారు. రక్షణ రంగం, ఎలక్ట్రిక్ వెహికల్స్, గ్రీన్ ఎనర్జీకి క్రిటికల్ మినరల్స్ కీలకమని.. ప్రైవేట్ సంస్థలు భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. భారత్‌ను గ్లోబల్ మైనింగ్ లీడర్‌గా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ప్రభుత్వం కృషి చేస్తోందని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి స్పష్టం చేశారు.

# భూ పరిపాలనకు కొత్త దిక్సూచి భూభారతి

మొదటిపేజీ తరువాయి

భూహక్కుల పరిరక్షణ, పారదర్శకత, అవినీతి రహిత సేవలు సామాన్యుడికి సులభంగా అందేలా గత ఏడాది రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన భూభారతి చట్టం తెలంగాణ చరిత్రలో కీలక సంస్కరణగా నిలుస్తోందన్నారు. ఈనెల 14వ తేదీతో భూభారతి చట్టం అమలులోకి వచ్చి ఏడాది పూర్తవుతున్న సందర్భంగా సోమవారం నాడు సచివాలయంలోని తన కార్యాలయంలో మంత్రి గారు అధికారులతో భూభారతి చట్టంపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇది కేవలం ఒక చట్టానికి ఏడాది పూర్తైన సందర్భం మాత్రమే కాదని, తెలంగాణ రాష్ట్రంలో భూహక్కుల రక్షణకు ప్రారంభమైన కొత్త శకానికి నాందిపలికిన రోజని వ్యాఖ్యానించారు. భూభారతి చట్టానికి ముందు ఆ తర్వాత ఉన్న పరిస్థితులపై అధికారులతో చర్చించారు. ఈ చట్టం తీసుకువచ్చే నాటికి ధరణి పోర్టల్ వల్ల తెలంగాణ ప్రజానీకం ఎదుర్కొన్న పరిస్థితులను ఈ సందర్భంగా మంత్రిగారు గుర్తు చేశారు. 'నాటి పరిస్థితిని పూర్తిగా మార్చాలన్న సంకల్పంతో పారదర్శకత, బాధ్యతాయుత, వేగం అనే మూడు ప్రధాన సూత్రాలతో రెవెన్యూ వ్యవస్థను ప్రజలకు చేరువచేస్తున్నాం. ఈ క్రమంలోనే చారిత్రాత్మకమైన భూభారతి చట్టాన్ని తీసుకువచ్చాం. ఈ చట్టం రాష్ట్రంలోని భూ పరిపాలనను పారదర్శకంగా సులభంగా మార్చింది. బిఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో సరైన విధివిధానాలు లేకుండా తీసుకొచ్చిన 2020 ఆర్వోఆర్ చట్టం, ధరణి పోర్టల్ వల్ల లక్షలాది మంది ప్రజలు తమ భూముల హక్కుల విషయంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. భూమి తమదే అయినప్పటికీ హక్కులను నిరూపించుకునేందుకు అధికారుల, కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఉండేది. ఆనాటి పరిస్థితులను చూసి అధికారంలోకి వచ్చిన వెంటనే ధరణి పోర్టల్‌ను బంగాళాఖాతంలో కలుపుతామని ఇచ్చిన మాటను నిలబెట్టుకొని గత ఏడాది ఏప్రిల్ 14న డాక్టర్ బిఆర్ అంబేద్కర్ జయంతి రోజున గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిగారి చేతుల మీదుగా భూభారతి పోర్టల్‌ను ఆవిష్కరించుకున్నాం. తెలంగాణ రైతాంగానికి భూ భద్రత కల్పించడంలో భూభారతి ఒక బలమైన ఆయుధంగా మారింది. భూ వివాదాలకు చరమగీతం పాడుతూ, సామాన్యుడికి రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరిగే తిప్పలు తగ్గించడంలో ఈ ఏడాది కాలం ఒక గొప్ప ముందడుగుగా నిలిచింది. ఈ 12 నెలల కాలంలో భూభారతి పోర్టల్ పాత చిక్కుముడులను విప్పడంలో కీలక పాత్ర పోషించింది. ఈ పోర్టల్ ప్రారంభించిన ఏడాదిలోపే 5.20 కోట్లకు పైగా ప్రజలు ఈ పోర్టల్‌ను సందర్శించారు. సుమారు 67 లక్షల మంది పోర్టల్ ద్వారా లాగిన్ అయ్యారు. ప్రజల కోసం రెవెన్యూ శాఖ లో గణనీయమైన మార్పులు తెస్తున్నాం. రైతులకు పారదర్శకంగా సులభతరమైన సేవలు అందించడానికి రెవెన్యూ, సర్వే, స్టాంప్స్ / రిజిస్ట్రేషన్ విభాగాలను ఒకే గొడుగు కిందకు తీసుకువచ్చి కేంద్ర ప్రభుత్వం సంస్థ ఎన్.ఐ.సి.తో కలిసి రూపొందించిన ఇంటిగ్రేటెడ్ భూభారతి పోర్టల్‌ను ఈనెల 2వ తేదీ నుంచి ఐదు జిల్లాల్లోని ఐదు మండలాల్లో? ప్రయోగాత్మకంగా ప్రారంభించడం జరిగింది. ఇక్కడ ఎదురయ్యే మంచి చెడులను పరిగణనలోకి తీసుకొని అవసరమైన మార్పులు చేర్పులు చేసి వచ్చే నెలలో జిల్లాకు ఒక మండలంలో ప్రారంభిస్తాం. ఈ ఐదు మండలాల్లో కూడా ప్రతి సర్వే నెంబరుకు భూధార్ నెంబర్‌ను కేటాయిస్తాం. రాష్ట్రంలో భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపాలన్న సంకల్పంతో మా ప్రభుత్వం పనిచేస్తోంది. రాష్ట్రంలో నిజాం కాలం నుంచి 378 గ్రామాలను నక్షాలు లేవు. ఇందులో ఐదు గ్రామాలలో రీ సర్వే పూర్తి చేసి భూదార్ నెంబర్ కేటాయించాం. మిగిలిన 373 గ్రామాల్లో రోవర్స్ వంటి ఆధునిక సర్వే సాంకేతికతను ఉపయోగించి రీసర్వే పనులు కొనసాగిస్తున్నాం. ÷ల్లాకు 70 రెవెన్యూ గ్రామాలను గుర్తించి సర్వే చేపట్టబోతున్నాం. సర్వే అనంతరం హద్దులను గుర్తించి భూధార్ నెంబర్ ఇస్తాం. ఈ విధంగా రాష్ట్ర వ్యాప్తంగా దశల వారీగా సర్వే నిర్వహించాలని నిర్ణయించాం. తెలంగాణ ప్రాంతంలో 1948 నాటికి సుమారు 40 లక్షల సర్వేనెంబర్లు వినియోగంలో ఉండగా అప్పటి నుంచి ఇప్పటివరకు ఈ 77 సంవత్సరాలలో 2కోట్ల 29 లక్షలకు చేరాయి. వీటన్నింటికీ భూధార్ నెంబర్ ఇవ్వడానికి ప్రణాళికలు తయారుచేస్తున్నాం. భూ సర్వేకు అవసరమైన సిబ్బందిని సమకూర్చుకోవడం జరిగింది. శిక్షణ ఇచ్చి 5,520 మంది లైసెన్స్‌డ్ సర్వేయర్లకు లైసెన్స్‌లు జారీ చేశాం. భూవిస్తీర్ణాన్ని బట్టి ప్రతి మండలానికి 4 నుంచి 6గురు సర్వేయర్లను నియమించాం. రాష్ట్రంలోని 10,984 రెవెన్యూ గ్రామాలను క్లస్టర్లుగా విభజించి జీపీవోలను నియమించడం జరిగింది. గొలుసులు, కర్రలు, క్రాస్ స్టాఫ్, మెజరింగ్ టేప్ వంటి పాత సర్వే పరికరాలకు స్వస్తి చెప్పి అత్యాధునిక యంత్రాలు, సాంకేతిక పరిజ్ఞానం వీలైనంత వరకు వినియోగించుకుంటున్నాం. ఇప్పటికే 411 రోవర్లను కొనుగోలు చేశాం. త్వరలో మరో 400 కొనుగోలు చేయబోతున్నాం. భూ భారతి పోర్టల్ ప్రారంభించిన గత ఏడాది ఏప్రిల్ 14 నుంచి ఇప్పటి వరకు 3.80 లక్షల పాస్ బుక్ లు జారీచేశాం.'అని వివరించారు

# ఐటి ఉద్యోగుల భద్రతపై ప్రత్యేక దృష్టి

మొదటిపేజీ తరువాయి

దేశవ్యాప్తంగా, ముఖ్యంగా ఐటీ రంగంలో పనిచేస్తున్న ఉద్యోగులపై మతపరమైన ఒత్తిళ్లు, వేధింపులు, రహస్య నెట్‌వర్క్‌ల ప్రభావం ఉండకూడదని తెలిపారు. హైదరాబాద్‌లో లక్షలాది మంది ఐటీ ఉద్యోగులు ఉన్నందున వారి పని వాతావరణం కేవలం కెరీర్ అభివృద్ధికి మాత్రమే పరిమితం కావాలని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వానికి బండి సంజయ్ కొన్ని కీలక సూచనలు చేశారు. అన్ని ప్రధాన ఐటీ కంపెనీల హెచ్‌ఆర్ బృందాలతో తక్షణ సమావేశం నిర్వహించాలని సూచించారు. ఉద్యోగుల భద్రతపై స్పష్టమైన విధానాలు రూపొందించాలని అన్నారు. ఉద్యోగుల ఫిర్యాదులపై కఠిన చర్యలు తీసుకోవాలని, ఏ కేసును కూడా దాచిపెట్టకూడదని చెప్పుకొచ్చారు. ఉద్యోగులు కార్యాలయాల్లో స్వేచ్ఛగా, భద్రతతో పనిచేసే వాతావరణం ఉండాలని బండి సంజయ్ కుమార్ సూచించారు. ఏ రకమైన ఒత్తిడి, వేధింపులు, దోపిడీకి అవకాశం ఇవ్వకూడదని స్పష్టం చేశారు. అలాగే, బాధితులు ఒంటరిగా ఉండకుండా వారికి తగిన రక్షణ, మద్దతు అందించాలని సూచించారు. పలువురు ఉద్యోగులు ఇప్పటికే కార్యాలయాల్లో జరిగిన అనుభవాలను సోషల్ మీడియాలో పంచుకుంటున్నారని పేర్కొన్నారు. ఈ హెచ్చరిక సంకేతాలను ప్రభుత్వం, కంపెనీలు నిర్లక్ష్యం చేయకూడదని సూచించారు. ఐటీ కంపెనీల యాజమాన్యాలు, హెచ్‌ఆర్ విభాగాలు ఉద్యోగుల భద్రతకు అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలని బండి సంజయ్ కుమార్ కోరారు. ప్రతి ఫిర్యాదును నిష్పక్షపాతంగా, వేగంగా పరిష్కరించాల్సిన అవసరం ఉందని చెప్పారు. నాసిక్ కేసు నేపథ్యంలో వచ్చిన ఈ వ్యాఖ్యలు దేశవ్యాప్తంగా ఐటీ రంగ భద్రతపై చర్చను మరింత పెంచాయని తెలిపారు. ఉద్యోగుల రక్షణ, కార్యాలయాల్లో పారదర్శకత, ఫిర్యాదు వ్యవస్థ బలోపేతం వంటి అంశాలు ఇప్పుడు కీలకంగా మారాయని పేర్కొన్నారు.

# హోర్ముజ్‌పై ట్రంప్ వ్యాఖ్యలు

మొదటిపేజీ తరువాయి

అంతకుముందు ఇరాన్ సైనిక దళం (ఐఆర్‌జీసీ) కూడా ట్రంప్‌కు గట్టి వార్నింగ్ ఇచ్చిన విషయం తెలిసిందే. హోర్ముజ్ వైపు వచ్చే యుద్ధ నౌకలపై దాడి చేస్తామని హెచ్చరించింది. పౌర నౌకల రాకపోకలకు మాత్రం ఎలాంటి ఇబ్బందీ ఉండదని భరోసా ఇచ్చింది. యుద్ధ నౌకలు వస్తే మాత్రం కాల్పుల విరమణను ఉల్లంఘించినట్టేనని స్పష్టం చేసింది. ఇక యూఎస్‌తో చర్చలు విఫలం కావడంపై ఇరాన్ మంత్రి అరాగ్చీ ఎక్స్ వేదికగా కీలక వ్యాఖ్యలు చేశారు. 47 ఏళ్ల తరువాత జరిగిన అత్యున్నత స్థాయి చర్చలకు తాము సదుద్దేశంతో వెళ్లామని చెప్పారు. ఒప్పందం అంగుళం దూరంలో ఉండగా యూఎస్ తన లక్ష్యాలను, ఉద్దేశాలను మార్చుకుందని ఆరోపించారు. మునుపటి అనుభవాల నుంచి ఎలాంటి గుణపాఠాలను అమెరికా నేర్చుకోలేదని అన్నారు. మంచి భావాలుంటే చివరకు మంచే జరుగుతుందని అన్నారు. మనసులో శత్రుత్వం ఉంటే తుదకు అదే మిగులుతుందని ఎక్స్ వేదికగా పోస్టు పెట్టారు. సోమవారం హోర్ముజ్‌లో నౌకల ట్రాఫిక్ స్తంభించిపోయిందని లాయిడ్స్ లిస్ట్ ఇంటెలిజెన్స్ అనే మారిటైమ్ సంస్థ తాజాగా పేర్కొంది. హోర్ముజ్‌ను దిగ్బంధిస్తామన్న ట్రంప్ ప్రకటన తరువాత నౌకల రాకపోకలు నిలిచిపోయాయని పేర్కొంది. ఎలాంటి ఒప్పందం లేకుండా ఇరాన్‌తో చర్చలు ముగియడంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి స్పందించారు. గతంలో కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందం మాత్రం కొనసాగుతోందని అన్నారు. ఇరాన్ మళ్లీ చర్చలకు వస్తుందా? రాదా? అనేది తనకు ఇక అనవసరమని కూడా చెప్పారు. ఇప్పటికే ఇరాన్ పరిస్థితి దగజారిందని, మిలిటరీ ధ్వంసమైపోయిందని చెప్పారు. శాంతి చర్చలు విఫలమవడానికి అమెరికానే కారణమని ఇరాన్ ఆరోపించింది. యుద్ధాన్ని ముగించేందుకు అమెరికాతో ఇరాన్ చిత్తశుద్ధితో సంప్రదింపులు చేసింది. కానీ, ఇస్లామాబాద్ ఒప్పందానికి కొన్ని అంగుళాల దూరంలోనే చర్చలు కుప్పకూలాయి. అతివాద భావజాలం, లక్ష్యాలు మారడం, నిర్బంధం వంటివి మాకు ఎదురయ్యాయి. మంచి చేస్తే మంచి జరుగుతుంది. చెడు చేయాలని చూస్తే శత్రుత్వమే మిగులుతుందని ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చి పోస్ట్ చేశారు.

# పశ్చిమాసియాలో మళ్లీ ఉద్రిక్తతలు

మొదటిపేజీ తరువాయి

గత సెషన్ ముగింపు (76,794)తో పోల్చుకుంటే సోమవారం ఉదయం దాదాపు 1600 పాయింట్ల నష్టంతో మొదలైన సెన్సెక్స్ రోజంతా నష్టాల్లోనే కదలాడింది. అయితే ఉదయం భారీ నష్టాలను చవి చూసిన సూచీలు మధ్యాహ్నం తర్వాత కాస్త కోలుకున్నాయి. చివరకు సెన్సెక్స్ 702 పాయింట్ల నష్టంతో 76,847 వద్ద రోజును ముగించింది. మరో వైపు నిఫ్టీ కూడా సెన్సెక్స్ బాటలోనే కదలాడింది. చివరకు 207 పాయింట్ల నష్టంతో 23,842 వద్ద స్థిరపడింది. సెన్సెక్స్, నిఫ్టీలో జేఎస్‌డబ్ల్యూ ఎనర్జీ, ఎమ్‌సీఎక్స్ ఇండియా, వోల్టాస్, సోలార్ ఇండస్ట్రీస్, అదానీ పవర్ మొదలైన షేర్లు లాభాలు ఆర్జించాయి. ఐచర్ మోటార్స్, చోలా ఇన్వెస్ట్‌మెంట్, మారుతీ సుజుకీ, నిప్పాన్, ఏపీఎల్ ఆపోలో మొదలైన షేర్లు నష్టాలు మూటగట్టుకున్నాయి. బ్యాంక్ నిఫ్టీ 307 పాయింట్లు నష్టపోయింది.

# పోలవరంలో ఘనంగా 'స్వచ్ఛ రథం' ప్రారంభం

- పరిసరాల పరిశుభ్రతే లక్ష్యం:

ఏపీ ట్రైకార్ చైర్మన్ బొరగం శ్రీనివాసులు

**పోలవరం:ప్రతినిధి ఏప్రిల్ 13 (ప్రజా వీక్షణం)**

పోలవరం నియోజకవర్గంలో పారిశుద్ధ్య నిర్వహణను మరింత మెరుగుపరిచేందుకు మరియు ప్రజలకు మెరుగైన సేవలందించే లక్ష్యంతో సిద్ధం చేసిన 'స్వచ్ఛ రథం' వాహనాన్ని సోమవారం ఘనంగా ప్రారంభించారు. పోలవరం మండల కేంద్రంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయం వద్ద జరిగిన ఈ కార్యక్రమంలో ఏపీ ట్రైకార్ చైర్మన్ మరియు నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జ్ శ్రీ బొరగం శ్రీనివాసులు ముఖ్య అతిథిగా విచ్చేసి, రిబ్బన్ కట్ చేసి వాహనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో బొరగం శ్రీనివాసులు మాట్లాడుతూ.. గ్రామాల్లో పారిశుద్ధ్య సమస్యలను పరిష్కరించడానికి, పరిసరాల పరిశుభ్రతపై ప్రజల్లో అవగాహన కల్పించడానికి ఈ వాహనం ఎంతగానో దోహదపడుతుందని పేర్కొన్నారు. నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి, ప్రజల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం నిరంతరం కట్టుబడి ఉంటుందని ఆయన పునరుద్ఘాటించారు. ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. అలాగే ఈ కార్యక్రమంలో స్థానిక తెలుగుదేశం పార్టీ నేతలు, కూటమి భాగస్వామ్య పక్షాల నాయకులు, భారీ సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు. అలాగే గ్రామ సచివాలయ సిబ్బంది మరియు స్థానిక ప్రజలు ఈ ప్రారంభోత్సవంలో భాగస్వాములయ్యారు. స్వచ్ఛ రథం అందుబాటులోకి రావడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.




# బియ్యం మరియు నిత్యావసర సరుకులు అందజేత

**బాపట్ల : ఏప్రిల్ 13 (ప్రజా వీక్షణం) :**

బాపట్ల జిల్లా చీరాల మండలం జక్కా వారి వీధిలో నివాసం ఉంటున్న వంగర వెంకట సుబ్బారావు కుమార్తె కి గుండె ఆపరేషన్ జరిగి ఖర్చులు ఎక్కువ అవటం





వల్ల వారికి ఆర్థికంగా ఇబ్బందిగా ఉందని కృతి ఫౌండేషన్ ను సహాయం అడగగా వారికి ఒక నెలకి సరిపడా బియ్యం మరియు నిత్యావసర సరుకులను సోమవారం ఫౌండేషన్ చైర్మన్ ఆకురాతి వెంకట అశ్విని అందజేశారు. అదే విధంగా చీరాల మండలం వైకుంఠపురంలో నివాసం ఉంటున్న పోలిరెడ్డి కి క్యాన్సర్ రావటం వల్ల ఆర్థికంగా ఇబ్బందిగా ఉందని కృతి ఫౌండేషన్ ను సహాయం అడగగా వారి కుటుంబానికి ఒక నెలకి సరిపడా బియ్యం మరియు నిత్యావసర సరుకులను అందజేశారు.

# జిల్లా కలెక్టరేట్ లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం

**బాపట్ల : ఏప్రిల్ 13 (ప్రజా వీక్షణం) :**

సోమవారం బాపట్ల జిల్లా కలెక్టరేట్ లోని పీజీఆర్ఎస్ హాల్ నందు నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని వివిధ మండలాల నుంచి వివిధ రకాల సమస్యలతో వచ్చిన అర్జీదారులు చెప్పే సమస్యలను వింటూ వారి నుంచి జిల్లా కలెక్టర్ డాక్టర్ వాసుదేవ వినోద్ కుమార్,జిల్లా జాయింట్ కలెక్టర్ భావన వశిష్ఠ అర్జీలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి జీ గంగాధర్ గౌడ్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ లవన్న,డీ ఏం హెచ్ ఓ డాక్టర్ ఎస్ విజయమ్మ,గ్రామీణ నీటి సరఫరా శాఖ ఎస్ ఈ అనంతరాజు,సీ పీ ఓ. ఎస్. ఎస్ రాజు,జిల్లా రవాణా శాఖ అధికారి పరంధామరెడ్డి,జిల్లా వ్యవసాయ శాఖ అధికారి విజయనిర్మల,వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



# రికార్డుల రారాజు..
# విధేయతకు కేరాఫ్ అడ్రస్

## శీలం వెంకటేశ్వరరావు 40 ఏళ్ల రాజకీయ తపస్సుకు చంద్రబాబు 'వరప్రసాదం'!

- ఏలూరు జిల్లా మెట్ట ప్రాంతంలో ఎదురులేని రాజకీయ కుటుంబం ।

పార్టీ కోసం పదేళ్ల వనవాసం ..

- వెలగపాడు పంచాయతీపై 40 ఏళ్ల పట్టు ।

బీసీ సామాజికవర్గ నేత శీలం వెంకటేశ్వరరావుకు దక్కనున్న కీలక పదవి!

**పోలవరం:ప్రతినిధి ఏప్రిల్ 13 (ప్రజా వీక్షణం)**

రాజకీయం అంటే గెలిచినప్పుడు పదవులు అనుభవించడం కాదు.. ఓడినప్పుడు పార్టీని భుజాన వేసుకుని నడిపించడం. సరిగ్గా ఇదే సూత్రాన్ని నమ్మి, నలభై ఏళ్లుగా తెలుగుదేశం పార్టీని కంటిపాపలా కాపాడుకుంటూ వస్తున్నారు ఏలూరు జిల్లా టి. నరసాపురం మండలానికి చెందిన శీలం వెంకటేశ్వరరావు. పోలవరం నియోజకవర్గంలో ఏ పార్టీలోనూ లేని విధంగా, ఒకే కుటుంబం నాలుగు దశాబ్దాల పాటు ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేయడం ఒక అరుదైన రికార్డు. ఇప్పుడు ఆ కష్టానికి, నిబద్ధతకు చంద్రబాబు నాయుడు రూపంలో తగిన గుర్తింపు లభించబోతోంది.

**వెలగపాడు కంచుకోట.. శీలం వంశాచార విజయం!**

శీలం వెంకటేశ్వరరావు స్వగ్రామం వీరభద్రవరం (వెలగపాడు పంచాయతీ). ఈ ప్రాంతంలో 'శీలం' కుటుంబం పేరు వినబడకుండా రాజకీయం పూర్తికాదు.

నారాయణ వారసత్వం: శీలం తండ్రి నారాయణ 1988 కంటే ముందు నుంచే సర్పంచ్‌గా సేవలందించారు. 1988–1996 మధ్య వరుసగా 8 ఏళ్లు సర్పంచ్‌గా పనిచేసి అభివృద్ధికి బాటలు వేశారు.

సతీమణి సైతం సాటిలేని రీతిలో : వెంకటేశ్వరరావు భార్య కూడా 2006లో సర్పంచ్‌గా, 2014లో వెలగపాడు ఎంపీటీసీగా ఘన విజయం సాధించి, ప్రజల మద్దతును చాటారు.

అజేయ రికార్డు : గత 40 ఏళ్లలో వెలగపాడు పంచాయతీలో కేవలం ఒక్క టర్మ్ మినహా మిగిలిన అన్ని సమయాల్లోనూ శీలం కుటుంబమే లేదా వారు బలపరిచిన అభ్యర్థులే విజయం సాధించడం గమనార్హం. ఇది రాష్ట్ర రాజకీయాల్లోనే ఒక అరుదైన మైలురాయి.

ప్రతిపక్షంలో 'సింహం'.. శీలం వెంకటేశ్వరరావు రాజకీయ ప్రస్థానం వెంకటేశ్వరరావు పదవుల కోసం పార్టీలు మారే నాయకుడు కాదు. 2006లో వైఎస్సార్ ప్రభంజనంలో, టీడీపీ తరుపున పోటీ చేసేందుకు దిగ్గజాలే భయపడిన సమయంలో, ఆయన టి. నరసాపురం జడ్పీటీసీగా పోటీ చేసి సంచలన విజయం సాధించారు.

చిన్న వయసులోనే బాధ్యత : 1995లో కేవలం 8 ఏళ్ల పాటు మల్లుకుంట సొసైటీ చైర్మన్‌గా పనిచేసి తన రాజకీయ చాతుర్యాన్ని నిరూపించుకున్నారు.

పదవుల మాల : సర్పంచ్, జడ్పీటీసీ, ఎంపీపీ, సొసైటీ ప్రెసిడెంట్.. ఇలా స్థానిక సంస్థల్లో ఆయన అలంకరించని పదవి లేదు.

విశ్వసనీయతకు నిలువుటద్దం: 2011–2014 మధ్య ఉమ్మడి జిల్లా పార్టీ ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు. పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు టి. నరసాపురాన్ని జిల్లా రాజకీయాలకు కేంద్రబిందువుగా మార్చి కేడర్‌లో ఉత్సాహం నింపారు.

**చంద్రబాబు గుర్తింపు - రాష్ట్ర స్థాయిలో కీలక పాత్ర**

శీలం వెంకటేశ్వరరావు విధేయతను గుర్తించిన టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు, గత ప్రభుత్వ హయాంలోనే ఆయనకు ఎమ్మెల్సీ పదవి ఇచ్చేందుకు మొగ్గు చూపారు. కానీ సమీకరణాల వల్ల అది త్రుటిలో తప్పింది. అయినప్పటికీ నిరాశ చెందకుండా పార్టీ రాష్ట్ర కార్యదర్శిగా పనిచేశారు.

పర్యవేక్షకుడిగా రాణింపు : అమలాపురం, జగ్గంపేట నియోజకవర్గాల పర్యవేక్షకుడిగా పార్టీని బలోపేతం చేయడంలో కీలక పాత్ర పోషించారు.

శీలం వెంకటేశ్వరరావు ప్రస్థానం –

| మైలురాళ్లు | సంవత్సరం |
|---|---|
| మల్లుకుంట సొసైటీ చైర్మన్ (మొదటిసారి) | 1995 |
| వెలగపాడు సర్పంచ్ విజయం | 2001 |
| టి. నరసాపురం జడ్పీటీసీ (వైఎస్సార్ హయాంలో) | 2006 |
| మల్లుకుంట సొసైటీ చైర్మన్ (రెండోసారి) | 2013 |
| టి. నరసాపురం ఎంపీపీ | 2014 |
| టీడీపీ రాష్ట్ర కార్యదర్శి | ప్రస్తుత బాధ్యత |

ముంగిట ముచ్చటైన పదవి.. 2026 బెస్ట్ ఆఫ్ లక్!

ప్రస్తుతం కూటమి ప్రభుత్వం



అధికారంలో ఉండటంతో, సీనియర్ నేతగా, బీసీ (యాదవ) సామాజికవర్గ బలమైన గొంతుకగా శీలం వెంకటేశ్వరరావుకు ఈసారి రాష్ట్ర స్థాయి నామినేటెడ్ పదవి లేదా ఎమ్మెల్సీ దక్కడం ఖాయమని పార్టీ వర్గాలు చర్చించుకుంటున్నాయి.

" శ్రమ నీ ఆయుధం అయితే.. విజయం నీ బానిస అవుతుంది" అన్న నానుడికి శీలం వెంకటేశ్వరరావు నిదర్శనం. 40 ఏళ్ల నిరీక్షణకు, లక్షలాది మంది కార్యకర్తల ఆశీస్సులకు త్వరలోనే ఫలితం దక్కబోతోంది.

బెస్ట్ ఆఫ్ లక్ శీలం అన్నా.. మీ ప్రస్థానం భావి తరాలకు స్ఫూర్తిదాయకం!

# రైతు సంక్షేమమే ధ్యేయం: నవభారత్ పామాయిల్ కాటాను ప్రారంభించిన శీలం వెంకటేశ్వరరావు

**పోలవరం:ప్రతినిధి ఏప్రిల్ 13 (ప్రజా వీక్షణం)**

రైతుల సౌకర్యార్థం ఏలూరు జిల్లా టీ. నర్సాపురం మండలం వెలగపాడు పంచాయతీ వీరభద్రవరం గ్రామంలో నవభారత్ కంపెనీ ఏర్పాటు చేసిన పామాయిల్ కాటాను టీడీపీ రాష్ట్ర కార్యదర్శి, జగ్గంపేట నియోజకవర్గ పరిశీలకులు శీలం వెంకటేశ్వరరావు సోమవారం ఘనంగా ప్రారంభించారు. కాటాను ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఈ ప్రాంత రైతులు పండించిన పామాయిల్ గెలలను తూకం వేయడానికి దూర ప్రాంతాలకు వెళ్లే ఇబ్బందిని తప్పించేందుకే నవభారత్ యాజమాన్యం ఇక్కడ కాటాను ఏర్పాటు చేసిందని పేర్కొన్నారు. నియోజకవర్గంలోని రైతుల సమస్యలను పరిష్కరిస్తూ, వారికి అండగా నిలవడంలో తాము ఎప్పుడూ ముందుంటామని వెంకటేశ్వరరావు స్పష్టం చేసారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో శీలం వెంకటేశ్వరరావు వెంట నవభారత్ కంపెనీ స్టాఫ్, టీడీపీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. వెంకటేశ్వరరావు చేతుల మీదుగా ఈ కాటా ప్రారంభం కావడం పట్ల స్థానిక రైతులు హర్షం వ్యక్తం చేశారు.



# జువ్వా వారి వివాహ వేడుకలో మల్లుకుంట సొసైటీ చైర్మన్ శీలం సాయివినయ్

- ఘన స్వాగతం పలికిన

జువ్వా కుటుంబీకులు.

**పోలవరం:ప్రతినిధి ఏప్రిల్ 13 (ప్రజా వీక్షణం)**

ఏలూరు జిల్లా, టీ. నర్సాపురం మండలం వీరభద్రవరం గ్రామంలో జరిగిన జువ్వా వారి వివాహ రిసెప్షన్ వేడుకలో మల్లుకుంట సొసైటీ చైర్మన్ శీలం సాయివినయ్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. సోమవారం జరిగిన ఈ శుభకార్యానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై, నూతన దంపతులను ఆశీర్వదించారు. శీలం సాయివినయ్ గ్రామానికి చేరుకోగానే నాయకులు, కార్యకర్తలు మరియు అభిమానులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. భారీ అనుచర గణంతో వేడుకకు విచ్చేసిన ఆయన, నూతన వధూవరులకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా వేడుకలో పాల్గొన్న స్థానిక నాయకులతో మరియు కార్యకర్తలతో సాయివినయ్ కాసేపు ముచ్చటించారు. సొసైటీ చైర్మన్ రాకతో రిసెప్షన్ ప్రాంగణంలో ఉత్సాహభరిత వాతావరణం నెలకొంది. జువ్వా కుటుంబ సభ్యులు శీలం సాయివినయ్‌ను ప్రత్యేకంగా గౌరవించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట మల్లుకుంట సొసైటీ పరిధిలోని కీలక నాయకులు,మరియు అభిమానులు పాల్గొన్నారు.



# పొదల చాటున 'ప్రజాప్రతినిధుల' హామీలు!

## - పదేళ్లు దాటినా మట్టి బాటే

## - పిచ్చిమొక్కల మధ్య శిలాఫలకం

## అప్పలరాజుగూడెం- మధ్యాహ్నపువారిగూడెం వాసుల దుస్థితి

**పోలవరం:ప్రతినిధి ఏప్రిల్ 13 (ప్రజా వీక్షణం)**






అభివృద్ధి అంటే కేవలం శిలాఫలకాలు వేయడమేనా? నాయకుల పేర్లు రాళ్ల మీద చెక్కించుకోవడానికే నిధులు పరిమితమా? అని ఏలూరు జిల్లా టీ. నర్సాపురం మండల ప్రజలు ప్రశ్నిస్తున్నారు. అప్పలరాజుగూడెం నుండి మధ్యాహ్నపువారిగూడెం వెళ్లే దారిలో పదేళ్ల క్రితం వేసిన శంకుస్థాపన రాయి నేడు పిచ్చిమొక్కల మధ్య బయటపడటంతో పాలకుల నిర్లక్ష్యం మరోసారి వెలుగు చూసింది. గతంలో 3 డిసెంబర్ 2013న పంచాయతీ రాజ్ శాఖ ఆధ్వర్యంలో ఎస్.డి. ఎఫ్ లాడ్స్ నిధుల నుండి సుమారు రెండు కోట్ల యాభై లక్షల (2.50) రూపాయల అంచనా వ్యయంతో ఇక్కడ అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. అప్పటి కేంద్ర మంత్రి పేర్లు స్థానిక నేతల పేర్లతో సహా పలువురు నాయకుల పేర్లు ఈ శిలాఫలకంపై ఘనంగా చెక్కారు. కానీ, ఆ పేర్లు చెక్కిన ఉత్సాహం రోడ్డు వేయడంలో చూపలేదని స్థానికులు మండిపడుతున్నారు.శంకుస్థాపన జరిగి దశాబ్దం గడిచినా, ఈ రోజు వరకు ఈ మార్గంలో కనీసం బిటి రోడ్డు కూడా వేయలేదు. వర్షం పడితే ఈ దారిలో నడవడం కూడా సాధ్యం కానంతగా బురద తయారవుతోంది. మధ్యాహ్నపువారిగూడెం వెళ్లాలంటే ప్రజలు పడుతున్న ఇబ్బందులు వర్ణనాతీతం. అత్యవసర సమయాల్లో ఆటోలు, వాహనాలు రావడానికి సైతం నిరాకరిస్తున్న పరిస్థితి నెలకొంది. పొదలను శుభ్రం చేస్తున్న సమయంలో పాత శిలాఫలకం బయటపడటంతో.. "ఇన్నాళ్లుగా నిధులు ఉన్నా మాకు రోడ్డు ఎందుకు వేయలేదు?" అని గ్రామస్తులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తామని ఓట్లు దండుకునే నాయకులు, గెలిచిన తర్వాత కనీసం రోడ్డు వైపు కూడా చూడటం లేదని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారుల చుట్టూ తిరిగినా ఫలితం లేదని, కేవలం శంకుస్థాపనలకే పరిమితమైన రాజకీయాలు మాకొద్దని వారు తెగేసి చెబుతున్నారు.వెంటనే జిల్లా యంత్రాంగం స్పందించి, పిచ్చిమొక్కల మధ్య ఉన్న హామీలను అమలు చేయాలని, తక్షణమే అప్పలరాజుగూడెం - మధ్యాహ్నపువారిగూడెం మధ్య నాణ్యమైన బిటి రోడ్డు నిర్మించాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. లేనిపక్షంలో రాబోయే రోజుల్లో ప్రజా నిరసన తప్పదని హెచ్చరించారు.ఈ నేపథ్యంలో ఈ నెల 18వ తేదీ శనివారం నాడు రైతులు, కూలీలు మరియు సిపిఎం నాయకులు గ్రామస్తులు భారీ పాదయాత్ర నిర్వహించనున్నారని తెలియజేసారు.

# సహారా బాధితుల ధర్నా ఫిక్స్ డిపాజిట్ చేసి కాలపరిమితి దాటిన మా డబ్బులను చెల్లించాలని ఆందోళన చేసిన బాధితులు

**మంచిర్యాల జిల్లా ఏప్రిల్ 13**

**(ప్రజా వీక్షణం న్యూస్)**

మంచిర్యాల జిల్లా కేంద్రంలోని మందమర్రి మార్కెట్ లో ఉన్న సహారా కార్యాలయం ముందు సహారా ఇండియా సంస్థ లో మేము ఫిక్స్ డిపాజిట్ చేసిన డబ్బులను కాలపరిమితి దాటిపోయి 4-5 సంవత్సరాలు గడుస్తున్నా సహారా యాజమాన్యం డబ్బులు చెల్లించకపోవడానికి నిరసనగా బాధితులు నల్ల బ్యాడ్జీలు ధరించి ప్లే కార్డ్స్ చేత బూని సహారా ఇండియా లో మేము ఫిక్స్ డిపాజిట్ చేసిన కాలపరిమితి దాటిపోయి మా డబ్బులను మాకు వెంటనే చెల్లించాలని నిరసన చేస్తూ పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. మేము కట్టిన డబ్బులను వెంటనే చెల్లించాలని లేని యెడల జిల్లా వ్యాప్తంగా శాంతియుతంగా నిరసన, ఆందోళన కార్యక్రమాలు చేపడతామని సహారా బాధితులు పేర్కొన్నారు. లక్షలాది మంది సహారా బాధితుల సమస్యల పరిష్కారం కోసం గౌరవ జిల్లా లోని ఎం ఎల్ ఏ లు , రాష్ట్ర కార్మిక శాఖ మంత్రివర్యులు గడ్డం వివేక్ వెంకట స్వామి గారు , అదే విధంగా పెద్దపల్లి ఎంపీ గౌరవ గడ్డం వంశీ కృష్ణ గారు సహారా బాధితుల సమస్యను పరిష్కరించడానికి కృషి చేయాలని ఈ సందర్భంగా బాధితులు విజ్ఞప్తి చేశారు.ఈ సందర్భంగా మందమర్రి సహారా ఇండియా మేనేజర్ గారికి మా డబ్బులు మాకు వెంటనే ఇప్పించాలని వినతి పత్రం అందజేశారు.ఈ కార్యక్రమంలో సింగరేణి విశ్రాంత ఉద్యోగుల సంఘం, తెలంగాణ ఉద్యమ కారుల ఐక్య వేదిక అధ్యక్షుడు మరియు సహారా ఇండియా బాధితుడు గజెల్లి వెంకటయ్య , సహారా బాధితులు సిహెచ్ సంజీవ్ , డి రాజమౌళి , రామ్ నరేష్ బాబు , సి హెచ్ సంపత్ , ఎస్ మధు , దుర్గం మల్లేశ్వరి , భేరి రమాదేవి , దూత లక్ష్మి , పాషా , అబేదా తదితరులు పాల్గొన్నారు..



# దక్షిణ గోండ్వానా గోండు రాజు మొకాసి స్మారక జెండా పూజలో పాల్గొన్న సిర్పూర్ శాసనసభ్యులు డా.పాల్వాయి హరీష్ బాబు





**కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా**

**ఏప్రిల్ 13(ప్రజా వీక్షణం న్యూస్)**

కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్(టి) మండలంలోని ఆదివాసీ గ్రామమైన మేడిపల్లిలో దక్షిణ గోండ్వానా గోండు రాజు మోకాసి స్మారక జెండా పూజ నిర్వహించిన సిర్పూర్ శాసనసభ్యులు డా.పాల్వాయి హరీష్ బాబు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన సిర్పూర్ శాసనసభ్యులు డా.పాల్వాయి హరీష్ బాబు, కాగజ్ నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లా ప్రత్యేక పూజలు నిర్వహించడం జరిగింది. అనంతరం జరిగిన రాయ్ దర్బార్లో పాల్గొని ప్రసంగించడం జరిగింది.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మేడిపల్లి గ్రామానికి 154 ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేశామని, ఫారెస్ట్ శాఖ వారి ఆంక్షలతో కొన్ని ఇండ్ల నిర్మాణం ఇంకా మొదలు కాలేదని, సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు. సిర్పూర్(టి) నుండి మాలిని వరకు బీటీ రోడ్డు మరియు రెండు బ్రిడ్జిల నిర్మాణం కోసం ప్రభుత్వం నిధులను కేటాయించి అనుమతులు ఇచ్చేలా ఒత్తిడి తీసుకొస్తామని తెలిపారు.రాయిదర్బార్ లో గిరిజనుల సమస్యలపై అధ్యయనం జరిగింది. గిరిజనుల స్థితిగతులను మెరుగుపరిచే విధంగా ఐటిడిఏ లను బలోపేతం చేయాలని తద్వారా ఆదివాసులకు మెరుగైన సదుపాయాలు మరియు ఉద్యోగాలు కల్పించాలని తీర్మానించడం జరిగింది.ఈ కార్యక్రమంలో ఎమ్మార్వో రహీముద్దీన్ , ఎంపీడీఓ సత్యనారాయణ, ఆదివాసి నాయకులు సిడామ్ అర్జు మాస్టర్, కూర్సెంగా మోతిరాం, సుర్పం మారు, సర్పంచ్లు వెడ్మా భీమ్రావు, మానేపల్లి శ్రీనివాస్, సిడామ్ మాణిక్ రావు, చణకపురే లావణ్య, ఒడ్డేటి నాగమణి నానయ్య, దుర్గం ప్రశాంత్, సాయి, గణేష్, బాబు దండిగ, పరమేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

# అంబేద్కర్ చూపిన బాటలోనే శాంతి భద్రతలు : ఎస్సై జయబాబు

## - బొర్రంపాలెంలో ఘనంగా బాబాసాహెబ్ జయంతి వేడుకలు- రాజ్యాంగ స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ ముందుకు సాగాలి

**పోలవరం:ప్రతినిధి ఏప్రిల్ 14(ప్రజా వీక్షణం)**

భారత రాజ్యాంగ పితామహుడు డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ 135వ జయంతి వేడుకలు మంగళవారం టీ. నర్సాపురం మండలం, బొర్రంపాలెం గ్రామంలో అత్యంత వైభవంగా జరిగాయి. ఈ వేడుకల్లో సబ్ ఇన్స్పెక్టర్ (ఎస్సై) జయబాబు ముఖ్య అతిథిగా పాల్గొని, అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా ఆయన చేసిన ప్రసంగం అందరినీ ఆకట్టుకుంది. "మనం ఈరోజు ప్రశాంతంగా ఉన్నామంటే దానికి అంబేద్కర్ రాసిన రాజ్యాంగమే పునాది అంటూ,చట్టం ముందు అందరూ సమానమే అని చాటిచెప్పిన మహనీయుడు అంబేద్కర్ " అని ఎస్సై జయబాబు పేర్కొన్నారు. అలాగే యువత చెడు మార్గాల వైపు వెళ్లకుండా, అంబేద్కర్ ఆశయాలననుసరించి ఉన్నత విద్యను అభ్యసించాలని, సమాజ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని కోరారు.అంతేకాకుండా "అంబేద్కర్ నేర్పిన క్రమశిక్షణ, సహనం ప్రతి పౌరుడిలో ఉండాలని మరియు చట్టాన్ని గౌరవించే ప్రతి ఒక్కరూ బాబాసాహెబ్ వారసులే" అని ఉద్ఘాటించారు. అలాగే మండల కేంద్రంలోని ప్రధాన వీధులన్నీ 'జై భీమ్' నినాదాలతో మారుమోగాయి.అనంతరం ఎస్సై జయబాబు స్థానిక యువతతో కలిసి కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు.





# ఏపుకుంటలో ఘనంగా అంబేద్కర్ జయంతి

**పోలవరం:ప్రతినిధి ఏప్రిల్ 14**

**(ప్రజా వీక్షణం)**



ఏలూరు జిల్లా టీ. నర్సాపురం మండలం ఏపుకుంట పంచాయతీలో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపుకుంట పంచాయతీ అధ్యక్షులు సాధనాల భూసిబాబు అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ, దళిత, బహుజన మరియు అణగారిన వర్గాల హక్కుల కోసం పోరాడిన గొప్ప వ్యక్తి అంబేద్కర్ అని కొనియాడారు. ఆయన రచించిన రాజ్యాంగం వల్లనే నేడు దేశంలో అందరికీ సమాన హక్కులు లభిస్తున్నాయని గుర్తు చేశారు. ప్రతి ఒక్కరూ అంబేద్కర్ చూపిన మార్గంలో నడుస్తూ, విద్యతో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక నేతలు, పంచాయతీ సిబ్బంది మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

# ఒంటరి వృద్ధురాలిపై దాడి

## - రోకలిబండతో బాదిన దుండుగులు

## - బంగారం దోచుకుని పరార్

**కామారెడ్డి,ఏప్రిల్13 (ప్రజా వీక్షణం)**

కామారెడ్డి జిల్లాలోని భిక్కనూరు మండల కేంద్రంలో జరిగిన దారుణ ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. ఇంట్లోకి చొరబడి ఓ వృద్ధురాలిపై రోకలిబండతో దాడి చేసి, ఆమె బంగారు ఆభరణాలను అపహరించిన ఘటన ప్రజలను భయభ్రాంతులకు గురి చేసింది. ఈ సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. భిక్కనూరు మండల కేంద్రంలో నివసిస్తున్న ఓ వృద్ధురాలు తన ఇంట్లో ఒంటరిగా ఉన్న సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు ఇంట్లోకి చొరబడ్డారు. ఆ సమయంలో ఆమెపై అకస్మాత్తుగా దాడికి పాల్పడ్డారు. దాడికి రోకలి బండను ఉపయోగించినట్లు సమాచారం. ఈ దాడిలో వృద్ధురాలు తీవ్రంగా గాయపడింది. దాడి సమయంలో ఆమె అరుస్తూ సహాయం కోరినప్పటికీ, దుండగులు ఆమె బంగారు ఆభరణాలను బలవంతంగా లాక్కొని పరారయ్యారు. వాటి విలువ ఎంతన్నది పూర్తిగా నిర్ధారణ కాలేదు. ఈ ఘటనలో వృద్ధురాలి తలకు తీవ్ర గాయాలైనట్లు వైద్యులు తెలిపారు. రక్తస్రావం అధికంగా ఉండటంతో స్థానికులు వెంటనే స్పందించి ఆమెను సమీప ఆస్పత్రికి తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స అందించారు. ఆమె ఆరోగ్య పరిస్థితిపై వైద్య బృందం నిరంతరం పర్యవేక్షిస్తోంది. ఈ దారుణ ఘటనతో భిక్కనూరు ప్రాంత ప్రజల్లో భయాందోళన నెలకొంది. వృద్ధురాలిపై ఇంతటి క్రూరమైన దాడి జరగడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దుండగులు ముందుగా ఇంటి పరిస్థితిని గమనించి, ఎవరు లేని సమయం చూసి లోపలికి చొరబడినట్లు పోలీసులు భావిస్తున్నారు. బంగారు ఆభరణాల సమాచారం ముందుగానే తెలిసి ఉండవచ్చని అనుమానిస్తున్నారు. ఈ దాడి పథకం ప్రకారం జరిగిందా లేదా అకస్మాత్తుగా జరిగిన దోపిడీనా అనే కోణంలో పోలీసులు విచారణ చేస్తున్నారు. ససమాచారం అందుకున్న వెంటనే పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు వేగవంతం చేశారు. ఈ ప్రాంతంలోని సీసీటీవీ ఫుటేజ్‌ను సేకరించి, అనుమానితులను గుర్తించడానికి చర్యలు చేపట్టారు. స్థానికుల నుంచి కూడా సమాచారం సేకరిస్తున్నారు. పోలీసులు ఈ ఘటనను సీరియస్‌గా తీసుకుని, దోషులను త్వరలోనే పట్టుకుంటామని తెలిపారు.

# మరోమారు ఎదురు కాల్పులు

## - మహిళా మావోయిస్టు నాయకురాలు మృతి

## - అడవుల్లో కొనసాగుతున్న కూంబింగ్

**రాయ్‌పూర్,ఏప్రిల్13 (ప్రజా వీక్షణం)**

ఛత్తీస్‌గఢ్‌లో భద్రతా దళాలు, మావోయిస్టుల మధ్య జరిగిన ఎదురుకాల్పుల్లో మహిళా మావోయిస్టు కమాండర్ రూపీ మృతి చెందారు. కాంకేర్ జిల్లాలోని ఛోటే బెట్టియా అటవీ ప్రాంతంలో ఈ ఘటన చోటుచేసుకుంది. రూపీపై రూ.5 లక్షల బహుమతి ప్రకటించబడినట్లు అధికారులు తెలిపారు. మావోయిస్టులు ఉన్నారనే విశ్వసనీయ సమాచారం ఆధారంగా భద్రతా దళాలు ఆ ప్రాంతంలో గాలింపు చర్యలు చేపట్టగా, ఈ సందర్భంగా ఇరుపక్షాల మధ్య కాల్పులు చోటుచేసుకున్నాయి.ఎన్‌కౌంటర్ అనంతరం రూపీ మృతదేహంతో పాటు ఆయుధాలను స్వాధీనం చేసుకున్నట్లు భద్రతా దళాలు వెల్లడించాయి. ఆ ప్రాంతంలో మరికొందరు మావోయిస్టులు దాగి ఉన్నారనే అనుమానంతో విస్తృతంగా గాలింపు కొనసాగుతోంది. గత నెలలో కూడా ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లాలో జరిగిన ఎదురుకాల్పుల్లో ఇద్దరు మావోయిస్టులు హతమైన సంగతి తెలిసిందే. ఎన్‌కౌంటర్ సమయంలో సుమారు పదిమంది మావోయిస్టులు అక్కడి నుంచి అడవుల్లోకి పారిపోయినట్లు సమాచారం. వారు దట్టమైన అటవీ ప్రాంతాన్ని ఉపయోగించి తప్పించుకున్నారని భద్రతా బలగాలు భావిస్తున్నాయి. వారిని గుర్తించి పట్టుకోవడానికి ప్రత్యేక బలగాలు రంగంలోకి దిగాయి. ఎన్‌కౌంటర్ అనంతరం ప్రాంతాన్ని పూర్తిగా చుట్టుముట్టి కూంబింగ్ ఆపరేషన్ కొనసాగుతోంది. భద్రతా బలగాలు అడవిలో గాలింపు చర్యలు ముమ్మరం చేశాయి. మరి కొంతమంది మావోయిస్టులు అటవీలో దాగి ఉండవచ్చనే అనుమానంతో ఆపరేషన్‌ను భద్రతా బలగాలు కొనసాగిస్తున్నాయి. మావోయిస్టుల కదలికలపై గత కొంతకాలంగా భద్రతా బలగాలు నిఘా పెంచాయి. వారికి వచ్చిన సమాచారం ఆధారంగా ఈ ఆపరేషన్‌ని చేపట్టినట్లు తెలుస్తోంది. దట్టమైన అటవీ ప్రాంతం కావడంతో ఈ ఆపరేషన్ జాగ్రత్తగా కొనసాగుతోంది. ఈ ప్రాంతం గతంలో కూడా మావోయిస్టు కార్యకలా పాలకు కేంద్రంగా ఉంది. తరచూ భద్రతా బలగాలు, మావోయిస్టుల మధ్య ఎదురుకాల్పులు జరుగుతు న్నాయి. మావోయిస్టులు ఉద్యమం ప్రభావం ఈ ప్రాంతాల్లో ఇంకా కొనసాగుతోండటంతో భద్రతా సవాళ్లు నెలకొన్నాయి. ఎన్‌కౌంటర్ నేపథ్యంలో సమీప గ్రామాల్లో భద్రతను పోలీసులు కట్టుదిట్టం చేశారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. అటవీ ప్రాంతానికి వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని స్థానికులకు హెచ్చరికలు జారీ చేశారు. మిగిలిన మరికొంతమంది మావోయిస్టులను పట్టుకోవడానికి డ్రోన్ సర్వైలెన్స్, ప్రత్యేక కూంబింగ్ బలగాలు ఉపయోగిస్తున్నట్లు సమాచారం. ఈ ఆపరేషన్ మరికొన్ని గంటలు లేదా రోజులు కొనసాగవచ్చని భద్రతా వర్గాలు చెబుతున్నాయి. మాచపల్లి అటవీ ప్రాంతంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఒక మహిళా మావోయిస్టు మృతి చెందడం, పలువురు తప్పించుకోవడం పరిస్థితి తీవ్రతను సూచిస్తోంది. ప్రస్తుతం కొనసాగుతున్న కూంబింగ్ ఆపరేషన్‌లో మరిన్ని వివరాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

# వైఎస్ వివేకానంద రెడ్డి హత్య కేసు

## - మరోమారు పిటిషన్ దాఖలు చేసిన సునీత

**హైదరాబాద్,ఏప్రిల్13 (ప్రజా వీక్షణం)**

మాజీమంత్రి వైఎస్ వివేకానంద రెడ్డి హత్య కేసు దర్యాప్తు వ్యవహారంలో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో తదుపరి దర్యాప్తును కొనసాగించేలా కేంద్ర దర్యాప్తు సంస్థకు ఆదేశాలు ఇవ్వాలంటూ తెలంగాణ హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. ఈ పిటిషన్‌ను వివేకా కూతురు సునీతా రెడ్డి దాఖలు చేశారు. ఈ కేసులో కొన్ని కోణాలపై సీబీఐ పూర్తి స్థాయిలో దర్యాప్తు చేయలేదని, పలు అనుమానాలకు సమాధానాలు రాలేదని ఆమె తన పిటిషన్‌లో పేర్కొన్నారు. అందువల్ల మరింత సమగ్ర తదుపరి దర్యాప్తు జరపాలని హైకోర్టును కోరారు. ఈ కేసు ఇప్పటికే సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు సీబీఐ దర్యాప్తులో ఉంది. గతంలో సీబీఐ కోర్టు ఇచ్చిన ఆదేశాల ప్రకారం కొన్ని వ్యక్తుల మధ్య జరిగిన ఫోన్ కాల్ డేటా సహా పలు సాంకేతిక ఆధారాలను పరిశీలించి దర్యాప్తు చేపట్టింది. తదుపరి దర్యాప్తులో కొందరి పాత్ర లేదని పేర్కొంటూ సీబీఐ కోర్టుకు ఛార్జ్‌షీట్ కూడా దాఖలు చేసింది. అయితే ఈ దర్యాప్తుపై పిటిషనర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. సునీతా రెడ్డి తన పిటిషన్‌లో పలు కీలక విషయాలను పేర్కొన్నారు. పలు సందేహాలకు సీబీఐ దర్యాప్తులో సమాధానం రాలేదని తెలిపారు. కొన్ని కోణాల్లో విచారణ పూర్తిగా జరగలేదని అన్నారు. ఈ కేసులోని కొన్ని అనుమానాస్పద అంశాలను విస్మరించారని అభ్యంతరం వ్యక్తం చేశారు. అందువల్ల సీబీఐ కోర్టు ఉత్తర్వులను రద్దు చేసి, కేసులో ఇంకా స్పష్టత లేని అంశాలపై మరింత దర్యాప్తు చేయాలని ఆదేశించాలంటూ ఆమె హైకోర్టును అభ్యర్థించారు. ఈ పిటిషన్‌పై తెలంగాణ హైకోర్టులో విచారణ జరుగుతోంది.

# అంబేద్కర్ 135వ జయంతి సందర్భం

## - అజయ్ పురం గ్రామంలో

## బైక్ యాత్ర ప్రారంభం

**అనకాపల్లి,ఏప్రిల్13 (ప్రజా వీక్షణం)**

అనకాపల్లి జిల్లా రావికమతం మండలం చీమలపాడు పంచాయతీ అజయ్ పురం గ్రామంలో గిరిజన సంఘం., కెవిపిఎస్ సంఘాల ఆధ్వర్యంలో డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ జయంతి సందర్భంగా అంబేద్కర్ చిత్రపటానికి పూలదండలు వేసి నివాళి అర్పించారు.అజయ్ పరువు నుండి జోగంపేట, నేరేడు బంధ, కళ్యాణ్ లావా వరకు బైకే యాత్ర నిర్వహించడం జరిగింది. ఎస్సీ ఎస్టీ చట్టాన్ని ఆర్టికల్ 9 షెడ్యూల్లో చేర్చాలని, నాన్ షెడ్యూల్ గిరిజన మండలాలను ఏజెన్సీ ఏరియాలో కలపాలని డిమాండ్ చేశారు. అంబేద్కర్ రచించిన రాజ్యాంగాన్ని కాపాడుకోవాలని కోరారు. రావికతం మండల కేంద్రంలో సర్వేనెంబర్ అంబేద్కర్ కాలనీ వద్ద ఉన్న చెత్తను తొలగించాలి. బాదంపాడు రెవెన్యూ పరిధిలో సర్వే నెంబర్ 41–లో 5–80 చెట్లు భూమిలో ఎన్టీఆర్ గృహ నిర్మాణ పథకం దళితులకు, గిరిజలకు కేటాయించాలి బాదంపాడు రెవిన్యూ పరిధిలో సీలింగ్ భూమి చుట్టూ బౌండరీ ఏర్పాటు చేయాలని తెలిపారు. దళితులకు గిరిజనులకు పట్టాలి ఇవ్వాలి. కొత్తకోట దళిత కాలనీకి మంచినీరు సౌకర్యం కల్పించాలి. గిరిజనులు సాగులోన భూములకు, సాగకు కల్పించి, గిరిజనులకు దళితులకు రక్షణ కల్పించాలన్నారు. జిల్లా కలెక్టర్ అధ్యక్షతన మోనాటరింగ్ కమిటీలో గిరిజనులకు ప్రాతినిధ్యం కల్పించాలని, జెడ్ జోగంపేట పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేయాలని కోరారు. నర్సీపట్నం నుండి జెడ్ జోగిపేట్ వరకు ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని, దళితులకు గిరిజనులకు ఇచ్చిన అధిక బిల్లులు తగ్గించాలని డిమాండ్ చేశారు. జిల్లా కలెక్టర్ అధ్యక్షతన దళితులకు గిరిజనులకు నర్సీపట్నంలో ప్రత్యేక గ్రీవెన్స్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమానికి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సాయి కార్యదర్శి కే గోవిందరావు. గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు పాంగి చంద్రావు. పాంగి పవన్ కుమార్. వంతల చిరంజీవి. గేమిల రాజు తదితరులు పాల్గొన్నారు.



# పాదచారులపై దూసుకెళ్లిన ట్రక్కు

## - ఏడుగురు వ్యక్తులు అక్కడిక్కడే మృతి

**రాజ్‌కోట్,ఏప్రిల్13 (ప్రజా వీక్షణం)**

ఓ ట్రక్కు అదుపుతప్పి రోడ్డు పక్కన నడుచుకుంటూ వెళ్తున్న యాత్రికులపైకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో ఏడుగురు అక్కడికక్కడే మరణించారు. వారిలో ఆరుగురు యాత్రికులు కాగా.. మరో వ్యక్తి రోడ్డు పక్కన తన వాహనం టైరు మారుస్తున్న డంపర్ డ్రైవర్. యాత్రికులు రాజస్థాన్‌లోని రాజ్‌కోట్ లోని గద్కా గ్రామం నుంచి దేకావాలా లోని మహదేవ్ ఆలయానికి వెళ్తుండగా.. సోమవారం తెల్లవారుజామున లఖ్టర్–విరామ్‌గామ్ రహదారిపై భాస్కర్‌పారా సమీపంలో ప్రమాదం జరిగింది. రాజ్‌కోట్‌లోని గద్కా గ్రామం నుంచి దేకావాలాలోని మహాదేవ్ ఆలయానికి నడుచుకుంటూ వెళ్తున్న యాత్రికులు.. మార్గమధ్యలో భాస్కర్‌పారా సమీపంలో ఓ వ్యక్తి రోడ్డుపై ఆగిపోయిన డంపర్‌కు టైరు మారుస్తున్నాడు. యాత్రికులు ఆ డంపర్‌ను దాటుతున్న సమయంలో వెనుక నుంచి వేగంగా దూసుకొచ్చిన ట్రక్కు వారిని ఢీకొట్టింది. ఈ ఘటనలో ఆరుగురు యాత్రికులు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. వారిలో ఐదుగురు మహిళలు, ఒక పురుషుడు ఉన్నారు. అదేవిధంగా డంపర్ టైరు మారుస్తున్న డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. అతడిని ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ ప్రాణాలు కోల్పోయాడు.దాంతో మొత్తం మృతుల సంఖ్య ఏడుకు చేరింది. ప్రమాద సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు ఘటనా ప్రాంతానికి చేరుకున్నారు. మృతదేహాలను పోస్టుమార్టానికి తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# వివోల వేతన బకాయిలు చెల్లించాలి

## - సిఐటియు ఆధ్వర్యంలో ఆందోళన

**కర్నూలు,ఏప్రిల్13 (ప్రజా వీక్షణం)**

వివోఏలకు మూడు నెలల వేతన బకాయిలు కనీస వేతనాలు చెల్లించాలని హెచ్ఆర్ పాలసీని అమలు చేయాలని, శ్రీనిధి బకాయల చెల్లింపు సెల్ ఫోన్స్ గ్రూప్ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని అభయహస్తం మహిళా మార్ట్ లో పెట్టిన పెట్టుబడులు పొదుపు మహిళలకు తిరిగి చెల్లించాలని వడ్డీ రాయితీ ఇవ్వాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యంలో సోమవారం నందికొట్కూరు తాసిల్దార్ కార్యాలయం ముందు ధర్నా చేపట్టారు. ఈ కార్యక్రమానికి వివోఏల సంఘం నాయకులు పుల్లం రాజు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా సిఐటియు పట్టణ కార్యదర్శి టి గోపాలకృష్ణ మాట్లాడుతూ వెలుగు వివోఏలకు కనీస వేతనాలు చెల్లించాలని అన్నారు రాష్ట్రంలో 28,000 మంది వీవోఏలు పొదుపు సంఘాలు మహిళలకు దీర్ఘకాలంగా సేవలందిస్తున్నారు. కనీస వేతనం ఉద్యోగ భద్రత కోసం మొబైల్ సిమ్ కార్డ్స్ గ్రూప్ ఇన్సూరెన్స్ సౌకర్యం తదితర డిమాండ్ల సాధనకై ఆందోళనలు పోరాటాలు నిర్వహించాలని అన్నారు. వేతనాలు పెరిగి ఏడు సంవత్సరాలయింది పెరుగుతున్న ధరలకు అనుకూలంగా వేతనాలు పెంచాలన్నారు. తక్షణమే వివో ఏ లకు మూడు నెలల వేతన బకాయిలు కనీస వేతనాలు చెల్లించాలన్నారు.



# నాంపల్లి రెడ్‌హిల్స్‌లో అగ్నిప్రమాదం

## - సకాలంలో మంటలను ఆర్పిన ఫైర్ సిబ్బంది

**హైదరాబాద్,ఏప్రిల్13 (ప్రజా వీక్షణం)**

నాంపల్లి రెడ్‌హిల్స్‌లోని మూడంతస్తుల భవనంలో సోమవారం భారీ అగ్నిప్రమాదం సంభవించింది. భవనం మూడో అంతస్తులో షార్ట్ సర్క్యూట్ కారణంగా ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ప్రమాద సమయంలో భవనంలో 23 మంది నివాసితులు ఉన్నారు. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు వెంటనే అగ్నిమాపక సిబ్బంది అక్కడకు చేరుకున్నారు. భవనంలో చిక్కుకున్న 23 మందిని సురక్షితంగా బయటకు తీసుకొచ్చారు. ఈ ఘటనలో ఎవరికీ గాయాలు కాలేదని, ప్రాణనష్టం ఏమీ లేదని అధికారులు తెలిపారు. మంటలు వేగంగా వ్యాప్తి చెందే అవకాశం ఉన్నప్పటికీ, అగ్నిమాపక శాఖ సిబ్బంది త్వరితగతిన స్పందించి.. మంటలు ఇతర ఫ్లోర్లకు వ్యాపించకుండా నివారించారు. చివరకు మంటలను పూర్తిగా అదుపులోకి తీసుకొచ్చారు. భవనంలో ఒక్కసారిగా మంటలు వ్యాపించడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. మంటలు పూర్తిగా అదుపులోకి రావడం, ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు. అగ్నిప్రమాదంపై స్థానిక పోలీసులు, అగ్నిమాపక అధికారులు దర్యాప్తు మొదలుపెట్టారు.

# విషగుళికలు తిని చిన్నారి మృతి

**ములుగు,ఏప్రిల్13 (ప్రజా వీక్షణం)**

ములుగు జిల్లాలో తీవ్ర విషాదం నెలకొంది. కోతుల బెడద తప్పించు కోవడానికి పెట్టిన విషగుళికలు తిని నాలుగేళ్ల బాలుడు మరణించాడు. వివరాల్లోకి వెళ్తే.. ములుగు జిల్లా గోవిందరావుపేటలోని కోతుల బెడద ఎక్కువగా ఉంది. దీంతో కోతులను చంపేందుకు అంగన్‌వాడీ కేంద్రంలోని నర్సరీ ప్రాంతంలో గ్రామ పంచాయతీ సిబ్బంది విషగుళికలను పెట్టారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్న పిల్లలకు ఇచ్చే బాలామృతంలో వాసన లేకుండా ఉండే విష గుళికలను కలిపి పెట్టారు. ఎన్టీఆర్ నగర్‌కు చెందిన ఆర్ఎంపీ వైద్యుడు శ్రవణ్ కుమారుడు హర్షిత్ నందన్ (4) ఆదివారం సాయంత్రం స్నేహితులతో ఆడుకుంటూ అంగన్‌వాడీ కేంద్రం సమీపంలోకి వెళ్లాడు. ఆ సమయంలో విష గుళికలు కలిపిన బాలామృతం చూశాడు. దాన్ని తినేశాడు. అనంతరం అస్వస్థతకు గురవ్వడంతో గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే ములుగు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో వరంగల్ ఎంజీఎం తరలించారు. అక్కడే చికిత్స పొందుతూ హర్షిత్ సోమవారం తెల్లవారుజామున మృతిచెందాడు.

# యూపిలో ఘోర రోడ్డు ప్రమాదం

## - బస్సు, ట్రక్కు ఢీకొన్న ప్రమాదంలో ఆరుగురు మృతి

**లక్నో,ఏప్రిల్13 (ప్రజా వీక్షణం)**

ఉత్తరప్రదేశ్ లో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. హాపూర్ ప్రాంతంలో బస్సు, ట్రక్కు ఢీకొన్న ఘటనలో ఆరుగురు ప్రాణాలు కోల్పోగా, ఏడుగురు తీవ్రంగా గాయపడ్డారు. పెళ్లి వేడుక నుంచి తిరిగి వస్తున్న ప్రయాణికులతో వెళ్తున్న బస్సు ముందున్న ట్రక్కును ఢీకొట్టడంతో ఈ ప్రమాదం సంభవించినట్లు పోలీసులు తెలిపారు. ఘటన సమాచారం అందిన వెంటనే అధికారులు సంఘటన స్థలానికి చేరుకుని సహాయక చర్యలు ప్రారంభించారు. ఎస్పీ జ్ఞానంజయ్ సింగ్ వివరాల ప్రకారం, ఆరుగురు అక్కడికక్కడే మరణించారు. గాయపడిన వారిని సమీప ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ప్రమాదానికి గురైన ట్రక్కును రహదారి నుంచి తొలగించి, ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు. మృతుల కుటుంబ సభ్యులు సంఘటన స్థలానికి చేరుకుని విషాదంలో మునిగిపోయారు. 12 మందిని గుర్తించగా, ఒక వ్యక్తి ఆచూకీ ఇంకా తెలియరాలేదని అధికారులు తెలిపారు.

ప్రజావీక్షణం
దినపత్రిక

# పశ్చిమాసియాలో మళ్లీ యుద్ధమేఘాలు

## - ఇరాన్‌పై దాడికి ట్రంప్, ఇజ్రాయిల్ సమాలోచనలు

## - ఎప్పుడు ఏం జరుగుతుందో అన్న ఆందోళన

**వాషింగ్టన్,ఏప్రిల్13 (ప్రజా వీక్షణం)**

అమెరికా-ఇరాన్ మధ్య శాంతి చర్చలు విఫలమవడంతో పశ్చిమాసియా మళ్లీ నివురుగప్పిన నిప్పులా మారింది. ఏ క్షణాన ఏం జరుగుతుందో అర్థం కాని పరిస్థితి నెలకొంది. మరోవైపు, ఇరాన్‌పై మళ్లీ దాడులు ప్రారంభించేందుకు అమెరికా, ఇజ్రాయెల్ సిద్ధమవుతున్నట్లు వార్తలు రావడం ఆందోళన కలిగిస్తోంది. హర్మూజ్ జలసంధిని దిగ్బంధిస్తామని అమెరికా సెంట్రల్ కమాండ్ ఇప్పటికే ప్రకటించిన సంగతి తెలిసిందే. దీంతో పాటు ఇరాన్‌పై పరిమిత స్థాయిలో సైనిక దాడులను పునరుద్ధరించేలా అగ్రరాజ్య అధ్యక్షుడు ట్రంప్ సలహాదారులు ప్రణాళికలు రచిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ మేరకు విశ్వసనీయ వర్గాలను ఉటంకిస్తూ పలు అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. అయితే, ఈ దాడులకు ట్రంప్ అంగీకరిస్తారా? లేదా అనేదానిపై ఇంకా స్పష్టత లేదు. ఇరాన్ (ఎసజీని)ను నలువైపులా నిర్బంధించి, హర్మూజ్ జలసంధిపై నియంత్రణ తెచ్చుకోవాలని ట్రంప్ భావిస్తున్నట్లు సమాచారం. మిత్ర దేశాలతో కలిసి ఈ మార్గంలో ప్రయాణించే నౌకలకు భద్రత కల్పించే అంశంపై అమెరికా అధ్యక్షుడు చర్చలు జరుపుతున్నట్లు తెలుస్తోంది. అటు, ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్సెస్ కూడా ఇరాన్‌పై దాడులు సిద్ధమవుతున్నట్లు సమాచారం. ఎలాంటి పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని ఐడీఎఫ్ చీఫ్ ఆఫ్ స్టాఫ్ లెఫ్టినెంట్ జనరల్ ఇయాల్ జమీర్ తన సైన్యాన్ని ఆదేశించినట్లు ఇజ్రాయెల్ మీడియా కథనాలు పేర్కొన్నాయి. ఇరాన్‌పై దాడుల పునరుద్ధరణ విషయంలో ట్రంప్ నిర్ణయం కోసం ఇజ్రాయెల్ ఎదురుచూస్తున్నట్లు ఆ కథనాలు తెలిపాయి. అయితే, ఈలోగా టెహ్రాన్ తమపై దాడి చేస్తే మాత్రం ప్రతిస్పందన తీవ్రంగా ఉంటుందని ఐడీఎఫ్ హెచ్చరిస్తోంది. ఇదిలా ఉండగా.. యూఎస్-ఇరాన్ చర్చలు విఫలం కావడంతో పశ్చిమాసియాలో మరోసారి ఉద్రిక్తతలు చెలరేగాయి. ఇరాన్ పోర్టుల నుంచి నౌకలు హోర్ముజ్ మీదుగా రాకపోకలు సాగించకుండా నేటి సాయంత్రం 7.30 (భారత కాలమానం ప్రకారం) నిర్బంధం విధిస్తామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. దీంతో పాటు ఇరాన్‌పై యూఎస్, ఇజ్రాయెల్‌లు మళ్లీ దాడులు చేసేందుకు ప్రణాళికలు రచిస్తున్నట్టు అంతర్జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి.అణు కార్యక్రమాన్ని వదులుకునేలా ఇరాన్‌పై ఒత్తిడి తెచ్చేందుకు ఇజ్రాయెల్ దాడులను ప్లాన్ చేస్తున్నట్టు మీడియాలో కథనాలు వెలువడ్డాయి. ఆర్మీ సిద్ధంగా ఉండాలని ఇప్పటికే ఇజ్రాయెల్ రక్షణ దళం చీఫ్ లెఫ్టినెంట్ జనరల్ జమీర్ ఆదేశించారు. మరోవైపు, ఇరాన్‌పై పరిమిత స్థాయిలో దాడులు చేసేందుకు ట్రంప్, ఆయన సలహాదారులు యోచిస్తున్నట్టు తెలుస్తోంది. ఇరాన్‌ను అన్ని వైపుల నుంచి దిగ్బంధించి చర్చల్లో ప్రతిష్టంభనను తొలగించాలనేది యూఎస్ ప్రభుత్వం ఉద్దేశమని కథనాలు వెలువడ్డాయి. ఈ దిశగా నాటో దేశాలను కూడా రంగంలోకి దింపేందుకు అమెరికా ప్రభుత్వం ప్రయత్నిస్తున్నట్టు తెలుస్తోంది. ఇప్పటికే హోర్ముజ్ మీదుగా నౌకల రాకపోకలను ఇరాన్ నిలిపివేసిన విషయం తెలిసిందే. హోర్ముజ్ జలాల్లోకి యూఎస్ యుద్ధ నౌకలు వస్తే దాడులు తప్పవని హెచ్చరించింది. చర్చలు విఫలం కావడానికి అమెరికానే కారణమని తేల్చి చెప్పింది. యూఎస్ పెట్టిన అసమంజసమైన డిమాండ్స్ కారణంగానే చర్చల్లో పీటముడి పడిందని పేర్కొంది. అణు కార్యక్రమం వదులుకునే దిశగా ఇరాన్ నుంచి స్పష్టమైన హామీలు రాలేదని యూఎస్ ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ పేర్కొన్నారు.

# స్వర్ణ నారావారిపల్లె అభివృద్ధి నమూనాలో స్వర్ణ చంద్రగిరి

## - వ్యవసాయ రంగంలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగం

## - యూరియా వినియోగాన్ని తగ్గిస్తూ ప్రకృతి వ్యవసాయంపై ప్రోత్సాహం

## - మత్స్యకారులకు జీవనోపాధి కోసం చంద్రగిరి పరిధి చెరువుల అభివృద్ధి

## - అధికారులతో సమీక్షలో కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్ ఆదేశం

**తిరుపతి,ఏప్రిల్13 (ప్రజా వీక్షణం)**



స్వర్ణ నారావారిప్లలె అభివృద్ధి నమూనాను ఆదర్శంగా తీసుకొని, స్వర్ణ చంద్రగిరి ప్రాంతాన్ని సమగ్రంగా అభివృద్ధి చేయడానికి జిల్లా అధికారులు ప్రణాళికాబద్ధంగా త్వరితగతిన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్ ఆదేశించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో, స్వర్ణ చంద్రగిరి అభివృద్ధి అంశంపై తిరుపతి ఆర్డీవో రామ్మోహన్, స్వర్ణ చంద్రగిరి ప్రత్యేక అధికారి మరియు జిల్లా పంచాయతీ అధికారి సుశీల దేవి,ఇతర శాఖల అధికారులతో కలిసి జిల్లా కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, వ్యవసాయ రంగంలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ నూతన పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. యూరియా వినియోగాన్ని తగ్గిస్తూ ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించాలని, చిరుధాన్యాల సాగుపై రైతులను ఆకర్షిస్తూ పీఎండీఎస్ కిట్లను అందించాలని తెలిపారు. రైతుల ఆదాయాన్ని పెంచేందుకు పాల ఉత్పత్తి అభివృద్ధి, రైతు బజార్ల ఏర్పాటు వంటి చర్యలు చేపట్టాలని అన్నారు. ఉద్యానవన రంగంలో మామిడి తోటల అభివృద్ధికి మ్యాంగో ఫ్రూట్ కవర్ల వినియోగంపై అవగాహన కల్పించాలని సూచించారు. చంద్రగిరి పరిధిలోని చెరువులను గుర్తించి, మత్స్యకారులకు జీవనోపాధి కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. విద్యా రంగంలో డిజిటల్ ఎడ్యుకేషన్‌ను బలోపేతం చేయాలని, పాఠశాలలలో పెండింగ్ లో పనులను సమర్థవంతంగా అమలు చేయాలని, 'మనబడి ? మన భవిష్యత్తు' కార్యక్రమం కింద పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రణాళికను పటిష్టంగా అమలు చేయాలన్నారు. సంక్షేమ వసతి గృహాల్లో మౌలిక సదుపాయాలు కల్పించడం, ఇంప్రూవ్‌మెంట్ ప్యానెల్‌లు ఏర్పాటు చేయడం, విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు, యోగా తరగతులు నిర్వహించడం వంటి చర్యలు చేపట్టాలని తెలిపారు. స్వర్ణ చంద్రగిరిలో ప్రతి ఇంటికి రూఫ్‌టాప్ సోలార్ వ్యవస్థలు ఏర్పాటు చేయాలని, అర్హులైన వారికి గృహాలు మంజూరు చేయాలని సూచించారు. జల జీవన్ మిషన్ కింద ప్రతి ఇంటికి తాగునీటి కనెక్షన్ అందించాల్సిందిగా చెప్పారు. పశువైద్య అధికారులు పశువులకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన మందులు అందజేశారు. గేదెలు, ఎద్దులు, మేకలు, గొర్రెలకు వ్యాధి నిరోధక టీకాలు వేయడం జరిగింది. అలాగే కీటకనాశన మందులు పంపిణీ చేసి పశువులను వ్యాధుల నుండి రక్షించే చర్యలు చేపట్టాలన్నారు.పశుసంవర్ధక శాఖ ద్వారా అందిస్తున్న పథకాలు, సబ్సిడీలు, బీమా సదుపాయాలపై రైతులకు వివరాలు తెలియ చేయాలన్నారు. ఆధునిక పద్ధతుల్లో పశు పోషణ చేయడం ద్వారా అదనపు ఆదాయం పొందవచ్చని సూచించారు. శిబిరంలో పాల్గొన్న రైతులు పశువుల సంరక్షణకు సంబంధించిన సందేహాలను నిపుణులను అడిగి నివృత్తి చేసుకున్నారు. ఈ శిబిరం ద్వారా పశువుల ఆరోగ్య పరిస్థితి మెరుగుపడటంతో పాటు రైతులకు ఉపయోగకరమైన సమాచారం అందించాలని తెలిపారు. సంజీవని ప్రాజెక్టుకు సంబంధించిన ప్రతిపాదనలు పంపాలని, ఏబిహెచ్‌ఏ నమోదును 100శాతం పూర్తి చేయాలని ఆదేశించారు. అంగన్వాడీ కేంద్రాల భవనాల నిర్మాణాన్ని వేగవంతం చేయాలని, పోషణ్ 2.0 పథకంపై అవగాహన కల్పించాలని తెలిపారు. జిల్లా నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాల ద్వారా యువతకు శిక్షణ అందించి ఉపాధి అవకాశాలు కల్పించాలని సూచించారు. ఎంపీడీవోలు యూన్గి÷డ్ ఫ్యామిలీ సర్వేను పూర్తి చేయాలని, ప్రతి ఒక్కరికీ ఆధార్, జనన ధృవపత్రాలు అందుబాటులో ఉండేలా చూడాలని తెలిపారు. ఎన్‌ఆర్‌ఈజీఎస్ కింద స్వర్ణ చంద్రగిరి అభివృద్ధికి సంబంధించిన పనులను పూర్తి చేయాలని, జిల్లా అధికారులు అందరూ సమన్వయంతో పనిచేసి అభివృద్ధి సాధించేందుకు కృషి చేయాలని తెలిపారు. అన్ని శాఖ ల వారు అందరూ సమన్వయంతో వారికి కేటాయించిన విధులను నిర్దేశిరచిన సమయంలోపల పూర్తి చేయాలని సూచించారు. అనంతరం భారత ప్రభుత్వం ఆధ్వర్యంలో నారీ శక్తి వందన సమ్మేళనానికి సంబంధించిన గౌరవ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ గారు ప్రసంగిస్తున్న సందేశాన్ని వర్చువల్ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. సమావేశంలో డి ఈ ఓ కుమార్, సి పి ఓ రాజశేఖర్, ద్వామా పి డి శ్రీనివాసరావు, డి ఆర్ డి ఏ పి డి శోభన్ బాబు, డి ఎమ్ అండ్ హెచ్ ఓ బాలకృష్ణ నాయక్,వ్యవసాయ శాఖ అధికారి ప్రసాద రావు, వివిధ శాఖల జిల్లా అధికారులు, మండల అధికారులు పాల్గొన్నారు.

# వచ్చే విద్యాసంవత్సరానికి డిగ్రీ ప్రవేశాలు

## -15నుంచి సీట్ల భర్తీకి తొలివిడత ప్రక్రియ

## - తెలంగాణలో దోస్త్ నోటిఫికేషన్ విడుదల

**హైదరాబాద్,ఏప్రిల్13 (ప్రజా వీక్షణం)**

రాష్ట్రంలో వచ్చే విద్యా సంవత్సరం 2026-27లో ప్రభుత్వ, ప్రైవేటు డిగ్రీ కాలేజీల్లో సీట్ల భర్తీకి నిర్వహించే దోస్త్ నోటిఫికేషన్‌ను తెలంగాణ ఉన్నత విద్యామండలి విడుదల చేసింది. ఈనెల 15వ తేదీ నుంచి మే 7వ తేదీ వరకు తొలి విడతలో సీట్ల భర్తీ పక్రియ కొనసాగుతుంది.అర్హులైన విద్యార్థులు రూ.200 రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించి దరఖాస్తు చేసుకోవాలి. ఏప్రిల్ 30వ తేదీ నుంచి మే 8వ తేదీ వరకు వెబ్ ఆప్షన్లకు అవకాశం కల్పించారు. ఒక మే 14వ తేదీన తొలి దశ సీట్ల కేటాయింపు జరగనుంది. సీట్ల కేటాయింపు అనంతరం ఆన్‌లైన్‌లో సెల్ఫ్ రిపోర్టింగ్ చేయాల్సి ఉంటుంది. ఇక రెండో దశ సీట్ల రిజిస్ట్రేషన్ పక్రియ మే 15వ తేదీ నుంచి మే 25వ తేదీ వరకు కొనసాగనుంది. మే 15వ తేదీ నుంచి మే 26వ తేదీ వరకు వెబ్ ఆప్షన్లు ఇచ్చుకోవచ్చు. మే 30వ తేదీ సీట్లు కేటాయిస్తారు. మూడో విడత రిజిస్ట్రేషన్ పక్రియ మే 31వ తేదీ నుంచి జూన్ 15వ తేదీ వరకు జరగనుంది. జూన్ 16వ తేదీ వరకు వెబ్ ఆప్షన్లు ఇచ్చుకోవచ్చు. జూన్ 20వ తేదీన సీట్ల కేటాయింపు ఉంటుంది. రెండో, మూడో విడత సీట్ల కేటాయింపు అనంతరం కూడా ఆన్‌లైన్‌లో సెల్ఫ్ రిపోర్టింగ్ చేయాల్సి ఉంటుంది. సీట్లు పొందిన విద్యార్థులు ఆయా కాలేజీల్లో జూన్ 20 నుంచి 27వ తేదీ మధ్యలో హాజరై అడ్మిషన్ పక్రియను పూర్తి చేయాల్సి ఉంటుంది. జూన్ 29, 30వ తేదీల్లో ఓరియంటేషన్ కార్యక్రమాలు నిర్వహిస్తారు. జూలై 1వ తేదీ నుంచి తరగతులు ప్రారంభమవుతాయి.

# తట్టేపల్లి వద్ద ఘోర రోడ్డు ప్రమాదం

## - స్కూటీని ఢీకొట్టిన లారీ

## - ప్రమాదంలో దంపతులతో సహా చిన్నారి మృతి

**వికారాబాద్,ఏప్రిల్13 (ప్రజా వీక్షణం)**

వికారాబాద్ జిల్లాలో తీవ్ర విషాదం నెలకొంది. పెద్దేముల్ మండలం తట్టేపల్లి దగ్గర ఓ టూ వీలర్‌ను లారీ ఢీకొట్టింది. ఈ ఘటనలో భార్యాభర్తలు సహా ఓ చిన్నారి దుర్మరణం చెందింది. మృతులు తాండూరు నుంచి జహీరాబాద్ వైపు వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది. కాగా, యాక్సిడెంట్ తర్వాత పారిపోయిన లారీ డ్రైవర్.. పెద్దేముల్ పోలీస్ స్టేషన్‌లో లొంగిపోయినట్లు తెలుస్తోంది. పెద్దేముల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వికారాబాద్ జిల్లా పెద్దేముల్ మండల పరిధిలోని త్టటెపల్లి గ్రామ శివారులో రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ఘటనలో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు మృతి చెందారు. వికారాబాద్ జిల్లా రుక్మాపూర్ గ్రామానికి చెందిన పావని (35), ఆమె భర్త కవిరాజ్ (40) జహీరాబాద్‌లో నివసిస్తున్నారు. వీరు ఆదివారం సాయంత్రం జహీరాబాద్ నుంచి రుక్మాపూర్ గ్రామానికి వెళ్లారు. తిరిగి వస్తుండగా లారీ వీరి స్కూటీని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో పావని, కవిరాజ్, కీర్తన అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. కుమారుడు కార్తీక్ స్వల్ప గాయాలతో ప్రాణాలతో బయటపడ్డాడు. చికిత్స నిమిత్తం తాండూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రమాదానికి కారణమైన లారీ డ్రైవర్ మహమ్మద్ షరీఫ్‌పై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు పెద్దేముల్ పోలీసులు తెలిపారు.

# మహిళా రిజర్వేషన్ బిల్లుపై మోడీ కపట నాటకం

## - సిపిఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు విమర్శ

**విశాఖపట్టణం,ఏప్రిల్13 (ప్రజా వీక్షణం)**

మహిళా రిజర్వేషన్ బిల్లుపై మోడీ ప్రభుత్వం కపట నాటకం ఆడుతుందని సిపిఎం నేతలు మండిపడ్డారు. మహిళా రిజర్వేషన్ బిల్లుపై సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రస్తుతం జరుగుతున్న ఐదు రాష్ట్రాల ఎన్నికల నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం ఈ చర్చ చేస్తుందని ఆగ్రహించారు. 2023లోనే చట్టం అయినప్పుడే 2011 జనాభా లెక్కల ఆధారంగా చట్టాన్ని అమలు చేయాలని సిపిఎం కోరిందని తెలిపారు. అప్పుడు డిలిమిటేషన్, సీట్ల పెంపుదల, సెన్సస్ అయిన తరువాత అమలు చేస్తామని కేంద్ర ప్రభుత్వం మాయమాటలు చెప్పిందని తెలిపారు. కానీ ఇప్పుడు అవేమి జరగకపోయినా మహిళా రిజర్వేషన్ బిల్లుపై చర్చ కోసం 3రోజుల పాటు ప్రత్యేక పార్లమెంట్ సమావేశాలు ఏర్పాటు చేస్తున్నారని ఆగ్రహించారు. బిల్లుకి మద్దతు ఇవ్వాలని ప్రధాని మోడీ రాజకీయ పార్టీల ఫ్లోర్ లీడర్లకు లేఖ రాయడం నాటమని తెలిపారు. రాష్ట్రాల ప్రతినిధుల అభిప్రాయాలను తెలుసుకోకుండా, కేంద్రం నిర్ణయాలను అమలు చేయాలని ఏకపక్ష వైఖరిని ఖండిస్తున్నట్లు తెలిపారు. డిలిమిటేషన్ ను జనాభా ప్రాతిపదికన కాకుండా సీట్ల పెంపుదలను బట్టి అమలు చేయాలని అనేక రాష్ట్రాలు ప్రతిపాదించాయని తెలిపారు. డిలిమిటేషన్ తో సంబంధం తేకుండా మహిళా రిజర్వేషన్ బిల్లును అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో కేంద్ర కమిటీ సభ్యులు లోకనాథం పాల్గొన్నారు.



# ఆశాకు క్రికెటర్ సచిన్ నివాళి

**ముంబై,ఏప్రిల్13 (ప్రజా వీక్షణం)**

ఆశా భౌతికకాయానికి భారత క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్, అతడి భార్య అంజలితో కలిసి నివాళులు అర్పించాడు. ఆశా భోస్లేతో సచిన్ కుటుంబానికి చాలా కాలంగా అత్యంత సన్నిహిత సంబంధం ఉంది. ఆమె భౌతిక కాయానికి నివాళులు అర్పిస్తూ సచిన్ కంటతడి పెట్టుకున్నాడు. అక్కడే ఉన్న ఆమె కుటుంబ సభ్యులతో మాట్లాడి సంతాపం తెలిపాడు. అతడితో పాటు ఆశా భోస్లేను చివరిసారిగా చూసేందుకు వచ్చిన సినీ, రాజకీయ ప్రముఖులు కూడా కన్నీటి వీడ్కోలు పలికారు. సంగీత ప్రపంచంలో ఆమె సేవలను స్మరించుకుంటూ దేశవ్యాప్తంగా ప్రముఖులు నివాళులు అర్పించారు. ప్రముఖ గాయని ఆశా భోస్లే ఆదివారం కన్నుమూసిన సంగతి తెలిసిందే. ముంబైలోని బ్రీచ్ క్యాండీ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ 92 ఏళ్ల వయసులో ఆమె కన్నుమూశారు. ఆశా అంత్యక్రియలు సోమవారం సాయంత్రం ముంబైలోని శివాజి పార్క్‌లో జరిగాయి. ఆమె భౌతికకాయాన్ని సందర్శనార్థం ముంబైలోని నివాసంలో ఉంచగా పలువురు ప్రముఖులు సందర్శించి నివాళి అర్పించారు. .

# శ్రీకాకుళం నుంచి తిరుపతికి నేరుగా రైలు

## - హమ్ సఫర్ ఎక్స్‌ప్రెస్‌ను ప్రారంభించిన రామ్మోహన్


**శ్రీకాకుళం,ఏప్రిల్13 (ప్రజా వీక్షణం):**

శ్రీకాకుళం జిల్లావాసుల ఎన్నో ఏళ్ల కల నెరవేరింది. శ్రీకాకుళం నుంచి తిరుపతికి నేరుగా మొదటి రెగ్యులర్ రైలు ప్రారంభమైది. హమ్ సఫర్ ఎక్స్‌ప్రెస్ రైలును కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు ప్రారంభించారు. రూ.35 కోట్లతో శ్రీకాకుళం రైల్వేస్టేషన్ అభివృద్ధి చేశామని రామ్మోహన్ నాయుడు అన్నారు. శ్రీకాకుళం ప్రజల దీర్ఘకాలిక కోరిక నెరవేరిందంటూ ఆయన ఆనందం వ్యక్తం చేశారు. 75 ఏళ్ల జిల్లా చరిత్రలో తొలిసారిగా శ్రీకాకుళం నుంచి తిరుపతికి నేరుగా రెగ్యులర్ రైలు సర్వీస్ ప్రారంభమైందని తెలిపారు. త్వరలో మూలపేట గ్రీన్‌ఫీల్డ్ పోర్టు పూర్తవుతుందని తెలిపారు. ఇక హమ్ సఫర్ ఎక్స్‌ప్రెస్ రైలు శ్రీకాకుళం రోడ్ నుంచి ప్రతి సోమవారం, తిరుపతి నుంచి ప్రతి ఆదివారం అందుబాటులో ఉంటుంది. గతంలో కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు చొరవ తీసుకుని శ్రీకాకుళం నుంచి తిరుపతికి రైలు నడపాలని రైల్వేమంత్రి అశ్విని వైష్ణవ్‌ని కోరారు. వెంటనే స్పందించిన రైల్వేమంత్రి ఈ ప్రతిపాదనలపై అధికారులకు ఆదేశాలు ఇవ్వడంతో రెగ్యులర్ రైలును మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈక్రమంలో తాజాగా శ్రీకాకుళం రోడ్ రైల్వేస్టేషన్ నుంచి తిరుపతికి రైలు నంబర్ 17439/40 హమ్‌సఫర్ ఎక్స్‌ప్రెస్ ప్రారంభమైంది. ఈ హమ్ సఫర్ ఎక్స్‌ప్రెస్ ప్రతి ఆదివారం సాయంత్రం తిరుపతి నుంచి బయల్దేరుతుంది.. అలాగే ప్రతి సోమవారం శ్రీకాకుళం రోడ్డు నుంచి బయల్దేరుతుంది.

# రాష్ట్రపతిని కలిసిన లోకేశ్ బృందం

**న్యూఢిల్లీ,ఏప్రిల్13 (ప్రజా వీక్షణం)**


రాష్ట్రపతి ద్రౌపదీ ముర్మూకు ఏపి ప్రతినిధి బృందం కృతజ్ఞతలు తెలిపింది. అమరావతి బిల్లు అమల్లోకి రావడంతో ఏపీ మంత్రి నారా లోకేశ్, కూటమి ఎంపీలు ముర్ముతో భేటీ అయ్యారు. అమరావతి బిల్లు చట్టరూపం దాల్చడంతో.. లోకేశ్ బృందం రాష్ట్రపతికి ధన్యవాదాలు తెలిపింది. ఈ సందర్భంగా అమరావతి చారిత్రక, సాంస్కృతిక ప్రాధాన్యాన్ని రాష్ట్రపతికి లోకేశ్ వివరించారు. అమరావతి రాజధాని ప్రజల కల అన్నారు. ఇందుకోసం రైతులు 33 వేల ఎకరాలు ఉదారంగా ఇచ్చారని అన్నారు. గత ఐదేళ్ల జగన్ పాలనలో జరిగిన నష్టాన్ని వివరించారు.





# బిఆర్ఎస్‌తో పొత్తు ఇక్కడికే పరిమితం

## - ఖానాపూర్ సభలో బిజెపి అధ్యక్షుడు రాంచంద్రరావు





**నిర్మల్,ఏప్రిల్13 (ప్రజా వీక్షణం)**

పొత్తులపై తెలంగాణ బీజేపీ చీఫ్ రాంచందర్ రావు సంచలన వ్యాఖ్యలు చేశారు. సోమవారం ఖానాపూర్ మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి విజయం సాధించడాన్ని పురస్కరించుకుని నిర్మల్‌లో ఏర్పాటు చేసిన విజయోత్సవ సభలో ఆయన మాట్లాడుతూ.. భవిష్యత్తులో బీజేపీ ఏ పార్టీతోనూ పొత్తు పెట్టుకోదని స్పష్టం చేశారు. ఖానాపూర్‌లో బీఆర్ఎస్‌తో జరిగిన పొత్తు స్థానిక నాయకుల మధ్య మాత్రమే జరిగిందని.. పార్టీ స్థాయిలో కాదని వివరించారు. ఖానాపూర్ మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ నాయకులు, పోలీసుల బలంతో గుండాయిజం చేసినా ప్రజలు బీజేపీకి మద్దతు ఇచ్చి పట్టం కట్టారని అన్నారు. కాంగ్రెస్ అధికారబలం ఖానాపూర్‌లో పనిచేయలేదని ఆయన పేర్కొన్నారు. తలసరి ఆదాయం ఉంటేనే అసెంబ్లీ సీట్లు పెంచాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు బాధాకరమని రాంచందర్ రావు విమర్శించారు. ఈ వ్యాఖ్యలు పేదవారిని, వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధిని అణచివేయాలనే ఉద్దేశంతో చేసినట్లుగా ఉన్నాయని ఆయన అభిప్రాయపడ్డారు. 50 ఏళ్లు పాలించిన కాంగ్రెస్ పార్టీ ఎన్నడూ మహిళల హక్కుల గురించి మాట్లాడలేదని వ్యాఖ్యానించారు. మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు బీజేపీ నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు. వికసిత్ భారత్ లక్ష్యంతో ఏప్రిల్ 16న మహిళా రిజర్వేషన్ కోసం ప్రత్యేక బిల్లును ప్రవేశపెట్టనుందని తెలంగాణ బీజేపీ చీఫ్ రాంచందర్ రావు వెల్లడించారు.



# నెలాఖరులోగా డీ-రెగ్యులేషన్ ఫేజ్-2

## - దరఖాస్తు నుంచి అనుమతుల వరకు ఆన్‌లైన్

## - కేంద్ర కార్యదర్శి సందీప్ పౌండ్రిక్ బృందంతో సీఎం సమీక్ష





**అమరావతి,ఏప్రిల్13 (ప్రజా వీక్షణం)**

మే నెలాఖరులోగా డీ-రెగ్యులేషన్ ఫేజ్-2 అమల్లోకి వచ్చేలా చూడాలని సీఎం చంద్రబాబు అన్నారు. దరఖాస్తు నుంచి అనుమతుల వరకు వివరాలన్నీ ఆన్‌లైన్ చేయాలని సూచించారు. ఉక్కు మంత్రిత్వశాఖ కార్యదర్శి సందీప్ పౌండ్రిక్ నేతృత్వంలోని కేంద్ర ప్రతినిధి బృందంతో సీఎం చంద్రబాబు సమీక్ష నిర్వహించారు. కేంద్ర ప్రతిపాదిత డీ-రెగ్యులేషన్ ఫేజ్-2 విధానాలపై చర్చించారు. పరిశ్రమల ఏర్పాటులో వేగం, అనుమతుల సులభతరంపై మాట్లాడారు. కేంద్రం రూపొందించిన ప్రతిపాదనలను సందీప్ పౌండ్రిక్.. ముఖ్యమంత్రి ఎదుట ఉంచారు. ఈ ప్రతిపాదనలపై వివిధ శాఖల ఉన్నతాధికారులతోనూ సీఎం సమీక్షించారు. పరిశ్రమలకు అనుమతులు, నిబంధనల్లో రాష్ట్రం చాలా ముందుందని సందీప్ పౌండ్రిక్ చెప్పగా.. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ అమలు చేస్తున్నామని సీఎం తెలిపారు. స్పీడ్ ఆఫ్ డెలివరింగ్ గవర్నెన్స్ విధానం అవలంబిస్తున్నట్లు వెల్లడించారు. డీ-రెగ్యులేషన్ ఫేజ్-3 చేపడుతున్నారా? అని సందీప్ పౌండ్రిక్‌ను సీఎం అడిగారు. జూన్ నెల నుంచి ఫేజ్-3పై పని చేస్తామని ఆయన తెలిపారు. ఫేజ్-3లో టెక్నాలజీ అనుసంధానం, ఏఐ టూల్స్ వినియోగానికి పెద్దపీట వేయాలని సీఎం కోరారు.ప్రస్తుతం 800కు పైగా ఉన్న నిబంధనలను 100 లోపునకు తీసుకురావాలని చంద్రబాబు సూచించారు. ప్రజల భద్రత, పర్యావరణం విషయంలో రాజీపడొద్దన్నారు. వేధింపులు లేకుండా థర్డ్ పార్టీ తనిఖీలకు ప్రాధాన్యం ఇవ్వాలని ఆదేశించారు. అటవీ చట్టాలను సరళీకరించాలని కేంద్ర బృందానికి సూచించారు. ఫైర్ సేఫ్టీపై నేషనల్ బిల్డింగ్ కోడ్ స్థానంలో రాష్ట్ర నిబంధనల విషయంలో పలు సూచనలు చేశారు. డబుల్ లైసెన్సింగ్ తరహా పద్ధతులను తప్పించాలన్నారు. ఒకసారి రిజిస్ట్రేషన్ చేసుకుంటే జీవితకాలం చెల్లుబాటు అయ్యేలా నిబంధనలు సవరించాలన్నారు. స్టీల్ సెక్రటరీ ప్రతిపాదనలపై రాష్ట్రానికి చెందిన వివిధ శాఖల ఉన్నతాధికారులతోనూ సీఎం సమీక్షించారు. పర్మిషన్లు, లైసెన్సులను సింగిల్ డిజిట్‌కు పరిమితం చేయాలని సీఎం చంద్రబాబు మార్గనిర్దేశర చేశారు. ప్రజల భద్రత, పర్యావరణం వంటి అంశాలపై తీసుకోవాల్సిన జాగ్రత్తల విషయంలో రాజీ పడకూడదని స్పష్టం చేశారు. డబుల్ లైసెన్సింగ్ తరహా పద్ధతులను తప్పించాలని దిశానిర్దేశం చేశారు. ఒకసారి రిజిస్ట్రేషన్ చేసుకుంటే జీవిత కాలం చెల్లుబాటు కావాలని సూచించారు. మే నెలాఖరులోగా డీరెగ్యులేషన్ ఫేజ్-2 అమల్లోకి వచ్చేలా చూడాలని.. ఆ మేరకు ఆర్డినెన్సులు తీసుకురావాలని దిశానిర్దేశర చేశారు. దరఖాస్తు నుంచి అనుమతుల వరకూ మొత్తం ప్రక్రియను ఆన్‌లైన్ చేయాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. ఫేజ్-2 అమలు తర్వాత పరిశ్రమల అనుమతుల ఏర్పాటుకు ఇప్పుడున్న ప్రక్రియలో 40 శాతం మేర సమయం తగ్గాలని సూచించారు. పరిశ్రమలకు అనుమతులు, నిబంధనలను సడలించే విషయంలో తమ ప్రతిపాదనలకంటే ఏపీ చాలా ముందుందని కేంద్ర స్టీల్ సెక్రటరీ సందీప్ పౌండ్రిక్ తెలిపారు. ప్రజలకు సేవలు అందించడం కోసం స్పీడ్ ఆఫ్ డెలివరింగ్ గవర్నెన్స్ విధానాన్ని అవలంబిస్తున్నట్లు సీఎం స్పష్టం చేశారు.

GENERAL NEWS
14 మంగళవారం, ఏప్రిల్ 2026
8
www.prajaveekshanam.in
ప్రజావీక్షణం
దినపత్రిక

# మహిళలంటే బిజెపికి చిన్నచూపు

## - 15మంది బిజెపి అధ్యక్షులు మారినా..మహిళలకు చోటేది
## - ముఖ్య పదవుల్లో కూడా మహిళలకు చోటివ్వని బిజెపి
## - కాంగ్రెస్‌లో ఇందిర, సోనియాలు అధ్యక్షులుగా పనిచేశారు
## - బండి సంజయ్ విమర్శలు మాని నిజాలు తెలుసుకోవాలి
## - మీడియా సమవేశంలో సిఎం రేవంత్ రెడ్డి చురకలు

**హైదరాబాద్,ఏప్రిల్13 (ప్రజా వీక్షణం)**



సీట్ల పునర్విభజనలో పర్సంటేజీలు కాదు నెంబర్ ముఖ్యం అని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. రాజకీయాల్లో నెంబర్ ముఖ్యం అంటూ.. వాజపేయి ప్రభుత్వం ఒక్క ఓటుతో పడిపోయిందని గుర్తు చేశారు. నెంబర్ లేకుండా రాజకీయాల్లో ఎవరూ ఎవరితోనూ చర్చలు చేయరని అన్నారు. ఇకపోతే ఇప్పటివరకు15 మంది బీజేపీ అధ్యక్షుల నియామకం జరిగింది.. కాని ఇప్పటివరకు భారతీయజనతా పార్టీ అధ్యక్షురాలి గా ఒక్క మహిళ నియామకంజరగలేదని సిఎం రేవంత్ చురకలంటించారు. బీజేపీకి మహిళ పట్లగౌరవం, చిత్తశుద్ది ఉందో అర్ధమౌతుందన్నారు. ఇందిరాగాంధీ, సోనియా గాంధీ నాయకత్వంలో అతి ఎక్కువ కాలం పనిచేసిన పార్టీ కాంగ్రెస్ మహిళలకు అన్యాయం చేస్తుందా.. అని ప్రశ్నించారు. బీజేపీకి మహిళను అధ్యక్షురాలిగా నియమించుకున్న తర్వాత బండి సంజయ్ మాట్లాడాలన్నారు. బండి సంజయ్ వ్యాఖ్యలుదక్షణాది రాష్ట్రాల్లోని ఎస్సీ,ఎస్టీ, మహిళలకు వ్యతిరేకం.. అన్నారు. మా ఎంపీలు తెలంగాణను సాధించారు.. ఇప్పుడు పునర్విభజన పైన కూడా పోరాడుతారని సిఎం అన్నారు. దక్షిణాది రాష్ట్రాలతో పాటు చిన్న రాష్ట్రాలను కూడా ఐక్యం చేస్తాం అని అన్నారు. పార్లమెంట్ లో బిల్లును ఎలా ఆమోదిస్తారోచూస్తాం.. 60యేళ్లలోమహిళల కోసం కాంగ్రెస్ పార్టీ చాలా చేసింది..46యేళ్లలో ఒక్క మహిళను పార్టీ అధ్యక్షురాలిని బీజేపీచేయలేదు.. జనరల్ సెక్రటరీ ఆర్గనైజేషన్పదవి కూడా ఇవ్వలేదన్నారు. మహిళలను చిన్న చూపు చూడటమే బీజేపీలక్షణం.. ద్వితీయ శ్రేణి పౌరులుగా మహిళలను చూస్తున్నారు..స్వాతంత్ర్యం తెచ్చింది, రాజ్యాంగాన్ని తెచ్చింది, రిజర్వేషన్లుకల్పించింది కాంగ్రెస్ పార్టీ.. ఇప్పుడు దేశాన్ని కాపాడుకునే బాధ్యత కూడా కాంగ్రెస్ దే.. అన్నారు. యాభై శాతంతో సీట్ల పునర్విభజన జరిగితే కిషన్ రెడ్డి, బండి సంజయ్ లు మోదీ ఇంటి ముందు బంట్రోతు లుగానిలబడాల్సివస్తుంది.. వాళ్ల అవసరం ఇక ముందు ఉండదన్నారు. అన్ని దక్షిణాది రాష్ట్రాలతో పాటు ఢిల్లీ, పంజాబ్ లాంటి చిన్న రాష్ట్రాలకు కుదీనిపైన లేఖ రాస్తానని సిఎం రేవంత్ అన్నారు. గతంలోనియోజకవర్గాలపునర్విభజన మూడు సార్లు జరిగింది.. 1967 లో 520సీట్లకు పెంచారు,1976 లో 542సీట్లకుపెంచారు..తర్వాత సిక్కిం నుంచి ఒక సీటు పెరిగి 543 కి పెరిగింది.. 2001 లో వాజ్ పేయి పునర్విభజన పైన చట్టసవరణ చేశారు. దాని వల్ల 2009 లో తెలంగాణకు17 ఎంపీ సీట్లు , ఆంధ్రాకు25 ఎంపీ సీట్లు వచ్చాయి...తెలంగాణ కు 119 అసెంబ్లీ సీట్లు, ఏపీకి175శాసన సభ సీట్లు పెరిగాయి.. స్థూల ఉత్పత్తిలోఅత్యధికంగాభాగస్వామ్యం చేస్తున్న రాష్ట్రాలకు అవకాశం ఇవ్వాలి.. ఈశాన్య రాష్ట్రాల్లో, కేంద్ర పాలిత ప్రాంతాల్లో జనాభాప్రాతిపాదికన సీట్లు లేవు.. 100 శాతం జనాభాప్రాతిపదికన సీట్ల పెంపు జరగలేదు.. ప్రాతినిధ్యం కోసమే ఈశాన్య రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో ఎంపీ సీట్లు ఇచ్చారని సిఎం గుర్తు చేశారు. సీట్ల పునర్విజభన పైన అఖిల పక్ష సమావేశంతో పాటు అన్ని సంస్థలతోసంప్రదింపులు చేయాలి.. పార్లమెంటులోపునర్విభజన పైన చర్చించాలి.. నిపుణలతో ఒక కమిటీ ఏర్పాటు చేయాలి.. అన్ని అసెంబ్లీల్లో చర్చకు పెట్టి పార్లమెంటులో ఆమోదించి నిర్ణయం తీసుకోవాలి.. 2028 మార్చి వరకు ఈ పక్రియను పూర్తి చేయొచ్చు...హడావుడి గా చేసి దేశంలో దక్షణ, ఉత్తరాది మధ్యగ్యాప్ పెంచొద్దని సిఎం రేవంత్ డిమాండ్ చేశారు.

# ఆస్తిపన్ను బకాయిలపై 50శాతం వడ్డీ రాయితీ

## - నెలఖారు వరకు గడువు పొడిగింపు

**అమరావతి,ఏప్రిల్13 (ప్రజా వీక్షణం)**

పట్టణ ప్రాంతాల్లో ఆస్తిపన్ను బకాయిలపై ఆస్తిపన్ను బకాయిల చెల్లింపుపై ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. 31 మార్చి 2026 నాటికి ఉన్న బకాయిలపై వడ్డీలో 50 శాతం రాయితీ ఇవ్వాలని నిర్ణయించింది. అయితే ఈ గడువును ఈ నెలాఖరు వరకు పొగిస్తూ ఉత్తర్వులు ఇచ్చింది. ఈ రాయితీని పొందాలంటే బకాయి మొత్తం పూర్తిగా చెల్లించి, మిగిలిన 50 శాతం వడ్డీని ఒకేసారి చెల్లించాల్సి ఉంటుంది. ఇది ఆస్తిపన్ను చెల్లించని వారికి గోల్డెన్ ఛాన్స్ అని చెప్పుకోవాలి. సీడీఎమ్ఏ కమిషనర్ సంపత్ కుమార్ సూచనల మేరకు.. ఈ రాయితీ అమలు ఏప్రిల్ 30 వరకు మాత్రమే అమల్లో ఉండనుంది. 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన బకాయిలపై మాత్రమే 50 శాతం వడ్డీ రాయితీ వర్తిస్తుంది. పట్టణ ప్రజలు ఈ అవకాశాన్ని వెంటనే వినియోగించుకోవాలని అధికారులు విజ్ఞప్తి చేశారు. 2026-27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఆస్తిపన్నును ఏప్రిల్ 30, 2026 లోపు ముందస్తుగా మొత్తం చెల్లించేవారికి 5 శాతం అదనపు రాయితీ కూడా లభిస్తుంది. మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్లలోనూ రాయితీ అమలులో ఉండనుంది. పట్టణాభివృద్ధికి పన్నులు చెల్లించాలని అధికారులు విజ్ఞప్తి చేశారు. ప్రజలు ఆలస్యం చేయకుండా వెంటనే సమీప మున్సిపల్ కార్యాలయం, ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా ఆస్తి పన్ను చెల్లించి ఈ సువర్ణ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అధికారులు సూచించారు.



# టిటిడి ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి చేతివాటం

## - లగేజ్ కౌంటర్ వద్ద వసూళ్లకు
## దిగడంతో సస్పెన్షన్

**తిరుమల,ఏప్రిల్13 (ప్రజా వీక్షణం)**

కలియుగ దేవుడు శ్రీ వెంకంటేశ్వర స్వామి దర్శనంకు వెళ్లే సమయంలో ఎంటువంటి ఎలక్ట్రానిక్ గాడ్జెట్స్, ఇంకా మరికొన్ని వస్తువులు తీసుకెళ్లడం నిషిద్ధం. అయితే అలాంటి వాటిని దర్శనంకి ముందే భద్రపరుచుకొనేందుకు టీటీడీ కొన్ని ప్రత్యేక సేవలను పూర్తిగా ఉచితంగా అందిస్తుంది. భక్తుల సేవలో పారదర్శకతకు ప్రాధాన్యత ఇస్తున్న టీటీడీ ఈ విషయమై మరో కీలక నిర్ణయం తీసుకుంది. తిరుమలలోని లగేజీ కౌంటర్ వద్ద భక్తుల నుంచి అక్రమంగా డబ్బులు వసూలు చేసిన ఘటనపై స్పందించిన టీటీడీ, సంబంధిత ఔట్‌సోర్సింగ్ ఉద్యోగిని విధుల నుండి తొలగించింది. తిరుమల లగేజీ సెంటర్‌లో నరసింహారెడ్డి అనే వ్యక్తి భక్తుల నుంచి డబ్బులు తీసుకుంటున్నట్లు టీటీడీ దృష్టికి వచ్చింది. ఈ వ్యవహారంపై వెంటనే చర్యలు తీసుకున్న అధికారులు, అతడిని ఉద్యోగం నుంచి తొలగించారు.ఈ ఘటనకు సంబంధించి టీటీడీ స్పష్టంగా తెలిపింది. తిరుమలలో లగేజీ డిపాజిట్ సేవలు పూర్తిగా ఉచితంగా అందించబడుతున్నాయి. భక్తులు తమ సామాను భద్రపరచడానికి ఎలాంటి రుసుము చెల్లించాల్సిన అవసరం లేదని.. ఈ విషయంలో ఎవరైనా డబ్బులు అడిగితే భక్తులు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. అలాగే ఇలాంటి అక్రమ వసూళ్లు ఎక్కడైనా గమనించిన పక్షంలో వెంటనే విజిలెన్స్ కంట్రోల్ రూమ్ నెంబర్ 9866898630కు సమాచారం ఇవ్వాలని టీటీడీ భక్తులను కోరింది. భక్తుల విశ్వాసాన్ని కాపాడటం, సేవల్లో పారదర్శకతను కొనసాగించడం కోసం టీటీడీ ఇలాంటి చర్యలు తీసుకుంటుందని అధికారులు తెలిపారు.

# ఉగ్రకేసులో ముగిసిన నిందితుల కస్టడీ

## - విలువైన సమాచారం
## రాబట్టిన పోలీసులు

**విజయవాడ,ఏప్రిల్13 (ప్రజా వీక్షణం)**

ఆంధ్రప్రదేశ్‌లో కలకలం రేపిన ఉగ్రవాద సంబంధాల కేసులో ఆరుగురు నిందితుల పోలీస్ కస్టడీ సోమవారంతో ముగిసింది. గత ఐదు రోజులుగా పోలీసుల విచారణలో ఉన్న నిందితులను అధికారులు క్షుణ్ణంగా ప్రశ్నించి, కీలక సమాచారాన్ని సేకరించినట్టు సమాచారం. నిందితులను ఐదు రోజుల పాటు ప్రత్యేక బృందాలు విచారించాయి. ఈ విచారణలో ప్రధానంగా సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్స్‌ల ద్వారా ఉగ్రవాద భావజాలాన్ని ఎలా వ్యాప్తి చేస్తున్నారు? ఎవరెవరిని సంప్రదిస్తున్నారు? అనే అంశాలపై ఆరా తీసినట్టు తెలుస్తోంది. ఈ కార్యకలాపాలకు నిధులు ఎక్కడి నుండి అందుతున్నాయి? విదేశీ లింకులు ఏమైనా ఉన్నాయా? అనే కోణంలో విచారణ సాగినట్టు సమాచారం. వారి తదుపరి ప్రణాళికలు ఏమిటి? రాష్ట్రంలో ఏవైనా విచ్ఛిన్నకర చర్యలకు ఎ÷-లాన్ చేశారా? అన్న విషయాలపై పోలీసులు ప్రశ్నలు కురిపించారు. కస్టడీ గడువు ముగియడంతో, పోలీసులు నిందితులను వైద్య పరీక్షల అనంతరం విజయవాడ కోర్టులో హాజరుపరిచారు. నిందితుల నుంచి సేకరించిన ప్రాథమిక ఆధారాలను, విచారణ నివేదికను పోలీసులు న్యాయమూర్తికి సమర్పించారు. పోలీసుల వాదనలను విన్న న్యాయస్థానం, నిందితులకు ఏప్రిల్ 20 వరకు రిమాండ్ విధిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో పోలీసులు వారిని తిరిగి జైలుకు తరలించారు. ఈ కేసులో మరింత సమాచారం కోసం నిందితుల డిజిటల్ పరికరాలను (ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు) ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపినట్లు తెలుస్తోంది.

# ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసు

## - ఢిల్లీ హైకోర్టులో విచారణ
## - దర్యాప్తు సంస్థల తీరుపై మండిపడ్డ కేజ్రీవాల్

**న్యూఢిల్లీ,ఏప్రిల్13 (ప్రజా వీక్షణం)**

ఢిల్లీ లిక్కర్ స్కాం కేసు విచారణనుంచి జస్టిస్ స్వర్ణకాంత శర్మను తొలగించాలని కోరుతూ ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి కేజీవ్రాల్ హైకోర్టులో పిటిషన్ వేసిన సంగతి తెలిసిందే. సోమవారం హైకోర్టు పిటిషన్‌పై విచారణ జరిపింది. కేజీవ్రాల్ స్వయంగా తన వాదనలు వినిపించారు. విచారణ పక్రియలో పక్షపాతం ఉండవచ్చంటూ ఆందోళన వ్యక్తం చేశారు. విచారణ సందర్భంగా సాక్షుల వాంగ్మూలాలపై చేసిన వ్యాఖ్యలు తనను దోషిగా, అవినీతిపరుడిగా చిత్రీకరించేలా ఉన్నాయని కేజీవ్రాల్ కోర్టుకు తెలిపారు. దర్యాప్తు సంస్థలపై కూడా కేజీవ్రాల్ సంచలన ఆరోపణలు చేశారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్, సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ వంటి దర్యాప్తు సంస్థలు మొదట సాక్షులను అరెస్టు చేసి.. ఆ తర్వాత ఇతరులను ఇరికించేలా వారి నుండి బలవంతంగా వాంగ్మూలాలను తీసుకుంటున్నాయని అన్నారు.కాగా, ఈడీ నమోదు చేసిన రెండు వేర్వేరు కేసుల్లో కేజీవ్రాల్‌ను రౌస్ ఎవెన్యూ కోర్టు ఇటీవల నిర్దోషిగా ప్రకటించింది. దీనిని ఎన్‌ఫోర్స్‌మెంట్ డెరెక్టరేట్ హైకోర్టులో సవాలు చేసింది. ఈడీ పిటిషన్‌పై జస్టిస్ స్వర్ణకాంత శర్మ నేతృత్వంలోని ఏకసభ్య ధర్మాసనం ఏప్రిల్ 6వ తేదీన విచారణ జరిపింది. ఈ సందర్భంగా, కేజీవ్రాల్ సహా పలువురు దాఖలు చేసిన రెక్యూసల్ పిటిషన్లపై సమాధానం ఇవ్వాలని సీబీఐకి ధర్మాసనం నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణను ఈ నెల 13వ తేదీకి వాయిదా వేసింది.

# గ్యాస్ సిలిండర్ల అక్రమ నిల్వలపై దాడులు

## - రూ 1.50 కోట్ల విలువైన డొమెస్టిక్ సిలిండర్ల స్వాధీనం.
## - గత నెల రోజుల్లో 2,089 కేసులు నమోదు.
## - పౌరసరఫరాల శాఖ నిరంతర నిఘా

**హైదరాబాద్,ఏప్రిల్13 (ప్రజా వీక్షణం)**

గ్యాస్ సరఫరాలో గృహ వినియోగదారులకి ఎటువంటి ఇబ్బంది రాకుండా రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ నిరంతరం మానిటరింగ్ చేస్తున్నది. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర పౌర సరఫరాలు, నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆదేశాల మేరకు గ్యాస్ సిలిండర్ల ను అక్రమ నిల్వ, పక్కదారి పట్టించే వారిపై అధికారులు నిఘా ఉంచి, ఆకస్మిక తనిఖీలు చేస్తున్నారు. డొమెస్టిక్ సిలిండర్ల సరఫరా పక్రియ నిబంధనల ప్రకారం సకాలంలో జరిగేందుకు బుకింగ్స్ / డెలివరీలను కమాండ్ కంట్రోల్ ద్వారా ఆయా ఏజెన్సీ లతో రోజువారీగా చెక్ చేస్తున్నారు. గత నెల రోజులుగా నిర్వహించిన దాడుల్లో అక్రమంగా తరలిస్తున్న, నిల్వ ఉంచిన 5,079 డొమెస్టిక్ సిలిండర్లు, మరో 70 చిన్న సిలిండర్లను విజిలెన్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ రూ 1 కోటి 50 లక్షలు ఉన్నది. ఈ సందర్భంగా 2,089 కేసులు నమోదు చేశారు. వీరిపై చట్ట ప్రకారం చర్యలు చేపట్టారు. గ్యాస్ సిలిండర్ల అక్రమ నిల్వ, తరలింపు, డెలివరీ లో జాప్యంపై రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ ఏర్పాటు చేసిన టోల్ ఫ్రీ నెంబర్:1967 కు ఫిర్యాదు చేయాలని ప్రభుత్వం సూచించింది.

# మత మార్పిడి జరిగితే 5 ఏళ్లు జైలు శిక్ష

## - డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు హెచ్చరిక

**భీమవరం,ఏప్రిల్13 (ప్రజా వీక్షణం)**

మత మార్పిడి జరిగితే 5 ఏళ్లు జైలు శిక్ష తప్పదని ఏపీ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు హెచ్చరించారు. కొంతమంది మతమార్పిడి విషయంలో ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని రఘురామకృష్ణంరాజు అన్నారు. సోమవారం మత మార్పిళ్లపై రఘురామ మీడియాతో మాట్లాడుతూ.. 'సుప్రీంకోర్టు క్లియర్‌గా చెప్పింది.. ఆర్టికల్ 25 మతం మారే స్వేచ్ఛ ఇచ్చింది. మతతత్వాన్ని మార్చే అధికారం రాజ్యాంగానికి లేదు. దయచేసి హిందూ దళిత సోదరులను మోసం చేయకండి. క్రిస్టియన్‌లకు ఎస్సీ, ఎస్టీ కేసు పెట్టే హక్కు లేదని అన్నారు. గత నెలలో పశ్చిమ గోదావరి జిల్లా ఆకివీడు లోని పెదపేటలో శిథిలావస్థకు చేరిన రామాలయంలో శ్రీరామనవమి పూజలు నిర్వహించేందుకు వెళ్లిన రఘురామకృష్ణరాజుతో పాటు జనసేన నాయకులపైనా కత్తులు, మేకులతో ఆందోళనకారులు దాడి చేశారు. దళితుల ముసుగులో క్రైస్తవులు తమపై దాడికి దిగారని రఘురామ ఆరోపించారు. అన్య మతస్థులు అనుమతిస్తేనే గానీ శ్రీరాముడి దేవాలయానికి వెళ్లి దండ వేయలేని దుస్థితిలో ఉన్నామంటూ ఆవేదన వ్యక్తం చేశారు. మార్చి 29వ తేదీన రఘురామకృష్ణరాజు తన ఎక్స్ ఖాతాలో ఓ పోస్టు పెట్టారు. ఆ పోస్టులో.. 'ఆకివీడు పెదపేటలోని పురాతన రామాలయ పునర్నిర్మాణాన్ని ప్రముఖ హిందూ సంస్థల ఆధ్వర్యంలో.. ప్రముఖ స్థపతి డా. ఈమని శివనాగిరెడ్డి నేతృత్వంలో శిల్పకళ, వాస్తు, ఆగమ శాస్త్రం ప్రకారం.. పూర్తిగా కృష్ణ శిలతో అద్భుతంగా కనీసం 8 శతాబ్దాల పాటు చెక్కు చెదరని విధంగా త్వరలో నిర్మాణం చేపడతాము' అని రాసుకొచ్చారు. అయితే ఇలాంటి ఘటనలు సరికాదన్నారు. ఎవ్వరైనా దళితులుగా ఉంటూ మతం మారితే హక్కులు కోల్పోతారని అన్నారు.

ప్రజావీక్షణం దినపత్రిక

GENERAL NEWS

14 మంగళవారం, ఏప్రిల్ 2026

www.prajaveekshanam.in



# ఓటుకు..నోటుకు లంకె పెట్టినట్లు అనుకున్నారా

- మహిళా బిల్లు, డీలిమిటేషన్‌తో వచ్చే నష్టమేమిటో
- సిఎం వ్యాఖ్యలపై మండిపడ్డ మండి సంజయ్

**కరీంనగర్,ఏప్రిల్13 (ప్రజా వీక్షణం)**

డీలిమిటేషన్, మహిళా రిజర్వేషన్ల బిల్లులతో జరిగే నష్టమేమిటో చెప్పే దమ్ములేక రాజకీయం చేయాలనుకంటున్నారా అని సిఎం రేవంత్‌రెడ్డిని కేంద్రమంత్రి బండి సంజయ్ ప్రశ్నించారు. డీలిమిటేషన్‌లో భాగంగా ప్రతి రాష్ట్రాని 50 శాతం సీట్ల పెంచితే దక్షిణాదికి జరిగే నష్టమేంటని.. ప్రజల్లో లేనిపోని భయాందోళనలు సృష్టించి విభజించాలనుకుంటున్నారా అని నిలదీశారు. అసలు.. మీరు చెప్పే శాస్త్రీయత ఏమిటి..? డబ్బు సమకూర్చే వాళ్లకే ప్రాధాన్యత ఇవ్వాలని చెబుతున్నారా అని ప్రశ్నించారు. డబ్బుకు, ఓటుకు, సీటుకు లింకు పెడతారా..? లక్ష కోట్లు ఉన్న మీ కుటుంబానికి లక్ష ఓట్లు ఇవ్వాలా..? డబ్బులేని పేదవాడికి ఓటు హక్కు కల్పించొద్దా అని ప్రశ్నల వర్షం కురిపించారు. ముంబయికి, ఢిల్లీకి మాత్రమే అత్యధిక సీట్లు ఉండాలా.. వెనుకబడ్డ ఆదిలాబాద్, పాలమూరు జిల్లాలకు సీట్లు పెంచాల్సిన అవసరమే లేదా అని నిలదీశారు. మీ హైబ్రీడ్ మోడల్ అంటే ఇదేనా అని అన్నారు. ప్రతి అంశాన్ని రాజకీయం చేయడం తగదని చురకలంటించారు. ఇకపోతే చావైనా, బతుకైనా కరీంనగరేనని.. తుది శ్వాస వరకు బీజేపీలోనే ఉంటానని కేంద్ర మంత్రి బండి సంజయ్ స్పష్టం చేశారు. బండి సంజయ్ సైతం డాక్టర్ లక్ష్మణ్ మాదిరిగా ఏదో ఒక రాష్ట్రానికి వలస పోక తప్పదంటూ సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై కేంద్ర మంత్రి బండి సంజయ్ స్పందించారు. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. 'వలసపోవడానికి నేను అవకాశవాదిని కాదు. రేవంత్ రెడ్డిని అంతకంటే కాదు. చావైనా బతుకైనా కరీంనగరంతోనే... నా రక్తం కాషాయమే. నేను చనిపోతే నా శవంపై కప్పేది కూడా కాషాయ జెండానే. ఆ సన్నివేశం చూడటానికైనా రేవంత్ రెడ్డి నిండు నూరేళ్లు బతికి ఉండాలని కోరుకుంటున్నట్లు పేర్కొన్నారు.

# మహిళా రిజర్వేషన్లపై రేవంత్‌కు అవగాహన లేదు

- పార్లమెంట్ చర్చలో ఎంపిలు ఎవరైనా మాట్లాడవచ్చు
- రేవంత్ ఎక్స్ పోస్ట్‌పై కిషన్ రెడ్డి అభ్యంతరం

**హైదరాబాద్,ఏప్రిల్13 (ప్రజా వీక్షణం)**



మహిళా రిజర్వేషన్లపైన సీఎం రేవంత్ రెడ్డి అవగాహన లోపంతో మాట్లాడుతున్నారని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు. 15, 16, 17 తేదీల్లో పార్లమెంట్‌లో జరిగే చర్చలో అందరు ఎంపీలు మాట్లాడవచ్చని వెల్లడించారు. మహిళలకు చట్టసభల్లో రిజర్వేషన్లు కల్పించాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ నిర్ణయం తీసుకున్నారని వివరించారు. మహిళా రిజర్వేషన్లపై రాజకీయాలు చేయొద్దని కాంగ్రెస్‌ని కోరారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీకి మహిళా రిజర్వేషన్లు, డీలిమిటేషన్‌పై సీఎం రేవంత్‌రెడ్డి చేసిన ఎక్స్ పోస్టుపై కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి స్పందించారు. దశాబ్దాలుగా కాంగ్రెస్ పరిపాలన చేసిందని.. అంబేద్కర్ చెప్పిన మహిళల రిజర్వేషన్ల గురించి ఎందుకు పట్టించుకో లేదని కిషన్‌రెడ్డి ప్రశ్నించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మహిళలకు రిజర్వేషన్లు తీసుకువస్తుంటే కోడి గుడ్డు మీద ఈకలు పీకే ప్రయత్నం కాంగ్రెస్ నేతలు చేస్తున్నారని ఎద్దేవా చేశారు. 70 కోట్ల మంది మహిళల గౌరవాన్ని పెంచాలని.. వారికి హక్కులు కల్పించాలని రిజర్వేషన్లు తీసుకువస్తున్నామని చెప్పారు. తాము దక్షిణాదిలోనే ఉన్నామని.. ఎవరికీ అన్యాయం జరగకుండా మోదీ ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని వెల్లడించారు. మహిళలకు రిజర్వేషన్లు కల్పించాలంటే డీలిమిటేషన్ చేయాల్సిందేనని కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు. రాహుల్ గాంధీ, కాంగ్రెస్ నేతలు మహిళా రిజర్వేషన్లకు సహకరించాలని కోరారు. పూర్తిస్థాయి సెన్సెస్ రావాలంటే రెండు సంవత్సరాల సమయం పడుతుందని.. మిడిమిడి జ్ఞానంతో మాట్లాడవద్దని హితవు పలికారు. వారానికి ఒకసారి ఢిల్లీకి సీఎం రేవంత్‌రెడ్డి ఎందుకు వెళ్తున్నారో తెలంగాణ ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఒక కార్పొరేషన్ పదవి ఇవ్వాలన్న ఢిల్లీకి కట్టలు మోయాలని విమర్శించారు. బీజేపీ విధానం అది కాదని చెప్పారు. సీఎం రేవంత్ రెడ్డి మాటలు ఆయన విజ్ఞతకే వదిలేస్తున్నామని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు.

# మహనీయులు.. డాక్టర్ బీఆర్ అంబేద్కర్

- జయంతి సందర్భంగా

సిఎం రేవంత్ నివాళి

**హైదరాబాద్,ఏప్రిల్13 (ప్రజా వీక్షణం)**

భారత రాజ్యాంగ రూపశిల్పి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతి సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిఆ మహనీయునికి ఘన నివాళులు అర్పించారు. అణగారిన వర్గాల సంక్షేమం కోసం అంబేద్కర్ గారు చేసిన కృషిని ఆయన కొనియాడారు. దళిత, గిరిజన, బడుగు, బలహీన వర్గాలు, మహిళల సాధికారతకు ఆయన నిరంతరాయంగా కృషి చేశారని గుర్తు చేశారు. దేశ భవిష్యత్తును తనముందుచూపుతో ఊహించి, దార్శనికతతో రాజ్యాంగాన్ని రూపొందించిన అంబేద్కర్ గారు భావి తరాలకు స్ఫూర్తిగా నిలిచారని స్మరించారు. అణగారిన వర్గాల ప్రజల హక్కులకు అంబేద్కర్ గారు చేసిన పోరాటం యావత్ ప్రపంచానికి ఆదర్శమని చెప్పారు. ఆ మహనీయుని ఆశయాల సాకారానికి మనమంతా కృషి చేయాలని ముఖ్యమంత్రి గారు పిలుపునిచ్చారు. బాబాసాహెబ్ ఆలోచనల నుంచి ప్రేరణ పొందిన ప్రజాప్రభుత్వం ఎస్సీ ఉపకులాల వర్గీకరణ, బీసీ రిజర్వేషన్ల పెంపు వంటి కీలక నిర్ణయాలు తీసుకుందని గుర్తు చేశారు. ఎస్సీ ఎస్టీ సబ్ ఎ÷–లాన్ అమలు చేయటంతో పాటు రాష్ట్రంలో దళిత, గిరిజన వర్గాల సంక్షేమానికి ప్రాధాన్యమిస్తోందన్నారు. ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లలో గతంలో ఎప్పుడూ లేని విధంగా మెస్ ఛార్జీలు, కాస్మొటిక్ ఛార్జీలు ప్రజాప్రభుత్వంపెంచిందని గుర్తు చేశారు. ÷ూష్ట్రంలో ప్రతి నియోజకవర్గానికి యంగ్ ఇండియా ఇంటిగ్రేటేడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణం చేపడుతుందని అన్నారు. దీంతో అన్ని వర్గాలు, అన్ని మతాల పిల్లలందరూ ఒకే చోట నాణ్యమైన విద్యాబోధనను అందుకుంటారని ఆశాభావం వ్యక్తం చేశారు.

# ఐటి ఉద్యోగుల భద్రతపై ప్రత్యేక దృష్టి

- ఆదివాసీ, గిరిజనుల సమగ్ర అభివృద్ధికి కృషి
- సమస్యల పరిష్కారం పై ప్రత్యేక దృష్టి - సీఎం రేవంత్ రెడ్డి స్పష్టీకరణ

**హైదరాబాద్,ఏప్రిల్13 (ప్రజా వీక్షణం)**

ఆదివాసీ, గిరిజన ,ఏజెన్సీ ప్రాంతాల సమగ్ర అభివృద్ధికి అన్ని రకాల చర్యలు తీసుకుంటామని ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. మౌలిక వసతుల కల్పన కు అడ్డంకిగా ఉన్న సమస్యల పరిష్కారం పైన ప్రత్యేక దృష్టి సారిస్తానని ఆయన తెలిపారు. ఆదివాసీ, గిరిజన,ఏజెన్సీ ప్రాంతాల్లో అభివృద్ధి పనుల పైన మంత్రి సీతక్క నేతృత్వంలో గిరిజన,ఆదివాసీ ఎమ్మెల్యేల బృందం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని జూబ్లీహిల్స్ నివాసంలో కలిసి పలు సమస్యల పరిష్కారం కోసం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతు ఆదివాసీ,గిరిజనుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నామన్నారు. ఏజెన్సీ ప్రాంతాల్లో చెక్ డ్యాం ల నిర్మాణంపైన దృష్టి సారిస్తామని వారికి సీఎం హామీ ఇచ్చారు. వీటి ద్వారా తాగు, సాగు నీటి అవసరాలను తీర్చవచ్చునని ఆయన అన్నారు. చెక్ డ్యాం లు, రహదారుల నిర్మాణం కోసం అటవీ శాఖ నుంచి ఎలాంటి ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకుంటామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు. వీలైనంత త్వరగా అటవీ శాఖ నుంచి అనుమతులు వచ్చేలా చూస్తానన్నారు. ఆదివాసీ,గిరిజన రైతులు సాగు చేస్తున్న భూముల్లో బోర్లు వేయడానికి అనుమతులు ఇవ్వాలని చేసిన విజ&ఝప్తికి ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించారు. అటవీశాఖ అభ్యంతరాల వల్ల రహదారుల మరమ్మత్తులు ఆలస్యం అవుతాయని, కొన్ని చోట్ల కొత్త రహదారులకు అనుమతులు ఇవ్వడం లేదని వారు సీఎం దృష్టికి తీసుకువచ్చారు. వీలైనంత త్వరగా వీటిపైన నిర్ణయం తీసుకోవాలని ముఖ్యమంత్రి అటవీ శాఖ అధికారులను ఆదేశించారు. ఆదివాసీ, గిరిజన ప్రాంతాల్లో ఇందిరమ్మ ఇళ్ల కోటా పెంచే విషయాన్ని పరిశీలిస్తామని ఈ సందర్భంగా ఆయన వారికి హామీ ఇచ్చారు.ఐటీడీఏ లను మరింత బలోపేతం చేస్తామన్న ముఖ్యమంత్రి ఆదివాసీ, గిరిజనులకు అన్ని విధాలుగా అండగా ఉంటామని స్పష్టం చేశారు. ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు, పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, మహబూబాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ మురళి నాయక్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారిని కలిసిన వారిలో ఉన్నారు.

# పోచారం గారు ఆర్థిక పరిస్థితి అర్థం చేసుకోండి

- టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్

కీలక వ్యాఖ్యలు

**నిజామాబాద్,ఏప్రిల్13 (ప్రజా వీక్షణం)**





రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ కీలక వ్యాఖ్యలు చేశారు. సోమవారం మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగాలేదని, ఇబ్బందులు ఉన్న విషయం పోచారం శ్రీనివాస్ రెడ్డికి తెలుసని అన్నారు. కొంచెం ఓపిక పట్టాలని, త్వరలోనే అన్నీ సర్దుకుంటాయని స్పష్టం చేశారు. కేటీఆర్ రెండు విషయాలు స్పష్టంగా ఒప్పుకున్నారని.. దోపిడీ దౌర్జన్యం చేశామని అంగీకరించారని మహేశ్ విమర్శించారు. ప్రజాస్వామ్యంలో ఎవరైనా పాదయాత్ర చేయవచ్చని.. స్వాగతిస్తామని తెలిపారు. అయితే పాదయాత్రలో ప్రజలకు వాస్తవాలు చెప్పాలని సూచించారు. గత 10 ఏళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఆర్థిక విధ్వంసానికి పాల్పడిందని టీపీసీసీ చీఫ్ ఆరోపించారు. సింగరేణిలో విద్యుత్ కొనుగోళ్లలో బీఆర్ఎస్ అవినీతి చెరిపేస్తే చెదిరేది కాదని వ్యాఖ్యానించారు. బీజేపీ, బీఆర్ఎస్‌లు కలిసి భారతీయ జనతా రాష్ట్ర సమితిగా మార్చినా తమకు ఇబ్బంది లేదని చెప్పారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి తిరుగు లేదని ధీమా వ్యక్తం చేశారు. కవితకు తమకు ఏంటి సంబంధం అని ప్రశ్నించారు. ప్రజాస్వామ్యంలో ఎవరు పార్టీ పెట్టుకున్నా స్వాగతిస్తామన్నారు. వారి కుటుంబ వాటాల పంచాయితీని తమపై అంటగట్టవద్దని టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు.

# అభిమానుల కోలాహలం మధ్య వంకా కాంచనమాల పుట్టినరోజు వేడుకలు

**పోలవరం:ప్రతినిధి ఏప్రిల్ 14 (ప్రజా వీక్షణం)**

భారతీయ జనతా పార్టీ (బీజేపీ) రాష్ట్ర ఎస్టీ మోర్చా కార్యదర్శి వంకా కాంచనమాల పుట్టినరోజు వేడుకలు బుట్టయిగూడెం మండల కేంద్రంలో ఘనంగా జరిగాయి. ఏజెన్సీ ప్రాంత గిరిజన మహిళా నేతగా తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న ఆమెకు శుభాకాంక్షలు తెలిపేందుకు పార్టీ కార్యకర్తలు, అభిమానులు తరలివచ్చారు.అలాగే మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయం వద్ద కార్యకర్తలు ఆమెకు పూలమాలలతో ఘనస్వాగతం పలికారు.ఈ సందర్భంగా అభిమానుల సమక్షంలో ఆమె కేక్ కట్ చేసి తన పుట్టినరోజు వేడుకలను జరుపుకున్నారు. గిరిజన ప్రాంత సమస్యలపై నిరంతరం గళం ఎత్తుతున్న ఆమెకు జిల్లా స్థాయి నేతల నుండి కూడా ఫోన్ ద్వారా శు భాకాంక్షలు వెల్లువెత్తాయి.అలాగే వేడుకల అనంతరం ఆమె కార్యకర్తలతో కొద్దిసేపు ముచ్చటించారు. రాబోయే రోజుల్లో పార్టీని గిరిజన గ్రామాల్లో మరింత బలోపేతం చేయాలని, కేంద్ర ప్రభుత్వ పథకాలను ఇంటింటికీ తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. వేడుకల్లో పాల్గొన్న నాయకులు మాట్లాడుతూ, కాంచనమాల నాయకత్వంలో మండలంలో పార్టీ మరింత పటిష్టమౌతోందని కొనియాడారు. ఆమె మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని, ప్రజా సేవలో సుదీర్ఘకాలం కొనసాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బుట్టయిగూడెం మండల బీజేపీ నేతలు, యువజన మరియు మహిళా మోర్చా సభ్యులు, ఇతర అనుబంధ విభాగాల ప్రతినిధులు పాల్గొన్నారు.



# అదుపుతప్పి కారు బోల్తాఇద్దరు యువకుల దుర్మరణం

**కడప,ఏప్రిల్13 (ప్రజా వీక్షణం)**

జిల్లాలో విషాదం చోటుచేసుకుంది. కారు అదుపుతప్పి బోల్తా పడిన ఘటనలో ఇద్దరు యువకులు ప్రాణాలు కోల్పోయారు. సోమవారం ఈ సంఘటన చోటుచేసుకుంది. పోలీసుల ప్రాథమిక దర్యాప్తులో తేలిన వివరాల మేరకు.. అట్లూరు గోపవరం మండలానికి చెందిన చెన్నకేశవులు, శివచందులు కారులో ప్రయాణిస్తున్నారు. బద్వేల్ పట్టణ శివారులోని మడకలవారిపల్లె దగ్గర కారు అదుపుతప్పి బోల్తా పడింది. దీంతో కారులో ప్రయాణిస్తున్న చెన్నకేశవులు, శివచందు తీవ్ర గాయాలపాలయ్యారు. సమాచారం అందుకున్న పోలీసులు హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకున్నారు. స్థానికుల సాయంతో గాయపడ్డ ఇద్దరినీ దగ్గరలోని ఆస్పత్రికి తరలించారు. వారిని పరీక్షించిన వైద్యులు అప్పటికే చనిపోయినట్లు ధ్రువీకరించారు. పోలీసులు మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

## ఒడ్డెరాజుల కళా నైపుణ్యం

# ‘సింహాచల దేవాలయం’

శ్రీ సింహాచల క్షేత్రంలో ఈనాడు మనకు కనిపిస్తున్న ఆలయ స్వరూపం,దాని నిర్మాణ విశేషాలు,నిర్మాణము చేసిన మహనీయులు ఒక పరిశీలన గురించి తెలుసుకోవాలి ప్రపంచ చరిత్రకారులు.ఒడ్డెరాజుల చరిత్ర,సంస్కృతి,సంప్రదాయాలు మేధావి వర్గం ఆలోచన చేయాలి.నిక్కచ్చిగా ఉన్న చరిత్రను కాల గర్భంలో కలిపేసి పుక్కిటి పురాణాల చరిత్రలను లోకానికి పరిచయం చేసారు.ఒడ్డెరాజుల పరిపాలన ప్రపంచంలో తిరుగులేని చరిత్రను తిరగ రాసుకున్నారు.ఇంతటి గొప్ప తెలుగు రాజులు పాలన మరెక్కడా చూడలేరు.అలాంటి వాతిలో శ్రీ సింహాచల క్షేత్రం చాలా అపురూపమైనది,అబ్బురమైనది,విలక్షణమైన క్షేత్రం.సింహగిరి పడుకున్న సింహంలా బాసిస్తున్న పర్వతం.ఇక్కడ ప్రకృతి రమణీయకత నాన్యత్ర దర్శనీయం.ఇక ఆలయం మాటకొస్తే జిలుగుకు సింహాచలం అని పూర్వ వ్యవహారం.జిలుగు మువ్వంపు శిల్పాల కానాచి సింహాచలం.ప్రస్తుతం మనకు దర్శనమిస్తున్న ఆలయం క్రీస్తు శకం 1268వ సంవత్సరంలో సూర్యవంశ వడియరాజు లాంగుల నరసింహ దేవగజపతి ఆజ్ఞ మేరకు, ఆఖ్తాయి సేనాపతి నేతృత్వంలో విమానం,కలశ స్థాపన,ముఖ మండపం, నాట్య మండపం,తిరుచుట్టు మాల్యా నిర్మాణం పూర్తి చేసినట్టు ఆలయ కుడ్యాలపై ఉన్న శాసనాల్లో 55వ స్తంభంపై చెక్కిన శాసనం ద్వారా తెలియ వస్తుంది. ఈ నిర్మాణం పూర్తి చేసి కలశాభిషేకం చేసిన మహనీయులు ఆఖ్తాయి సేనాపతి తనకు నియమించిన కార్యమును పూర్తి చేసిన శుభ సందర్భంగా 45 గంధ మాడలు శ్రీవారి భండారనికి సమర్పిస్తూ వాటిని ఎలా ఎలా వినియోగించాలో నిబంధనలను కూడా చేశారు. ఈ శాసనం శ్రీవారు బండారానికి ఎడమ వైపున ఉన్న ఉన్న స్తంభంపై ఉంది.

### ఆలయ నిర్మాణం కళ నైపుణ్యం

ఈనాడు మనందరం దర్శిస్తున్న అద్భుతమైన ఆలయాన్ని నిర్మాణాన్ని సంకల్పించిన శ్రీ వీర నరసింహాదేవ గజపతి, ఆలయాన్ని తన ప్రత్యక్ష పర్యవేక్షణలో నిర్మింప చేసిన ఆఖ్తాయి సేనాపతినీ ఆలయ నిర్మాణం పూర్తయి కలిసాభిషేకం చేసిన తిథి అయిన కార్తీక శుద్ధ పంచమి తిథి నాడు తలుచుకోవడం మన కనీస ధర్మంగా భావిస్తూ ఇంత అపురూపమైన శిల్ప సంపదను మనకు అందించిన శ్రీ వీర నరసింహునుకి మనమంతా స్మరించుకోవాలిసిన అవసరం ఉంది.కార్తీక శుద్ధ పంచమి తిధిని ప్రస్తుత ఆలయ శిల్పకళా నైపుణ్యంకు వీర శ్రీ నరసింహదేవ గజపతి వారి గురించి కొన్ని విశేషాలు తెలుసుకుందా!..వీర శ్రీ లాంగుల నరసింహ గజపతిరాజు 1238 నుంచి 1264 వరకు కళింగ రాజ్య పాలన చేశారు.తన పాలనా కాలంలో వీరు తీసుకున్న నిర్ణయాలు చర్యల వలన 400 సంవత్సరాల పాటు కళింగ రాజ్యం విదేశీయుల హస్తగతం కాకుండా ఉంది.వారి ఆస్థాన పండితులైన విద్యాధర పండితులు వారిని కీర్తిస్తూ యవనబని బల్లవ,హం వీరమని మర్దక,దుర్గా పుత్ర, పురుషోత్తమ పుత్ర అని సంబోధించారు.తురుష్క దండయాత్రలు నిర్జించి, బెంగాల్ నవాబులు దించి సువిశాలమైన సుసంపన్నమైన కళింగ సామ్రాజ్యాన్ని వారు స్థాపించారు.తురుష్కుల పై విజయానికి చిహ్నంగా కోణార్క్ దేవాలయాన్ని 1258 లో వారు నిర్మాణం కావించారు.

వీరు శ్రీకూర్మ దేవాలయాన్ని కూడా నిర్మాణం కావించారు. గజపతి బిరుదులు వహించిన మొట్టమొదటి చక్రవర్తి కాకతీయ గణపతి దేవునితో చేసిన యుద్ధం వారి చివరి యుద్ధం తన తండ్రి కాలం నుంచి ఉన్న సరిహద్దు సమస్యను పరిష్కరించి తన తండ్రి ఆనంగ భీముని కాలములో కాకతీయుల



వశమైన భూభాగాన్ని దక్కించుకుని గోదావరి తీరాన్ని కళింగ సామ్రాజ్య సరిహద్దుగా చేసుకున్నారు.

### ఒడ్డెరాజులు దేవాలయ నిర్మాణాల ఔన్నత్యం

కాకతీయుల యుద్ధం తరువాత శ్రీకూర్మం సింహాచలం దేవాలయం సందర్శన కావించారు.అప్పటికే నిర్మాణమై దివ్య క్షేత్రంగా భాసిల్లుతున్న సింహాచలానికి విమాన నిర్మాణానికి ఆజ్ఞలు ఇచ్చి నిర్మాణ పర్యవేక్షణ కావించారు.1264 సంవత్సరంలో వారి చివరి శాసనం శ్రీకూర్మం దేవాలయంలో లభించింది.వారి తుదిశ్వాస సింహాచలంలో విడిచారని,వారి వారసుడు భాను దేవుని పట్టాభిషేకం సింహాచలంలో జరిగిందని కొన్ని ఆధారాలు మనకు తెలియజేస్తున్నాయి.1264 మే నెలలో వారి అంత్యక్రియలు భాను దేవుని పట్టాభిషేకం జరిగిందని తెలియ వస్తుంది.అప్పుడే రామాలయ నిర్మాణం ప్రారంభం అయ్యింది.వీర నరసింహ గజపతి జీవించి ఉన్నప్పుడు చాలావరకు పూర్తయిన నిర్మాణాన్ని భానుదేవులు పూర్తి చేశారని, 1268 సంవత్సరానికి ఇప్పుడు మనం కనిపిస్తున్న దేవాలయం నిర్మాణాలు అందుబాటులోకి వచ్చాయని తెలుస్తోంది.ఎన్నో మహా యుద్ధాలు చేసి, మహోన్నత నిర్మాణాలు కావించిన మహనీయుడు, సింహాచల దేవాలయ పునర్నిర్మాణధనుడు శ్రీ వీర నరసింహదేవా గజపతి వారిని దేవాలయ పునర్నిర్మాణ వార్షికోత్సవ సందర్భంగా గుర్తు చేసుకోవడం మనందరి కనీస బాధ్యత.త్రిక లింగాధిపతి,త్రిమత అనువర్తి అయినా నరసింహుని సేవలో తరించి సింహాచలానికి తన్నుతాను సమర్పించుకున్న నరసింహ గజపతి శతదా స్మరణీయుడు.

‘నమో నారసింహ! సింహగిరి నరహరి నమో నమో దయానిధి’

# రైతు ఆధారిత వ్యవసాయం ‘కార్తులు’ ప్రాధాన్యతలు

## కార్తుల వైశిష్ట్యం రైతు వ్యవసాయం ప్రాముఖ్యత

ఉపగ్రహ సమాచారం అందుబాటులో లేని కాలంలోనే నిత్యపరిశీలనతో వాతావరణాన్ని అంచనా వేస్తూ వ్యవసాయం చేశారు రైతులు. ఏడాది 27 నక్షత్రాలను 27 కార్తెలుగా (ఒక కార్తె సుమారు 14 రోజులు ఉంటుంది) విభజించి ఆయా కార్తెల్లో వాతావరణం తీరు, దానికనుగుణంగా చేయాల్సిన, చేయకూడని పనులను సామెతలుగా చెప్పారు.ఈ కార్తెలలోని వర్షపాతాన్ని బట్టి ఆ ఏడు అతివృష్టా, అనావృష్టా లేక సామాన్యమా చెప్పగలిగేవారు. తొలకరి వానలు మృగశిరబికార్తె (సుమారు జూన్ 8- 21)లో ప్రవేశిస్తాయి.మృగశిర కురిస్తే ముంగిళ్లు చల్లబడతాయి.మృగశిర చిందిస్తే మిగిలిన కార్తులు కురుస్తాయి. మృగశిర వర్షిస్తే మఖ గర్జిస్తుంది.మృగశిరలో తొలకరి వర్షిస్తేనే మఖలో వర్షాలు పడతాయి,మృగశిర చిందిస్తే ముసలెద్దు రంకె వేస్తుంది,మృగశిరలో వేసిన పైరు మేలు చేస్తుంది” తదితర సామెతలు సేద్యంలో మృగశిర ప్రాధాన్యాన్ని చెబుతాయి.ఆరుద్ర (జూన్ 22- జూలై 5) కార్తెలో వర్షాలు ఎక్కువ పడడం పంటకు చాలా అవసరం.ఆ అవసరాన్ని తెలిపేవే “ఆరుద్ర వాన అదను వాన,ఆరుద్ర కురిస్తే దారిద్ర్యం ఉండదు, ఆరుద్రకార్తె విత్తనానికి అన్నం పెట్టిన ఇంటికి చెరుపు లేదు, ఆరుద్రలో అడ్డెడు చల్లితే సులువుగా పుట్టెడు పండుతాయి” లాంటి సామెతలు.తరువాత కార్తెలు పునర్వసు (జూలై 6- 19) పుష్యమి (జూలై 20- ఆగష్టు 02). “పునర్వసు,పుష్యములు వర్షిస్తే పూరెడుపిట్ట అడుగైనా తడవదు” సామెత ఆ రోజుల్లో వానలు తక్కువ అనే అంశాన్ని తెలుపుతుంది.ఆపై వచ్చే ఆశ్లేష కార్తె(ఆగష్టు 3- 16)లో నాన్పుడు వర్షం కురుస్తుంది. నాట్లు కూడా త్వరగా సాగుతాయి.అధిక వర్షం సాగు పనులకు ఆటంకం కలిగిస్తుంది. అరికాలు తడి అయ్యేంత వర్షం నాట్లకు అనుకూలం.అందుకే “ఆశ్లేషలో ఊడిస్తే అడిగినంత పంట,ఆశ్లేషలో అడుగునకొక చినుకు అయినా అడిగినన్ని పండలేను అందట వరి. ఆశ్లేషలో అడ్డెడు చల్లడం మేలు” మొదలైనవి ఆశ్లేష కార్తెకు సంబంధించిన సామెతలు.మఖ (ఆగష్టు 17- 30) శ్రావణంలో వస్తుంది. వానలు ఎక్కువ. “మఖలో మానెడు చల్లడం కన్నా ఆశ్లేషలో అడ్డెడు చల్లడం మేలు,మఖలో చల్లిన విత్తనాలు మచ్చలు కనబడతాయి,మఖ ఉరిమితే వెదురు మీద కర్రయినా పండుతుంది” లాంటివి ఈ కార్తెలో చేయాల్సిన వ్యవసాయ పనుల గురించి తెలియచేస్తాయి. ముందు వచ్చే కార్తెలలో వర్షాలు అంతగా కురవక పోయినా వర్ష



ఋతువులో వచ్చే మఖ,పుబ్బ (ఆగష్టు 31- సెప్టెంబరు 13) కార్తెలలో తప్పక కురవాలి.లేకపోతే క్షామం తప్పదు. “మఖ పుబ్బలు వరుపయితే మహా ఎత్తయిన క్షామం,మఖలో పుట్టి పుబ్బలో మాడినట్లు” (పుట్టగొడుగులు మఖలో పుట్టి పుబ్బలో మాడిపోతాయి.ఏదైనా స్వల్పకాలంలోనే అణగిపోతే దీనిని వాడతారు) సామెతలు దీన్ని సూచిస్తాయి. “పుబ్బలో చల్లడం దిబ్బ మీద చల్లినట్లే” అనేది పుబ్బలో విత్తడం మంచిది కాదని చెబుతుంది.

### ఉత్తర చూసి ఎత్తరగంప

ఉత్తర కార్తె సెప్టెంబరు మధ్యలో వస్తుంది. ఖరీఫ్ పంట ఒకదశకు చేరుతుంది.ఈ కార్తె ప్రవేశించే నాటికి వానలు సరిగా పడకపోతే సాగు కష్టం అని చెప్పడమే ఈ సామెత ఉద్దేశం. దీన్ని సూచించేందుకే గంపను ఎత్తి పక్కన పెట్టమని చెప్పారు జానపదులు.ఉత్తరలో వరి నాటడానికి ఆలస్యం అవుతుంది.వేరుశనగ,సజ్జ, పప్పు ధాన్యాలు కూడా ఈ కార్తెలో విత్తకూడదు.జొన్న మాత్రం కొన్ని ప్రాంతాలకు అనుకూలం.ఉలవ అన్ని ప్రాంతాలలో చల్లడానికి మంచి అదును. అందుకే “ఉత్తర పదును ఉలవకే అదును” అనే సామెత పుట్టింది. “ఉత్తర ఉరుము తప్పినా, రాజుపాడి తప్పినా, చెదపురుగుకి రెక్కలొచ్చినా కష్టం,విశాఖ చూసి విడవర కొంప, ఉత్తర హస్తలు వృష్టికి ప్రమాణం” లాంటి సామెతలూ ఇలాంటివే.ఉత్తర తరువాత వచ్చేది హస్త (సెప్టెంబరు 27- అక్టోబర్ 11). ఆశ్లేషలో నాటిన వరిపంట హస్తకార్తె వచ్చే సరికి అనాకుపొట్ట దశకు వస్తుంది. చిత్తకార్తెలో (అక్టోబరు 11- 23) చిరుపొట్ట వస్తుంది.వెన్ను చిరుపొట్టతో ఉంటుంది. ఈ సమయంలో నీరు చాలా అవసరం.అప్పుడు వర్షం లేకపోతే పంట చేతికి రావడం కష్టం. “హస్త కురవక పోతే విత్తినవాడూ,విత్తని వాడూ ఒక్కటే,హస్తకు అనాకుపొట్ట, చిత్తకు చిరాకు పొట్ట,హస్త చిత్తలు ఒక్కటైతే అందరి సేద్యం ఒక్కటే, చిత్త కురిస్తే చింతలు కాస్తాయి,చిత్త స్వాతులు కురవకపోతే చిగురుటాకులు మాడిపోతాయి” లాంటి సామెతలు చాలా ఉన్నాయి.

### “యథా చిత్త తథా స్వాతి”

చిత్తలో వర్షం ఎలా ఉంటుందో, స్వాతిలో కూడా అలాగే ఉంటుంది.ఈ కార్తెలో సాధారణంగా గాలివానలు వస్తాయి. “స్వాతివాన చేనుకు హర్షం (మెట్ట ప్రాంతం), చిత్త చిత్తగించి, స్వాతి చల్లచేసి,విశాఖ విసరకుంటే వీసానికి పుట్టెడు పండుతానంటుంది జొన్న” లాంటి సామెతలు తెలుగులో ఎన్నో ఉన్నాయి.విశాఖ కార్తె వచ్చేప్పటికి వరి కోతకు సిద్ధంగా ఉంటుంది.వర్షం అవసరం ఉండదు.ఈ అనుభవంతో వచ్చిన సామెత “విశాఖ కురిస్తే పంటకు విషమే” .అయితే మఖ, పుబ్బల్లో చల్లిన ఆముదాలు విశాఖలో పొట్టమీద ఉంటాయి.అప్పుడు వాటికి వర్షం అవసరం. అందుకే “విశాఖ వర్షం ఆముదాలకు హర్షం” ! ఇక భరణి (ఏప్రిల్ 27- మే 10),కృత్తిక (మే 11- 24),రోహిణి (మే 25- జూన్ 7)లపై “భరణి కురిస్తే ధరణి పండును,కృత్తికలో విత్తితే కుత్తుకలు నిండవు,రోహిణిలో విత్తితే రోటిలో విత్తినట్లే” లాంటివి రైతుల ప్రకృతి పరిశీలనా దృష్టికి నిదర్శనాలు. ఊరిముందరి చేను,ఊళ్లో వియ్యం అందిరావు.ఊరికి సమీపంలో చేను ఉంటే ఊళ్లో ఉండేవారు,వచ్చిపోయే వారు,పశువుల బెడద.ఇంత కష్టం ఉంటుంది. ఇక ఊళ్లో వియ్యం సంగతి.భార్యా భర్తలిద్దరిది ఒకే ఊరయితే ఆ ఇంట్లో విషయం ఈ ఇంట్లో,ఈ ఇంట్లో విషయాలు ఆ ఇంట్లో తెలిసి సంసారం ఇబ్బందికరంగా సాగుతుంది.ఈ సామెత పుట్టుకకు కారణం ఇదే. “కర్ణునితో భారతం సరి. కార్తీకంతో వానలు సరి’. ఫాల్గుణమాసపు వాన పది పనులకు చెరుపు” ఇలా ఎన్నో సామెతలు జీవితానుభవం నుంచి పుట్టాయి.వందల ఏళ్లుగా ఈ విజ్ఞానం రైతులకు దారిదీపంగా నిలిచింది. ఇప్పుడు ఈ విజ్ఞానం రూపుమాసి పోతోంది. ఇప్పటి వారికి చాలా సామెతలు, ముఖ్యంగా వ్యవసాయ పనులకు సంబంధించినవి తెలియవు. వీటిని పాఠ్యప్రణాళికలో భాగం చేయాలి.అప్పుడే మనదైన విజ్ఞానం ముందుతరాలకు భద్రంగా అందుతుంది.

ప్రజావీక్షణం దినపత్రిక
ఎడిటర్ : కె. శ్రావణ్ కుమార్

# సంపాదకీయం

## అంబేడ్కర్ ఆశయాలకు పట్టం కట్టాలి !

అం బేద్కర్ మహాశయుడు ఈ దేశం గురించి గొప్పగా కలలు కన్నారు. తన దేశాన్ని ఉన్నతంగా చూడాలను కున్నారు. అస్పృశ్యతను పూర్తిగా నిర్మూలించడంతో పాటు, అందరికీ విద్య దక్కాలన్న ఆశయం ఆయనది. న్యాయవాదిగా, ఆర్థికవేత్తగా, రాజకీయవేత్తగా, సామాజిక సంస్కర్తగా, రాజ్యాంగ నిర్మాతగా భారతీయుల గుండెల్లో ఎప్పటికీ నిలిచిపోయే మహనీయుడు డాక్టర్ భీమ్‌రావ్ అంబేద్కర్. అంటరానితనాన్ని వ్యతిరేకిస్తూ.. దళితులు, మహిళలు, కార్మికుల హక్కుల కోసం అలుపెరుగని పోరాటం చేసిన యోధుడు అంబేద్కర్. దేశంలో అన్ని మతాలు, తెగలు, దళితులు, గిరిజనులు, వెనుకబడిన కులాలు తదితర వర్గాలకు సమ న్యాయం జరిగేలా, వారి హక్కులకు భంగం వాటిల్లకుండా ఉండేందుకు, సర్వసత్తాక సౌర్వభౌమాధి కారాన్ని దక్కించుకొనేందుకు వీలుగా అంబేద్కర్ రాజ్యంగాన్ని రూపొందించారు. వివిధ రకాల భాషలు, ఆచారాలు, మతాలూ ఉన్నటువంటి ఈ దేశంలో ఆయన ముందు చూపుతో రాసిన రాజ్యాంగం అనుసరించి ఇప్పుడు మన దేశం నడుస్తుంది అంటే ఆయన గొప్పతనం ఏంటో అర్థం అవుతుంది. ఆయన కేవలం దళితుల కోసమో లేక వాళ్ళ రిజర్వేషన్ ల కోసమో మాత్రమే కృషి చేయలేదు. ఆడవాళ్ళకి మగవాళ్ళకి సమానమైన జీతాలు ఉండాలని, ఆడవాళ్ళకి ప్రెగ్నెన్సీ టైం లో లీవ్స్ ఇవ్వాలని, పని గంటల సమయాన్ని 12 నుండి 8 గంటలు చేయాలనీ, స్త్రీలకూ ఆస్తి హక్కు ఇవ్వాలని ఇలా ఎన్నో అంశాలలో ఈయన కృషి చేసారు. అంబేద్కర్ జయంతిని పురస్కరించుకుని యావత్ భారతావని ఆయన ఆశయాలపై ఇప్పటికైనా అధ్యయనం చేయాలి. ఎంతసేపు అంబేద్కర్ పేరు చెప్పి విగ్రహాలు పెట్టడం, సభలు పెట్టడం కాదు. ఆయన దేశానికి అందించిన విలువైన సూచనలు పాటించలి. ఆయన కోరుకున్న సమాజం కోసం పాలకులు ఆలోచన చేయాలి. అందుకు నడుం బిగించాలి. జయంతి సభల్లో ఉపన్యాసాలు ఇవ్వడం మానాలి. ఒకానొక సమయంలో అంటరానితనం పేరు తో అట్టడుగు వర్గాల ప్రజల పరిస్థితి ఏవిధంగా ఉండేదన్నది ఆయన జీవితమే పెద్ద ఉదాహరణ. అప్పటి వరకు మూగ బోయిన అణగారిన ప్రజలకు గొంతుకయ్యాడు. అయితే కొందరు రాజకీయంగా ఆయనను ఎదగకుండా చేశారు. స్వాతంత్ర్యం రాగానే నెహ్రూ బదులు అండేబ్కర్‌ను ప్రధానిని చేసివుంటే మనదేశ రాత మరోలా ఉండేది. కానీ నెహ్రూ, గాంధీల కుట్రలకు ఆయన బలయ్యారు. భారత రాజ్యాంగ నిర్మాత, బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి, ఆర్థిక నిపుణుడు, దళితో ద్ధారకుడు, మహా మేధావి, బహుముఖ ప్రజ్ఞాశాలి, ఇలా ఆయన గురించి ఎంత చెప్పినా తక్కువే. అందుకే నేమో ఆయనను ఆనాటి నేతలు దూరం పెట్టారు. ఈనాటి నేతలు విగ్రహాలు పెట్టి, కేవలం చెక్క భజనలు చేస్తున్నారు. కానీ ఆయన స్వప్నించిన భారతాన్ని ఆవిష్కృతం చేసే ప్రయత్నాలు చేయడం లేదు. 1891 వ సంవత్సరం ఏప్రిల్ 14 వ తేదీన రాంజీ మాలోజి సక్పాల్ ,భీమాబాయ్ దంపతులకు మధ్యప్రదేశ్ లోని మావ్ గ్రామంలో మహర్ కులంలో అంబేద్కర్ జన్మించారు. అప్పట్లో ఈ కులం వారిని అంటరానివారిగా పరిగణించేవారు. దళితుడు అనే కారణంతో ఈయన చిన్న వయసు నుండే ఎన్నో అవమానాలు ఎదుర్కొన్నారు. చిన్నప్పుడు వాళ్ళ అన్నయ్యతో కలిసి వేరే ఊరుకి నడిచి వెళ్తుంటే బాగా దాహం వేయడంతో దగ్గరలో ఉన్న ఒక ఇంటికి వెళ్లి తాగడానికి నీటిని అడిగితే అంబేద్కర్ మహర్ కులానికి చెందిన వారు అని తెలిసి నీళ్లు ఇవ్వకపోగా, పక్కనే ఉన్న మురికి గుంటలో నీటిని తాగమని తిట్టి పంపించారు. ఇది ఒక ఉదాహరణ మాత్రమే. ఇలాంటి అనేక అవమానాలను అంబేద్కర్ ఎదుర్కొన్నారు. అందుకే ఇలాంటి వ్యవస్తను నిరసించాడు. అలాగని మిగతా కులాల వారిని ఏనాడూ ఆయన ఈసడించుకోలేదు. ఇది వ్యవస్తాగతమైన లోపంగా గుర్తించారు. తన ఆలోచనలను రాజ్యాంగ రచనలో చూపారు. భారత దేశం ఉన్నతంగా ఉండాని కోరుకున్నాడు. దేశ విభజనను తీవ్రంగా వ్యతిరేకించారు. ఇదే విషయాన్ని నిర్మొహమాటంగా చెప్పారు. కానీ వారెవ్వరూ అంబేద్కర్‌ను లెక్కచేయలేదంటే, ఆయన పట్ల వారికి గల ప్రేమానురాగాలు ఏపాటివో వేరుగా చెప్పాల్సిన పనిలేదు. అమెరికాలో మొదటి సారిగా అంబేద్కర్ స్వేచ్ఛ అంటే ఏంటో చూసారు. అప్పుడు భారత దేశంలో ఉన్నట్టుగా కుల, జాతి వివక్షత లేదు. అందరికి సమానమైన గౌరవం, అవకాశాలు దక్కేవి. 1917 లో అంబేద్కర్ వెనక్కి వచ్చి ఒప్పందం ప్రకారం బరోడా సంస్థానంలో రక్షణశాఖలో ఉద్యోగంలో చేరారు.క్కడ ఆయనకి ఒక గొప్ప అధికారిగా ఉద్యోగం దక్కింది కానీ ఈయన నిమ్న కులస్తుడు కావడంతో ఆయన కింద ఉండే ఉద్యోగులు కూడా ఆయనని గౌరవించే వారు కాదు. ఏదైనా ఒక ఫైల్ ఇవ్వాలంటే దూరం నుండే ఆయన టేబుల్ మీదకు విసిరేసేవారు. చదవాలన్న, పని చేయాలన్న, ఉండడానికి ఇల్లు కావాలన్నా, చివరికి నీళ్లు తాగాలన్న కూడా కులం అడ్డు వచ్చేది. ఉద్యోగం చేసుకుంటూనే 1927 నుండి అంటరానితనానికి వ్యతిరేకంగా ఉద్యమాలు చేయడం మొదలు పెట్టాడు. ఇలా మహద్ లో దళితుల మహా సభని ఏర్పాటు చేసారు. దేశంలో నలుమూలల నుండి కొన్ని వేళ మంది దళితులు ఆ సభకు హాజరయ్యారు. అప్పటివరకు దళితులు మహద్ లోని చెరువులో నీటిని తాగడానికి అనుమతి ఉండేది కాదు. కానీ అంబేద్కర్ ఆ సభలో దానికి వ్యతిరేకంగా పోరాడి ఆ చెరువులో నీటిని తాగడానికి అనుమతి వచ్చేలా చేసారు. కొల్హాపూర్ మహారాజ్ సాహు మహరాజ్ అస్పృశ్యత , అంటరానితనాన్ని నివారించడానికి కృషి చేస్తున్నారు అని తెలుసుకుని ఆయన సహకారంతో మూగ వాళ్ళకి నాయకుడు అనే అర్థం వచ్చేలా 'మూక్ నాయక్' అనే పత్రికను అలాగే బహిష్కృత్ భారత్, జనతా , ప్రబుద్ధ భారత్ అనే పత్రికలూ నడిపారు. ళితులకు బడులలోకి, గుడులలోకి వెళ్ళడానికి అనుమతి పొందేలా ఉద్యమాలు చేపట్టి విజయం సాధించారు. ఆయన అంత స్థాయికి ఎదిగారు అంటే కారణం చదువు. ÷ాబట్టే ఆయన అందరికి చదువు అందాలని కృషి చేసారు. ఆయితే సంపద కోసమో, అధికారం కోసమో పోరాటం చేయలేదు అట్టడుగు వర్గాల స్వేచ్ఛ కోసం ఆయన పోరాడేవారు. శోధించు, సమీకరించు, పోరాడు అనే సిద్దాంతంతో బడుగు బలహీన వర్గాల అభివృద్ధి కోసం, కులమాత బేధాలు లేని సమాజం కోసం కృషి చేసేవారు.స్వాతంత్రం వచ్చిన తరువాత అంబేద్కర్ కి కేంద్ర మండలిలో మొట్ట మొదటి న్యాయశాఖ మంత్రి గా పదవి వచ్చింది. అంతేకాదు భారత దేశపు రాజ్యాంగాన్ని రాసే అవకాశం దక్కింది. అయితే రాజ్యాంగం రచించడానికి నియమించిన సభ్యులలో ఒకరు రాజీనామా చేయడం, మరొకరు మరణించడం, కొంతమంది అమెరికాలో ఉండిపోవడం, మరికొంతమంది రాష్ట్ర రాజకీయాలలో నిమగ్నులవడం ఇలా రకరకాల కారణాల వలన భారత రాజ్యాంగం రచించే బాధ్యతంతా అంబేద్కర్ మీద పడింది. దాంతో ఆయన రాత్రీపగలు అనే తేడా లేకుండా నిరంతరం రాజ్యాంగ రచనలోని ఉండేవారు. తరువాత కొద్ది రోజులకి అనారోగ్యం కారణంగా 1956 డిసెంబర్ 6 వ తేదీన అంబేద్కర్ మరణించారు. ఆయన మరణించినగాని ఆయన కృషి ఇప్పటికీ ఎంతో మంది జీవితాలలో వెలుగుని నింపుతుంది. ఒకవేళ ఆయన పూనికుని ఉండకపోతే ఈనాటికి బడుగు బలహీన వర్గాల జీవితాలు ఇంకా అలాగే ఉండిపోయే వేమో.



## ఐపీఎల్ నుంచి రోహిత్ శర్మ ఔట్.. !?

ముంబైలోని వాంఖడే స్టేడియంలో ఆదివారం సాయంత్రం రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుతో జరిగిన మ్యాచ్ లో ఐదుసార్లు ఛాంపియన్ అయిన ముంబై ఇండియన్స్‌కు చేదు జ్ఞాపకాన్ని మిగిల్చింది. డిఫెండింగ్ ఛాంపియన్ బెంగళూరు చేతిలో ఘోర పరాజయాన్ని మూటగట్టుకున్న సంగతి తెలిసిందే. దీంతో ఇప్పటి వరకు 4 మ్యాచ్ లు ఆడిన ముంబై టీం కేవలం ఒక్క మ్యాచ్ లోనే గెలిచి, 3 మ్యాచ్ లు ఓడిపోయింది. ఈక్రమంలో ముంబై జట్టుకు మరో బిగ్ షాక్ తగిలింది. రోహిత్ శర్మకు తొడ కండరాల గాయం (హాంస్ట్రింగ్) కావడం జట్టును మరింత కష్టాల్లోకి నెట్టింది. ఇన్నింగ్స్ ప్రారంభంలో 13 బంతుల్లో 19 పరుగులు చేసిన రోహిత్, క్రీజులో ఉన్నంతసేపు అసౌకర్యంగా కనిపించాడు. ముంబైలోని విపరీతమైన ఉక్కపోతకు తోడు గాయం తీవ్రత పెరగడంతో, ఫిజియోతో చర్చించిన అనంతరం ఆయన మైదానాన్ని వీడాల్సి వచ్చింది.మ్యాచ్ ముగిసిన తర్వాత వెస్టిండీస్ ఆటగాడు షెర్ఫేన్ రూథర్‌ఫోర్డ్ మాట్లాడుతూ, రోహిత్ గాయం ఎంత తీవ్రంగా ఉందో ప్రస్తుతానికి ఖచ్చితంగా చెప్పలేమని పేర్కొన్నాడు. ఇది అభిమానుల్లో కొంత ఆందోళన రేకెత్తించింది. అయితే, తాజాగా అందుతున్న నివేదికల ప్రకారం రోహిత్ శర్మకు వైద్య పరీక్షలు నిర్వహించనున్నారు. సోమవారం నాడు ఆయనకు స్కానింగ్ పరీక్షలు జరుగుతాయని, ఆ ఫలితాల ఆధారంగానే తదుపరి మ్యాచ్‌లలో ఆయన భాగస్వామ్యంపై స్పష్టత వస్తుందని సమాచారం. పంజాబ్‌తో మ్యాచ్‌కు దూరం కానున్నారా?: ముంబై ఇండియన్స్ తమ తదుపరి మ్యాచ్‌లో పంజాబ్ కింగ్స్‌తో తలపడనుంది. అయితే, జట్టు యాజమాన్యం రోహిత్ విషయంలో ఎటువంటి రిస్క్ తీసుకోవాలని అనుకోవడం లేదు. ఒకవేళ గాయం స్వల్పమైనది అయినప్పటికీ, ముందు జాగ్రత్త చర్యగా పంజాబ్‌తో జరిగే మ్యాచ్‌లో ఆయనకు విశ్రాంతినిచ్చే అవకాశం ఉంది. ఐపీఎల్ సుదీర్ఘమైన టోర్నీ కావడంతో, కీలకమైన చివరి దశ మ్యాచ్‌ల కోసం రోహిత్‌ను సంపూర్ణ ఆరోగ్యంతో ఉంచాలని ముంబై యోచిస్తోంది.

# టీ20లో విరాట్ కోహ్లీ రికార్డ్



న్ మేషిన్ విరాట్ కోహ్లీ ఇండియన్ ప్రీమియర్ లీగ్ లో రికార్డులు సృష్టిస్తున్నాడు. ముంబై ఇండియన్స్ జట్టుపై ముంబై వేదికగా ఆడుతూ అరుదైన ఘనత సాధించాడు. ముంబై ఇండియన్స్ పై వెయ్యి పరుగులు చేసిన మొదటి క్రికెటర్‌గా కోహ్లీ చరిత్రలో నిలిచాడు. ఛాంపియన్స్ లీగ్ టీ20, ఇండియన్ ప్రీమియర్ లీగ్ రెండింటిలోనూ కలిపి ముంబై జట్టుపై కింగ్ కోహ్లీ వెయ్యి పరుగులు పూర్తి చేశాడు. ఈ ఘనత సాధించిన ఏకైక క్రికెటర్‌గా నిలిచాడు. వాంఖడే మైదానంలో ఆదివారం రాత్రి జరుగుతున్న మ్యాచ్‌లో 20 పరుగులు చేయడంతో కోహ్లీ ఈ ఘనత సాధించాడు. ఈ విషయంలో అతను భారత బ్యాటర్లు కేఎల్ రాహుల్, శిఖర్ ధావన్‌లను అధిగమించాడు. ఈ జాబితాలో ఏబీ డివిలియర్స్, డేవిడ్ వార్నర్ ఎక్కువ దూరంలో లేరు. విరాట్ రికార్డు మాత్రం చారిత్రాత్మకమైనది. ఎందుకంటే అతను ఒకే జట్టు తరపున ఆడుతూ ప్రత్యర్థి జట్టుపై ఏకంగా వెయ్యి పరుగులు పూర్తి చేశాడు. కేఎల్ రాహుల్ ముంబైకి వ్యతిరేకంగా వెయ్యి పరుగులు చేయడానికి కేవలం 23 పరుగుల చేరువలో ఉన్నాడు. అయితే కోహ్లీ మాత్రం ఒకే జట్టుకు ఆడుతూ ఈ ఫీట్ నమోదు చేసిన ఏకైక క్రికెటర్. ముంబై: రన్ మేషిన్ విరాట్ కోహ్లీ 2026లో రికార్డులు సృష్టిస్తున్నాడు. ముంబై ఇండియన్స్ జట్టుపై ముంబై వేదికగా ఆడుతూ అరుదైన ఘనత సాధించాడు. ముంబై ఇండియన్స్ పై వెయ్యి పరుగులు చేసిన మొదటి క్రికెటర్‌గా కోహ్లీ చరిత్రలో నిలిచాడు. ఛాంపియన్స్ లీగ్ టీ20, ఇండియన్ ప్రీమియర్ లీగ్ రెండింటిలోనూ కలిపి ముంబై జట్టుపై కింగ్ కోహ్లీ వెయ్యి పరుగులు పూర్తి చేశాడు. ఈ ఘనత సాధించిన ఏకైక క్రికెటర్‌గా నిలిచాడువాంఖడే మైదానంలో ఆదివారం రాత్రి జరుగుతున్న మ్యాచ్‌లో 20 పరుగులు చేయడంతో కోహ్లీ ఈ ఘనత సాధించాడు. ఈ విషయంలో అతను భారత బ్యాటర్లు కేఎల్ రాహుల్, శిఖర్ ధావన్‌లను అధిగమించాడు. ఈ జాబితాలో ఏబీ డివిలియర్స్, డేవిడ్ వార్నర్ ఎక్కువ దూరంలో లేరు. విరాట్ రికార్డు మాత్రం చారిత్రాత్మకమైనది. ఎందుకంటే అతను ఒకే జట్టు తరపున ఆడుతూ ప్రత్యర్థి జట్టుపై ఏకంగా వెయ్యి పరుగులు పూర్తి చేశాడు. కేఎల్ రాహుల్ ముంబైకి వ్యతిరేకంగా వెయ్యి పరుగులు చేయడానికి కేవలం 23 పరుగుల చేరువలో ఉన్నాడు. అయితే కోహ్లీ మాత్రం ఒకే జట్టుకు ఆడుతూ ఈ ఫీట్ నమోదు చేసిన ఏకైక క్రికెటర్. ఇండియన్ ప్రీమియర్ లీగ్ చరిత్రలో విరాట్ కోహ్లీ 4 వేర్వేరు జట్లపై వెయ్యికి పైగా పరుగులు చేశాడు. కోహ్లీ చెన్నై సూపర్ కింగ్స్‌పై 1174 పరుగులు చేయగా, పంజాబ్ కింగ్స్‌పై 1159 పరుగులు చేశాడు. కోల్‌కతా నైట్ రైడర్స్, ఢిల్లీ క్యాపిటల్స్‌పై కూడా వెయ్యికి పైగా పరుగులు చేసి సరికొత్త రికార్డులు నమోదు చేస్తున్నాడు. ముంబై ఇండియన్స్‌తో ఆదివారం జరుగుతున్న మ్యాచ్‌కు ముందు విరాట్ కోహ్లీ ముంబై ఇండియన్స్‌పై 922 పరుగులు చేశాడు. ఇతర టోర్నీలలోనూ ముంబైపై పరుగులు చేశాడని తెలిసిందే. ముంబైకి వ్యతిరేకంగా వెయ్యి పరుగులు పూర్తి చేయడానికి ఆదివారం జరిగిన మ్యాచ్‌లో 78 పరుగులు చేయాల్సి ఉంది. చరిత్రలో 8 వేలు లేదా అంతకంటే ఎక్కువ పరుగులు చేసిన ఏకైక బ్యాటర్ కోహ్లీనే.

## హార్ధిక్ పాండ్యకు లక్షల్లో జరిమానా..

వాంఖడే స్టేడియంలో ఆదివారం జరిగిన పోరులో ముంబై ఇండియన్స్ జట్టు అభిమానులను తీవ్రంగా నిరాశపరిచింది. ప్రస్తుత సీజన్‌లో 20వ మ్యాచ్‌లో భాగంగా రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుతో తలపడిన ముంబై, 22 పరుగుల తేడాతో ఓటమిని చవిచూసింది. గతేడాది విజేతగా నిలిచిన బెంగళూరు జట్టు అద్భుత ప్రదర్శనతో ఈ సీజన్‌లో తన మూడవ విజయాన్ని నమోదు చేయగా, ముంబైకి ఇది వరుసగా మూడవ పరాజయం.



సొంత మైదానంలో ఎదురైన ఈ ఓటమి జట్టు ప్రతిష్టను మసకబార్చింది. ఈ ఘోర పరాజయం తర్వాత కెప్టెన్ హార్దిక్ పాండ్యాకు మరో చేదు వార్త అందింది. నిర్ణీత సమయంలో ఓవర్లను పూర్తి చేయడంలో విఫలమైనందుకు (స్లో ఓవర్ రేట్) భారత క్రికెట్ నియంత్రణ మండలి అతనిపై కఠిన చర్యలు తీసుకుంది. ఐపీఎల్ క్రమశిక్షణ నియమావళి ప్రకారం, ఒక మ్యాచ్‌లో ఓవర్ల వేగాన్ని పాటించకపోతే జట్టు కెప్టెనే బాధ్యత వహించాల్సి ఉంటుంది. ఈ మేరకు హార్దిక్ పాండ్యాకు 12 లక్షల రూపాయల జరిమానా విధిస్తున్నట్లు నిర్వాహకులు అధికారిక ప్రకటన విడుదల చేశారు. కేవలం ఓటమి మాత్రమే కాకుండా, హార్దిక్ తీసుకున్న కొన్ని నిర్ణయాలు కూడా విమర్శలకు దారితీశాయి. అనుభవజ్ఞుడైన బౌలర్ శార్దూల్ ఠాకూర్‌ను పది ఓవర్ల తర్వాత రంగంలోకి దించడంపై క్రీడా విశ్లేషకులు పెదవి విరుస్తున్నారు. శార్దూల్ తన మొదటి ఓవర్‌లోనే వికెట్ తీసి సత్తా చాటినప్పటికీ, అతనికి ఆలస్యంగా బౌలింగ్ ఇవ్వడం వల్ల ప్రత్యర్థి జట్టు భారీ స్కోరు సాధించే అవకాశం లభించింది. సోషల్ మీడియాలో సైతం అభిమానులు హార్దిక్ కెప్టెన్సీపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. క్రికెట్ నిబంధనల ప్రకారం, పరిమిత ఓవర్ల మ్యాచ్‌ల్లో 20 ఓవర్లను ఒక నిర్దిష్ట సమయంలో పూర్తి చేయాలి. ఒకవేళ నిర్ణీత సమయం దాటినప్పటికీ ఓవర్లు పూర్తి కాకపోతే, అది క్రీడా స్ఫూర్తికి విరుద్ధంగా పరిగణిస్తారు. ఆదివారం నాటి మ్యాచ్ ముగియడానికి సాధారణం కంటే ఎక్కువ సమయం పట్టడంతో ప్రేక్షకులు కూడా ఇబ్బంది పడ్డారు. అందుకే తొలి తప్పుగా పరిగణిస్తూ హార్దిక్‌కు ఈ జరిమానా విధించారు.




## మహిళల టీ20 వరల్డ్ కప్ రికార్డ్ స్థాయిలో ప్రైజ్?మనీ

మహిళల క్రికెట్ చరిత్రలో మరో అద్భుతమైన ఫైట్ జరగనుంది. కేవలం 60 రోజుల్లో ఇంగ్లాండ్, వేల్స్ వేదికలుగా ప్రారంభం కానున్న ఐసీసీ మహిళల టీ20 ప్రపంచకప్ 2026 కోసం అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (×జజ) ఒక సంచలన నిర్ణయం తీసుకుంది. ఈసారి టోర్నీలో పాల్గొనే జట్ల కోసం రికార్డ్ స్థాయిలో ప్రైజ్ మనీని ప్రకటించింది. మహిళల క్రీడలకు ఆదరణ పెరుగుతున్న తరుణంలో, పురుషుల క్రికెట్‌తో సమానంగా పెట్టుబడులు పెట్టాలనే ఉద్దేశంతో ఐసీసీ ఈ అడుగు వేసింది. ప్రైజ్ మనీ పెంచడమే కాకుండా, టోర్నీని మరింత విస్తృతం చేస్తూ జట్ల సంఖ్యను కూడా పెంచడం విశేషం. ఈ నిర్ణయం మహిళా క్రికెటర్ల ఆత్మవిశ్వాసాన్ని రెట్టింపు చేయడమే కాకుండా, ప్రపంచవ్యాప్తంగా ఈ క్రీడకు కొత్త ఊపునివ్వబోతోంది. ఐసీసీ ప్రకటించిన వివరాల ప్రకారం, 2026 మహిళల టీ20 ప్రపంచకప్ మొత్తం ప్రైజ్ పూల్ విలువను 8,764,615 డాలర్లకు (సుమారు రూ. 73.4 కోట్లు) పెంచారు. ఇది 2024 ఎడిషన్‌తో పోలిస్తే 10 శాతం ఎక్కువ. గతంలో 10 దేశాలు పాల్గొన్న టోర్నీలో 7,958,077 డాలర్ల ప్రైజ్ మనీ ఉండేది. ఇప్పుడు జట్ల సంఖ్య 12కి పెరగడంతో బహుమతి మొత్తాన్ని కూడా ఐసీసీ భారీగా పెంచింది. క్రికెట్ రంగంలో మహిళా అథ్లెట్ల ప్రభావం పెరుగుతోందని, అందుకే పెట్టుబడులను కూడా అదే స్థాయిలో పెంచుతున్నామని ఐసీసీ సీఈఓ సంజోగ్ గుప్తా ఈ సందర్భంగా వెల్లడించారు. ఈ మెగా టోర్నీలో ట్రోఫీని ముద్దాడే జట్టుకు భారీ నగదు బహుమతి దక్కనుంది. విజేతగా నిలిచిన టీమ్ 2,340,000 డాలర్ల (సుమారు రూ. 19.5 కోట్లు) ప్రైజ్ మనీని సొంతం చేసుకుంటుంది. అలాగే రన్నరప్‌గా నిలిచిన జట్టుకు 1,170,000 డాలర్లు (సుమారు రూ. 9.7 కోట్లు) అందజేస్తారు. సెమీఫైనల్‌లో ఓడిపోయిన రెండు జట్లకు చెరో 675,000 డాలర్లు (సుమారు రూ. 5.6 కోట్లు) దక్కుతాయి. ప్రతి గ్రూప్ స్టేజ్ మ్యాచ్ గెలిస్తే అదనంగా 31,154 డాలర్లు (సుమారు రూ. 26 లక్షలు) ఇస్తారు. టోర్నీలో పాల్గొనే ప్రతి జట్టుకు కనీసం రూ. 2 కోట్ల ప్రైజ్ మనీని ఐసీసీ గ్యారెంటీ ఇచ్చింది. ఐసీసీ తీసుకుంటున్న ఇలాంటి నిర్ణయాలు మహిళా క్రికెట్ ఎదుగుదలకు ఎంతో అవసరం.

## కెప్టెన్సీ నాకు కొత్త కాదు: ఇషాన్ కిషన్



కెప్టెన్సీ తనకు కొత్త కాదని సన్‌రైజర్స్ హైదరాబాద్ కెప్టెన్ ఇషాన్ కిషన్ అన్నాడు. అండర్ 19 స్థాయి నుంచి తాను కెప్టెన్సీ చేస్తున్నానని గుర్తు చేశాడు. ఐపీఎల్ 2026 సీజన్‌లో భాగంగా రాజస్థాన్ రాయల్స్‌తో ఉప్పల్ వేదికగా జరుగుతున్న మ్యాచ్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగింది. టాస్ సందర్భంగా మాట్లాడిన ఇషాన్ కిషన్ తుది జట్టులో రెండు మార్పులు చేసినట్లు వెల్లడించాడు. 'మా తుది జట్టులో రెండు మార్పులు చేశాం. ప్రఫుల్ హింగే జట్టులోకి వచ్చాడు. నేను చాలా కాలంగా కెప్టెన్సీ బాధ్యతలు నిర్వహిస్తున్నాను. గతంలో భారత అండర్-19 జట్టుతో పాటు నా రాష్ట్ర జట్టుకు కూడా కెప్టెన్‌గా వ్యవహరించాను. సారథ్యం ఆట పట్ల మరింత ఏకాగ్రతతో ఉంచడంతో పాటు పరిస్థితులపై మంచి అవగాహన ఉండేలా చేస్తుంది. కెప్టెన్సీ అనేది వ్యక్తిగత ప్రదర్శన కంటే జట్టు ప్రదర్శనకే ప్రాధాన్యతనిస్తుంది. జట్టు కోసం మరిన్ని విజయాలు సాధించడానికి మేం సిద్ధంగా ఉన్నాం. కెప్టెన్‌గా ఉంటూ జట్టు కోసం బాగా రాణిస్తే అది ఆటగాడి పరిణతిని చూపిస్తుంది. గత కొన్నేళ్లుగా సారథిగా నా ప్రదర్శన నేను మళ్ళీ భారత జట్టులోకి పునరాగమనం చేసేందుకు సహాయపడింది.'అని ఇషాన్ కిషన్ పేర్కొన్నాడు.మరోవైపు టాస్ గెలిచిన రాజస్థాన్ రాయల్స్ బౌలింగ్ ఎంచుకుంది. పిచ్ కండిషన్స్ నేపథ్యంలోనే ఈ నిర్ణయం తీసుకున్నానని రాజస్థాన్ రాయల్స్ కెప్టెన్ రియాన్ పరాగ్ తెలిపాడు. 'మేం ముందుగా బౌలింగ్ చేస్తాం. ఇది మాకు కొత్త వికెట్. ఇది కొత్త వికెట్. ఇప్పటి వరకు వాడని పిచ్. కాబట్టి ఆరంభంలో కాస్త నెమ్మదిగా ఉండే అవకాశం ఉంది. ఈ మైదానంలో మేం చాలా సార్లు లక్ష్యాలను ఛేదించాం. 2024లో తృటిలో ప్లే ఆఫ్స్ అవకాశం కోల్పోయాం. ఈసారి అలా జరగకూడదని కోరుకుంటున్నాం. తుది జట్టులో రెండు మార్పుల ఉన్నాయి. బ్రిజేష్ స్థానంలో తుషార్ దేశ్‌పాండే వచ్చాడు. హెట్మెయర్‌కు విశ్రాంతి ఇచ్చి, ప్రిటోరియస్‌కు అవకాశం ఇస్తున్నాం. ఇక్కడి వరకు రావడం ఒక ప్రయాణంలా అనిపిస్తోంది. నేను చాలా కాలం సంజూ శాంసన్ భయ్యా ఆధ్వర్యంలో ఆడాను. ఆ తర్వాత సంగక్కర వ్యూహాత్మక విషయాల్లో నన్ను భాగస్వామిని చేస్తూ నా ఆటను మెరుగుపరిచారు. ఇప్పుడు ఆ బాధ్యతను నేను తీసుకున్నాను. కొన్ని కఠినమైన నిర్ణయాలు తీసుకోవాల్సి వచ్చినా.. ఇక్కడ ఉండటం సంతోషంగా ఉంది.'అని రియాన్ పరాగ్ తెలిపాడు.





# కండలు పెంచి..కొత్త లుక్‌లో ఎన్టీఆర్
## డ్రాగన్ కోసం ఎన్టీఆర్ కసరత్తులు

జూనియర్ ఎన్టీఆర్ , స్టార్ డైరెక్టర్ ప్రశాంత్ నీల్ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న డ్రాగన్‌పై అంచనాలు రోజురోజుకు పెరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో ఎన్టీఆర్ న్యూ లుక్ సోషల్ మీడియాలో వైరల్ అవుతూ అభిమానుల్లో ఉత్సాహాన్ని రెట్టింపు చేసింది. తాజాగా బయటకు వచ్చిన లుక్‌లో ఎన్టీఆర్ కండలు తిరిగిన దేహంతో, బీస్ట్ మోడ్‌లో కనిపిస్తున్నారు. సన్నని నడుముతో క్లాసిక్ బ్యాక్ డబుల్ బైసెప్స్ పోజ్‌లో ఆయన ట్రాన్స్‌ఫర్మేషన్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. పవర్‌ఫుల్ యాక్షన్ పాత్ర కోసం ఎన్టీఆర్ కఠినమైన ట్రైనింగ్, ప్రత్యేక డైట్‌ను ఫాలో అవుతున్నట్లు తెలుస్తోంది. జిమ్‌లో ప్రాక్టీస్ చేస్తున్న ఫోటోను షేర్ చేస్తూ ఇది కష్టపడి తెచ్చుకున్న కండలు..కొన్నవి కావు.. అని ఆయన రాసిన క్యాప్షన్ కూడా వైరల్ అవుతోంది. ఇటీవల ఎన్టీఆర్ లుక్‌పై కొంత అసంతృప్తి ఏర్పడిందని, దాని వలన షూటింగ్ నిలిచిపోయిందంటూ ప్రచారం జరిగిన విషయం తెలిసిందే. అయితే దీనిపై చిత్ర నిర్మాతలు స్పష్టత ఇచ్చారు. ఆ వార్తల్లో ఎలాంటి నిజం లేదని, ఇది కేవలం రెగ్యులర్ షెడ్యూల్ బ్రేక్ మాత్రమేనని తెలిపారు. ప్రస్తుతం షూటింగ్ అనుకున్న ప్రణాళిక ప్రకారమే కొనసాగుతోందని పేర్కొన్నారు. ఇప్పటికే జోర్డాన్‌లో ఒక షెడ్యూల్ పూర్తయినట్లు సమాచారం. అలాగే హైదరాబాద్ సమీపంలోని శంషాబాద్ ప్రాంతంలో కూడా కీలక సన్నివేశాలు చిత్రీకరించినట్లు తెలుస్తోంది. ముఖ్యంగా ఎన్టీఆర్‌పై యాక్షన్ సీక్వెన్స్‌లను చిత్రీకరించారని సమాచారం. తదుపరి షెడ్యూల్ కోసం భారీ సెట్స్ నిర్మాణం జరుగుతోంది. ఈ సినిమాలో విలన్ పాత్రపై కూడా ఆసక్తికర చర్చ నడుస్తోంది. తొలుత మలయాళ నటుడు టోవినో థామస్ ఈ పాత్రలో నటిస్తారని ప్రచారం జరిగింది. కానీ డేట్స్ సమస్యల కారణంగా ఆయన ప్రాజెక్ట్ నుంచి తప్పుకున్నట్లు వెల్లడించారు. ప్రస్తుతం ఈ కీలక పాత్ర కోసం బాలీవుడ్ స్టార్ షాహిద్ కపూర్‌ని సంప్రదించే ఆలోచనలో మేకర్స్ ఉన్నట్లు ఇండస్ట్రీ టాక్ వినిపిస్తోంది. ఈ పీరియాడికల్ యాక్షన్ డ్రామాలో హీరోయిన్‌గా రుక్మిణి వసంత్ నటిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్న ఈ చిత్రానికి సంబంధించిన మరిన్ని అప్‌డేట్స్ త్వరలో రానున్నాయి. జూన్ 25న విడుదల చేయాలనే ప్రణాళికలో ఉన్నట్లు సమాచారం.





# బాలకృష్ణ, గోపీచంద్ కాంబో థమన్ మ్యూడిజక్ డైరెక్టర్‌గా ఫిక్స్

నటసింహం నందమూరి బాలకృష్ణ మరియు మాస్ డైరెక్టర్ గోపీచంద్ మలినేని కలయికలో తెరకెక్కుతున్న తాజా చిత్రంపై సినీ వర్గాల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఇప్పటికే అనౌన్స్‌మెంట్‌తోనే హైప్ క్రియేట్ చేసిన ఈ ప్రాజెక్ట్ ఇప్పుడు మ్యూజిక్ పనులతో మరో అడుగు వేసింది. ఈ సినిమాకు సంగీత దర్శకుడు ఎస్.ఎస్. థమన్ ఇప్పటికే మ్యూజిక్ సిట్టింగ్స్ ప్రారంభించారు. తాజా సమాచారం ప్రకారం, రెండు ట్యూన్స్‌ను పూర్తిచేసిన థమన్, వాటిలో ఒక సాంగ్‌కి ప్రముఖ లిరిసిస్ట్ అనంత్ శ్రీరామ్‌తో పాట రాయించినట్టు తెలుస్తుంది. ఈ సాంగ్‌ను హైదరాబాద్‌లోని రామోజీ ఫిల్మ్ సిటీలో గ్రాండ్‌గా చిత్రీకరించేందుకు ఎ÷-లాన్ చేస్తున్నారు. ఈ సాంగ్ షూట్ పూర్తయ్యిన వెంటనే అక్కడే ఒక కీలక యాక్షన్ సీక్వెన్స్‌ను కూడా చిత్రీకరించనున్నట్లు సమాచారం. భారీ సెట్స్, విజువల్ గ్రాండియర్‌తో ఈ సన్నివేశాలు సినిమాకు ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయని చిత్ర వర్గాలు చెబుతున్నాయి. ఈ సినిమాకు సంబంధించిన అనౌన్స్‌మెంట్ పోస్టర్‌లో బాలకృష్ణను ఒక రాజుగా చూపించగా, హీరోయిన్‌గా నయనతార మహారాణి పాత్రలో కనిపించనున్నట్లు సంకేతాలు ఇచ్చారు. దీంతో ఇది ఒక పీరియాడికల్ యాక్షన్ డ్రామాగా రూపొందుతున్నట్లు స్పష్టమవుతోంది. ఇప్పటికే బాలయ్య?నయనతార కాంబినేషన్ ప్రేక్షకులను పలుమార్లు మెప్పించింది. వీరిద్దరూ కలిసి నటించిన సింహా, శ్రీరామ రాజ్యం, జై సింహా చిత్రాలు మంచి విజయాలను అందుకున్నాయి. ఇప్పుడు మరోసారి ఈ జోడీ తెరపై కనిపించనుండటంతో అభిమానుల్లో ఆసక్తి మరింత పెరిగింది. ఈ భారీ ప్రాజెక్ట్‌ను నిర్మాత సతీష్ కిలారు నిర్మిస్తున్నారు. అత్యున్నత సాంకేతిక ప్రమాణాలతో తెరకెక్కుతున్న ఈ చిత్రం కథ, సెట్స్, యాక్షన్ సన్నివేశాలు ప్రత్యేకంగా ఉండబోతున్నాయని టాక్ వినిపిస్తోంది. మొత్తానికి, బాలయ్య-గోపీచంద్ మలినేని కాంబోలో వస్తున్న ఈ పీరియాడిక్ మూవీపై రోజురోజుకూ అంచనాలు పెరుగుతుండగా, త్వరలోనే మరిన్ని అప్‌డేట్స్ రానున్నాయి.



# రణబాలి సెట్స్‌లోకి అడుగుపెట్టిన విజయ్ దేవరకొండ, రష్మిక

'రణబాలి' చిత్రంతో జంటగా ప్రేక్షకుల్ని అలరించనున్నారు విజయ్ దేవరకొండ - రష్మిక. వీళ్లిద్దరూ కలిసి నటిస్తున్న ఈ సినిమాని రాహుల్ సంకృత్యాన్ తెరకెక్కిస్తున్న సంగతి తెలిసిందే. మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ నిర్మిస్తోంది. ప్రస్తుతం చిత్రీకరణ దశలో ఉన్న ఈ సినిమా కోసం విజయ్ - రష్మిక తిరిగి సెట్‌లోకి అడుగు పెట్టారు. ఈ ఇద్దరూ వైవాహిక బంధంలోకి అడుగు పెట్టాక కలిసి సెట్‌లోకి రావడం ఇదే తొలిసారి కావడంతో చిత్ర బృందం వారికి స్వాగతం పలికి.. కేక్ కట్ చేయించింది. 1854 - 1978 మధ్య బ్రిటిష్ పాలనా కాలంలో జరిగిన వాస్తవ సంఘటనల ఆధారంగా ఈ చిత్రాన్ని ముస్తాబు చేస్తున్నారు. విజయ్ దీంట్లో టైటిల్ పాత్ర పోషిస్తుండగా.. ఆయన భార్య జయమ్మ పాత్రలో రష్మిక నటిస్తోంది. ఈ సినిమా సెప్టెంబరు 11న థియేటర్లలోకి రానుంది. ఈ చిత్రానికి సంగీతం: అజయ్ - అతుల్, ఛాయాగ్రహణం: నీరవ్ షా.







# సమ్మర్‌లో మూడు కొత్త సినిమాలు

ఈ వేసవి వేడిలో ప్రేక్షకులకు కూల్ ఎంటర్‌టైన్‌మెంట్ అందించేందుకు టాలీవుడ్‌లో చిన్న సినిమాలు సిద్ధమవుతున్నాయి. విలేజ్ కామెడీ ఎంటర్‌టైనర్స్ నుంచి ప్రేమ కథల వరకు విభిన్న జానర్లతో థియేటర్లలో సందడి చేసేందుకు కొన్ని ఆసక్తికర చిత్రాలు ఏప్రిల్ మూడో వారంలో విడుదలకు రెడీ అయ్యాయి.యంగ్ హీరో కిరణ్ అబ్బవరం నిర్మాతగా పరిచయం అవుతున్న తొలి చిత్రం తిమ్మరాజుపల్లి టివి. 90ల నాటి నేపథ్యంలో రూపొందిన ఈ విలేజ్ కామెడీ ఎంట్టంల్గ÷నర్ అప్పటి జీవనశైలిని, గ్రామీణ వాతావరణాన్ని గుర్తు చేసేలా ఉండబోతోంది. కొత్త ప్రతిభను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో దాదాపు కొత్త నటీనటులతో ఈ సినిమాను తెరకెక్కించారు. సాయితేజ్, వేద జలంధర్ హీరో హీరోయిన్లుగా పరిచయం అవుతుండగా, దర్శకుడు వి. మునిరాజు ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. ఈ సినిమా ఏప్రిల్ 17న ప్రేక్షకుల ముందుకు రానుంది. విభిన్న కథలను ఎంచుకుంటూ తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్న హీరో తిరువీర్ నటిస్తున్న తాజా చిత్రం పాపం ప్రతాప్. ఈ సినిమాలో పాయల్ రాధాకృష్ణ హీరోయిన్‌గా నటిస్తున్నారు. ప్రేమించి పెళ్లి చేసుకున్న ఓ జంట జీవితంలో కేవలం నాలుగు రోజుల్లోనే ఎదురయ్యే సమస్యల చుట్టూ కథ తిరుగుతుందని సమాచారం. దర్శకుడు ఎస్పీ దుర్గా నరేశ్ తెరకెక్కించిన ఈ చిత్రంలో అజయ్ ఘోష్, రఘుబాబు, ప్రసాద్ బెహర వంటి నటులు కీలక పాత్రలు పోషించారు.

# భరతవర్ష్ మూవీతో వస్తోన్న గోపీచంద్

యాక్షన్ హీరో గోపీచంద్ మరో భారీ ప్రాజెక్ట్‌తో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. వరుస ఫ్లాప్స్ తర్వాత సాలిడ్ హిట్ కోసం ఎదురుచూస్తున్న ఆయన ఈసారి పూర్తిగా భిన్నమైన కథతో 'భరతవర్ష' అనే పవర్‌ఫుల్ టైటిల్‌తో కొత్త సినిమాను ప్రకటించారు. టైటిల్ గ్లింప్స్ విడుదలయ్యాక సినిమా పై ఒక్కసారిగా భారీ అంచనాలు ఏర్పడ్డాయి. తాజాగా విడుదలైన గ్లింప్స్ వీడియోలో గోపీచంద్ యోధుడిగా కనిపిస్తూ ప్రేక్షకులను ఆకట్టుకున్నాడు. శత్రువులను ధైర్యంగా ఎదుర్కొంటూ యుద్ధరంగంలో విరుచుకుపడే సన్నివేశాలు గూస్‌బంప్స్ తెప్పించేలా ఉన్నాయి. విజువల్స్, బ్యాక్‌గ్రౌండ్ మ్యూజిక్, యాక్షన్ ఎలిమెంట్స్ అన్నీ కలిసి సినిమా గ్రాండ్‌గా ఉండబోతుందనే సంకేతాలు ఇస్తున్నాయి. 'భరతవర్ష' అనే టైటిల్‌కు కూడా ప్రత్యేకమైన అర్థం ఉంది. పురాణాల ప్రకారం భరతవర్షం అంటే హిమాలయాల నుంచి సముద్రం వరకు విస్తరించిన అఖండ భారతదేశాన్ని సూచిస్తుంది. చక్రవర్తి భరతుడి పేరుమీదుగా ఈ పేరు వచ్చినట్లు చరిత్ర చెబుతుంది. ఈ నేపథ్యంలో సినిమా దేశభక్తి, చరిత్ర, మైథాలజీ అంశాలను మేళవించి రూపొందుతున్నట్టు తెలుస్తోంది. ఇండిపెండెన్స్‌కు ముందు జరిగే పీరియాడిక్ యాక్షన్ థ్రిల్లర్‌గా ఈ చిత్రం తెరకెక్కుతున్నట్లు ఇండస్ట్రీ వర్గాల్లో టాక్ వినిపిస్తోంది. కథలో మైథాలజీ టచ్ కూడా ఉండే అవకాశం ఉందని సమాచారం. ఈ కలయికతో సినిమా మరింత ఆసక్తికరంగా మారనుందని విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ చిత్రంలో గోపీచంద్ సరసన రీతూ వర్మ హీరోయిన్‌గా నటిస్తోంది. ఆమె పాత్ర కూడా కథలో కీలకంగా ఉండబోతుందట. టెక్నికల్‌గా హై స్టాండర్డ్స్‌తో ఈ సినిమాను రూపొందిస్తున్నారని, మేకర్స్ ఎక్కడా రాజీ పడటం లేదని తెలుస్తోంది. గోపీచంద్ కెరీర్‌లో ఇది ఒక టర్నింగ్ పాయింట్ మూవీ అవుతుందా అనే ఆసక్తి అభిమానుల్లో నెలకొంది. ఇప్పటివరకు వచ్చిన గ్లింప్స్, టైటిల్ ప్రభావం చూస్తే 'భరతవర్ష'తో ఆయన బలమైన కంబ్యాక్ ఇవ్వడం ఖాయం అన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ సినిమా విడుదల తేదీపై త్వరలోనే అధికారిక ప్రకటన వచ్చే అవకాశం ఉంది.

Printed & published owned by K.SRAVAN KUMAR. Printed Published RK PRINTING PRESS at 6-1-948 Boyawada Street Nalgonda.Pin : 508001. Head office: 2-66-121/122 near ramky one Marvel gajullaramaram Quthbulapur medchal Malkajgiri district. RNI.NO.APTEL/2009/29433.(CELL ) 9866330400 prajaveekshanam@gmail.com